28-10-66



ఆంధ్రసచిత్రవార

పత్రిక



గౌరి ప్రొడక్షన్స్ సమర్పించు
భూలోకంలో యమలోకం
నిర్వహణ: వి. భావనారాయణ దర్శకత్వం: జి. విశ్వనాథం
కృష్ణమూర్తి సంగీతం: కోదండపాణి కెమెరా: వేణు
పూర్ణా రిలీజ్


తప్పక చూడండి!
హరిహరన్ ఫిలిమ్స్ వారి
ఆమె ఎవరు?
దర్శకత్వం. బి.యస్.నారాయణ / నిర్మాత. పి.యస్.వీరప్ప.
ఈస్టిండియా రిలీజ్.


చిరుద్యోగపర్వం

శ్రీ ఎల్.వి.ఎల్.ఎన్. శర్మ చిరునామా, వృత్తి గురించి ప్రశ్నిస్తూ ఒక పాఠకుడు రాయగా ఆయనికి మేము రాశాము. ఆయన జవాబుని పురస్కరించుకుని క్రింది వాక్యాలు ప్రచురిస్తున్నాము —

"చిరునామా:
రిసర్చి స్కాలర్,
E—22, హాస్టల్,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు, బెంగుళూరు —12'.

రచయిత ప్రస్తుతము 'యిండియన్ యిన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు' లోని 'యిండస్ట్రియల్ మేనేజిమెంటు' డిపార్టుమెంటులో డాక్టరేటుకు రిసర్చి చేస్తున్నారు. కథాస్థలం విజయవాడకాదు. (విరుద్యోగపర్వంలో కథాస్థలం విజయవాడ). అయినా ఏ స్థలమయితే నేమి? చిరుద్యోగులు (మరియు నిరుద్యోగులు) "యిందుగల రందు లేరని సందేహము వలదు!..." రచయిత కథాస్థలముగా గుంటూరును ఎంచుకున్నారు. బహుశ దీనిక్కారణం వారు గుంటూరులోని హిందూ కళాశాలలో ఏడాది క్రితంవరకు లెక్చరర్‌గా పని చెయ్యటమే కావచ్చు."

—సం.



ఉత్తరాలు

న్యూఢిల్లీ లేఖ

7—10—66 వారపత్రికలో శ్రీకృష్ణగారి "న్యూఢిల్లీ లేఖ" చదివినాను. చాలా బాగున్నది. లేఖలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రులు ఇద్దరిని పేర్కొనిరి. ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కేంద్రములో 6గురు కలరని తలంచెదను. లేఖలో పేర్కొన్నట్లు కేంద్రములో ఉత్తరాది దక్షిణాది వారు భేదములు స్వరాజ్యము వచ్చి 19 సం. లయిననూ ఇంకా యుండుట విచారకరము. లేఖలో పేర్కొన్నట్లు నిజముగా విజిలెన్సు కమీషన్ వారి రిపోర్టులో యున్నవారు 2 ,3 రూ.లు చేచిక్కించుకున్నవారనుట వాస్తవము. పెద్ద జీతగాళ్లకు రక్షణ వుంటున్నది. అవినీతి ఎక్కువయి పోయిన నేటి పరిపాలనలో దాని నిర్మూలన జరిగే రోజు ఎప్పుడు వచ్చునో కదా? దేశ రక్షణ ముఖ్యమయిన నేడు భాషాసమస్య కొంత కాలము పూరుకొన్న దేశములో భాషా సమస్యక సంబంధించిన అలజడులు ఏర్పడక ప్రశాంతముగా యుండునని నా అభిప్రాయము.

కూచిభొట్ల వెంకటేశ్వర్లు (రాజమండ్రి)

వ్యాసాలు

30—9—66 వ తేది సంచికలో ప్రచురించిన "మళ్లీ రంగు మారిన బంగారం" చదివిన తర్వాత ఈ ఉత్తరం వ్రాయాలనిపించింది.

దానిని సేకరించిన శ్రీ సి. డి. కే. మూర్తి చాల చక్కగా వ్రాశారు. ఆయన ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వారి అనుభూతులు వ్రాశారు. అందులో ఆ మూడవ తరగతి పిల్ల బేబి ఉమ చెప్పటం చాల హాస్యంగా వున్నది. మరియు యింకా ఇద్దరు చెప్పటమునూ చాలా చక్కగానే యున్నది, అనుభవపూర్వకముగాను వున్నది.

వి. యస్. గణేశన్ (లాలుగుడి)

కథలు

"గుడిగంటలు" కథా రచయితగా పరిచయమైన సినీనటుడు కె. వి. నాగేశ్వరరావు ఇటువంటి కథను రాసి పాఠకులకు అందివ్వడము చాలా కృతజ్ఞనీయుడు.

"బరితెగించిన ఆడది" పేరుకు కథకు ఎక్కడా పోలిక లేకున్నా చాలా తమాషాగా వుంది. ముఖ్యంగా కథలో యెదురింటి సాయిబుల కుర్రాడు రాకెట్‌లా దూసుకొచ్చి "సార్! మన భార్యగారు".... అన్న మాటలు చదివి నాలో నేనే ఓ అర్ధగంట సేపు నవ్వు ఆపుకోలేకపోయాను..

గండ్లూర సంటివీరారెడ్డి (కోకుటం)

* * *

"వారసుడు" కథలో చిన్న పొరపాటు ఉన్నందుకు విచారిస్తున్నాము. 27వ పేజీలో మూడవ కాలంలో— "కాని అప్పుడే తెలిసింది పెరుమాళ్ళుకి యింకా మిగిలిన చరిత్ర" అని ఉంది. కాని పెరుమాళ్ళుకి బదులుగా చిదంబరం అని ఉండాలి.

సి. డి. కె. మూర్తిగారి బంగారం గురించి వ్యాసం, "చిరుద్యోగ పర్వం" బాగున్నాయి.

కరాసి సుధాకరరావు (కసింగా)

* * *

అస్తవ్యానం మిలిటరీలో చేరినవారు చచ్చిపోవడం ప్లాటుగా తీసుకొని వ్రాసిన కథలు చదువుతుంటే మాకు (ఇంట్లో వాళ్లకి) మిలిటరీ అంటే భయంవేసి ఆ మాటే ఎత్తనివ్వరు. కాని ఈ వారం 30.9.66 దేశం కోసం కథ చదువుతూంటే కల్గిన ఆనందం వర్ణనాతీతం. రచయిత్రి గార్కి నా హార్దికాభివందనములు.

పి. జగన్నాథరావు (బాలుగాం)

* * *

"వదినమ్మ" కథ చదివాను. రచయిత శ్రీ యర్రంశెట్టి శాయి, బందరు హిందూ కాలేజీలో చదివారని అనుకుంటాను. అందుచేతనే మా హిందూ కాలేజీ వాతావరణాన్ని చాల చక్కగా కథలో పొందుపరచినారు. సుబ్బారావు, వదినమ్మ పాత్రలను, చివరికి వారి భావాలను చాల చక్కగ వ్యక్తీకరించారు.

కాని "క్లియోపాత్రా" సినిమా బందరులో రిలీజ్ కాకముందే బృందావన్‌లో సుబ్బారావు ఆ సినిమా చూచినట్లుగా రాసి రచయిత చిన్న పొరపాటు చేసినారు.

రత్నపాప (విజయవాడ)

* * *

యర్రంశెట్టిశాయిగారి 'గార్డు గోపాలం' కథ పైన శ్రీ గోవిందు చౌదరిగారి విమర్శ చదివాను. 'లవ్ లెటరు' అన్న పదము ఉద్యోగస్తుల పరిభాషలో విరివిగా వాడతారు. ఛార్జిషీట్లు మొదలగు వాటిని ఇలా ముద్దుగా పిలుస్తారు.

బి. ఫణిబాబు (పూనా)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 28-10-'66

పరాభవనామ సం॥ ఆశ్వయుజబహుళ॥ శ॥ ఏకాదశి

సంపుటము 59 సంచిక : 7

స్థాపితము:
1908

*
*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14-1-1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతరదేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్థసంవత్సర చందా	16.00

దీపావళి సంచికతో ప్రారంభం !

'కమ్యూనిస్టు చైనాలో నా అనుభవాలు'

రచన
గోరియా స్టువార్ట్

ఇటీవలే కమ్యూనిస్టు చైనా స్వయంగా చూసివచ్చిన ఒక బ్రిటిషు స్త్రీ విలేఖరి వ్యాసాలు ఫోటోలతోసహా దీపావళి సంచిక (11-11-'66) తో ప్రారంభం అవుతాయి.

మన లో మా ట

పై వారం ప్రారంభం అయే కొత్త సీరియల్ నవలకు సంబంధించిన ప్రకటనను ఈ సంచికలోని 7వ పేజీలో చూడవచ్చు...

* * *

శ్రీ సుక్థాంకర్ రాసిన 'దక్షిణాది వనితలు—నా అభిప్రాయాలు' కొన్ని వారాల క్రితం ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వేశాము. దక్షిణాది వారంతా రచయిత అభిప్రాయాలతో ఏకీభవించక పోవచ్చని అప్పుడే రాశాము. ఆ వ్యాసం మీద అనేక మంది అనేక రకాలయిన అభిప్రాయాలను రాశారు, వాటిలో ఒకరు రాసిన దాన్ని ఈ సంచికలోని 19వ పేజీలో వేశాము...

* * *

రాజధానిలో జరిగిన బాటిక్ చిత్ర ప్రదర్శనకు సంబంధించిన వివరాలను యిదే సంచికలో పాఠకులు చూడవచ్చు...

* * *

చిన్న సీరియల్ 'చిరుద్యోగ పర్వం' ఈ వారంతో ముగుస్తున్నది. రచయితను గురించిన వివరాలను తెలుపమంటూ కొందరు పాఠకులు ఉత్తరాలు రాస్తున్నారు. ఆ వివరాల్ని ఈ సంచికలోని ఉత్తరాల పేజీలో చూడవచ్చు...

* * *

నవలలపోటీ ప్రకటనలోని ఎనిమిదవ నిబంధనలో 'ప్రాతప్రతులతో బాటు తగు మాత్రం తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామాకల కవర్ను జతపరచటం <u>అనవసరం</u>' అని గమనించ గోరుతున్నాము...

* * *

త్వరలో ప్రారంభం కాబోయే సచిత్రవ్యాస శీర్షిక ఒక దానికి సంబంధించిన ప్రకటనను యిదే పేజీలో పాఠకులు చూడవచ్చు...

వి ష యా ను క్ర మ ణి క

ముఖచిత్రం : 'మనసే మందిరం' లో నాగేశ్వరరావు

కథలు :


ఊహలూ అనుభవాలూ — 14
నారాయణ చేసిన పరిష్కారం — 28

సీరియల్ కథలు:

ఆమ్రపాలి — 22
చిరుద్యోగపర్వం (ముగిసిన కథ) — 36

శీర్షికలు, వ్యాసాలు, సినిమా.

ఉత్తరాలు — 4, ఉమెన్ కార్టూన్ — 6, వ్యాడిర్లీ శిక్ష — 7, కామరాజ్ — 10, దక్షిణాది వనితలపై నా అభిప్రాయాలు — 19, వైజ్ఞానిక గాథావళి — 27, వారఫలం — 43, బాల సాహితి — 45, బాటిక్ చిత్రప్రదర్శనం — 47, శారద — 48, చిత్రసమీక్ష — 50, చిత్ర ఝరి — 52. పద కేళి — 55.



కేరళ అసెంబ్లీ ఎన్నికల టికెట్లలో అధికభాగం వామపక్ష కమ్యూనిస్టుల కైవశం!
ఇది తీసుకుని మీరందరూ పంచుకోండి
వామపక్ష కమ్యూనిస్టు పార్టీ
నిప్పు రాజేస్తున్న చేయి
భారత దేశంలో విద్యార్థి కల్లోలానికి చైనా సమర్థన
విద్యార్థుల కల్లోలం
మొరుగుతున్న కుక్క
పాక్ పూర్వపరిస్థితి
పాక్-భారత సద్భావం
నిర్బంధాల తొలగింపు
భారత్ పారిశ్రామిక శక్తి
కంట్రోళ్లు
OOMMEN

పి. యల్. 480 పునరుద్ధరణ

పి. యల్. 480 స్వభావం

అమెరికా మరో రెండు మిలియన్ టన్నుల ఆహారధాన్యాల సప్లయి చేస్తుందనీ, దేశంలో క్లిష్టపరిస్థితి కొంతగా మెరుగు పడుతుందనీ కొండంత ఆశతో వున్నాము. మన మనుకుంటున్నంత అనుకూలత అక్కడ కనిపించడం లేదు.

జులై ఒకటో తారీఖునాటికి అమెరికాలో 536 మిలియన్ బుషెల్స్ గోధుమ స్టాకులో వుంది. అక్టోబరు ఒకటికి 950 మిలియన్ బుషెల్స్ జొన్న నిల్వలో వుంది. మొత్తం ఆహారధాన్యాల నిలవ ఎలాలేదన్నా వలభై ఏడు మిలియన్ టన్నులు. తమ దేశంలో జనసంఖ్య పెరుగుదల దృష్ట్యా, ప్రజలకీ, పశుపక్ష్యాదులకీ పోను, పంచి పెట్టేందుకు అట్టే అవకాశం లేనట్టు చెబుతోంది అమెరికా.

అమెరికాతో పన్నెండేళ్ల క్రితం పి. యల్. 480 క్రింద చేసుకున్న ఒప్పందంలో ఇప్పుడు కొన్ని మార్పులు సూచించబడ్డాయి. ప్రతిపాదనను సవరిస్తున్న సూచనలు ఇలా వున్నాయి. 1. మిగులు ధాన్యాలని ముందుగా వినియోగపరచుకోవడం, 2. కొనుగోలు ధరను డాలర్లలోగాని లేదా అమెరికా కోరిన విధంగా మరి యే యితర విదేశీ ద్రవ్య రూపేణాగాని జమ కట్టడం, 3. కోరిన దేశాలకి స్వంత సహాయం చేయడం, 4. అమెరికాతో దౌత్య సంబంధాలు లేని దేశాలతో సాధ్యమైనంతవరకు డాలరు పద్ధతిపై వర్తకాన్ని నియమితం చేసుకోవడం, 5. జన సంఖ్యను అదుపులో పెట్టడం కోసమూ, రైతువారీ కార్యక్రమాల కోసమూ, సమగ్రమైన పథకాల కోసమే విదేశీ ద్రవ్యాన్ని వెచ్చించడం, 6. అవసరమైనప్పుడల్లా అమ్మకం మీది ఐదుశాతం రొక్కంగా డాలర్ల రూపంలో ముట్టజెప్పడం, 7. ఒక్క ముద్రిత్తనే కాకుండా వ్యాపారానుకూలమైన తదితర వ్యవసాయోత్పత్తుల్ని కూడా పంపిణీ చేయగలిగినట్టి కృషిని చేయడం, 8. అమెరికా దేశీయుల సంచార యాత్రల వ్యయానికి తగిన 'మారక ద్రవ్యాన్ని' సమకూర్చి పెట్టడం.

1954 లో చేసుకున్న పి.యల్. 480 ఒప్పందం ఈ సంవత్సరం డిశంబరు నెలాఖరుతో బుట్టదాఖలా అవుతుంది. మళ్లీ దాన్ని పునరుద్ధరించుకోవాలీ అంటే ఈ పైన చెప్పిన గొంతెమ్మ కోర్కెల నన్నిటినీ తీర్చాలి!

ఇప్పుడున్న ఒప్పందం నాలుగు శీర్షికల్లో దాని స్వభావాన్ని చెప్పేసింది. ఒకటి, వారి వారి అవసరాల సరఫరాకోసం స్వంత కరెన్సీలో ఆహారధాన్యాల సొమ్ము చెల్లించవచ్చు. రెండవది, కరువు కాటకాల్లోనూ స్వయం సేవక సంఘ కార్యక్రమాల్లోనూ పాఠశాలల వినియోగం కోసం, మరి యే యితర ఆర్థిక విస్తరణ పథకాలకైనాసరే ఉదారమైన సరఫరా చేస్తుంది. మూడవది, అమెరికా ఏజెన్సీల కార్యకర్తల మధ్యవర్తిత్వంలో గాని యితరమైన అంతర్జాతీయ సంస్థల యజమాయిషీలో గాని నిలవ ధాన్యాలను దేశ, విదేశీ అత్యవసర పరిస్థితుల్ని పురస్కరించుకుని ఇనాముగా యివ్వడం. అవసర వస్తువులు ఇచ్చి పుచ్చుకునే పద్ధతిలో ఒప్పందం చేసుకోవడం. నాలుగు, తక్కువ వడ్డీరేటుతో డాలరు పద్ధతి మీద ఋణవిక్రయాలు జరపడం.

కొత్త ఒప్పందం పై ఆంక్షలు

ఇప్పుడు రూపొందబోయే ఒప్పందానికి ఎన్నో ఆంక్షలున్నాయి. దేశం తన ప్రజల అవసరాలను తీర్చగల ఆహార ధాన్యాలను పండించడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి సల్పగలదని 'ప్రెసిడెంటు' హామీ యివ్వాలి. ఇక ముందు దిగుమతుల మీద ఆధారపడకుండా వుండేందుకు తగిన జాగ్రత్త తీసుకోవాలి. విద్య, పరిశోధనాభివృద్ధి పథకాలు వెంటనే ఆదుకునేవి కావు గనక వాటిని వెనక్కు నెట్టివేసి, సత్వరమైన అవసరాలను తీర్చుకునేందుకు తగిన ప్రణాళికలను వెంటనే ఏర్పాటు చేసుకోవాలి. ఇదివరకటికన్నా ఇప్పటి దిగుమతులు పెరగకూడదు.

తిండి, బట్టకు ఎక్కువ కరువుగా వున్న పరిస్థితుల్ని పరిశీలించి తగినటువంటి సహాయ సహకారాలను అమెరికా అంద జేస్తుంది. కేవలం అప్పులు తీర్చుకునేందుకైతే ఈ ఒప్పందం వర్తించదు. దిగుమతైన సరుకు వృథాకావడం, లేదా పాడవడాన్ని నిరోధించేందుకు ఈ సహాయం నియమితమై వుంటుంది. ఇప్పుడు జనసంఖ్య నిరోధకానికి తీసుకున్న చర్యల్ని బట్టి భవిష్యత్సహాయం ఆధారపడి వుంటుంది.

ఇప్పుడిప్పుడే పురోభివృద్ధి నొందుతున్న దేశాల స్వయం కృషి, వ్యవసాయిక అభ్యుదయ పథకాలు, ఆర్థిక పరమైన అభివృద్ధికి ఏర్పరచుకున్న పథకాలు, ఆ దేశాలకి ఇతర దేశాలకిచ్చిన సహృదయ దౌత్య సంబంధాలు ఈ ఒప్పందానికి యోగ్యతలుగా సూచించబడ్డాయి. దేశంలో నిరక్షరాస్యత, కొన్ని సాంఘిక దురాచారాల్ని దూరా

[illegible] పెట్టడానికి దేశం కృషి సల్పాలి. దేశాలయొక్క ప్రజాభివృద్ధి, వ్యవసాయిక సమృద్ధి, ఆర్థిక శక్తిని దృష్టిలోవుంచు కుని ఆహారధాన్యాల పంపిణీ ఆధారపడి వుంటుంది. ఈ త్రివిధమైన లక్ష్యాలను

[illegible]

సాధించుకోడానికి దేశం ప్రయత్నించాలి. మరి యే యితర దేశాల సహకారం అక్కర్లే కుండా అమెరికాయే మనకు కావలసినంత

తిండి, బట్ట, నివాసాలు పోతుంటేనే అవి నమ్మకం తగ్గించడానికి ఈ పథకం సవరించ బడింది.


మనదేశానికి పి. యల్. 480 ప్రయోజనం

పి.యల్. 480 క్రింద మిగులు ప్రత్తిని ఎగుమతి చేసి, నూలు తదితరాలైన తయారీలను దిగుమతి చేసుకోవడమనేది అసలు మనకు తగనిపని. ఎగుమతి దిగుమతుల క్రింద ఖర్చుపోను అసలు ధరకే దిగుమతి చేసుకునే ప్రత్తి తయారీలు మనకు లాభదాయకం కావు. పైగా మన స్వదేశీ వ్యాపారం దెబ్బతింటూవుంది. నూలు బట్టలు పుష్కలంగా ఉత్పత్తి చేయగల కావలసినన్ని మిల్లులు మనకున్నాయి. అవి మన అవసరాల్ని క్షుణ్ణంగా తీరుస్తాయి. ఈ మిల్లులమీద ఆధారపడి ఎంతో మంది కార్మికులు జీవిస్తున్నారు. మనం ఎగుమతి చేసే ప్రత్తి, దాన్నే మరో రూపంలో దిగుమతి చేసుకునే కంటే, ఆ దిగుమతి మరికొన్ని అవసరాలను తీర్చగలిగేదిగా వుంటే మేలుగా వుంటుంది.

ఈ ఒప్పందం కేవలం ప్రపంచంలో విరివిగా ఉత్పత్తి అవుతున్న ప్రత్తి, పొగాకు ఉద్ధరించేందుకు కాకుండా ఆహారధాన్యాల ఉత్పత్తికి ఎక్కువ ప్రోత్సాహమివ్వడం మంచిదే. రాను రాను దిగుమతుల్ని తగ్గించుకుని, దేశాలు స్వయం సమృద్ధమై, స్వయం పోషకాలుగా నిలబడి అన్ని విధాలైన అభ్యుదయాన్ని సాధించుకోగల పథకాలు ప్రత్యామ్నాయంగా ఇందులో సూచించబడ్డాయి. ఒక విధంగా మంచిదే. ఈ పరపన ప్రపంచంలో మిగులుపడివున్న వస్తువుల మీద ఉత్పత్తి లక్ష్యాన్ని ఉపలక్షించడం జరుగుతుంది. ఆర్థికమైన మదుపు జరుగు తుంది. ప్రపంచ వ్యాప్తమైన అవసరాల్ని అన్నిదేశాలు దృష్టిలో వుంచుకుంటాయి.

ఇందువల్ల మనకు బాగా అర్థమైంది ఏమిటీ అంటే, మన ఆహారధాన్యాల కొనుగోలుకు అమెరికా డాలర్లలో డబ్బు చెల్లించడం. ఈ పద్ధతి మీద మనం ఇక ముందు ఆహారధాన్యాల కోసం అమెరికా మీద ఆధారపడడం మంచిదా కాదా అనేది ఆలోచించాలి. అలా అయిన పక్షంలో కొన్ని ప్రాథమిక నిబంధనల్ని తప్పకుండా పాటించగల్గాలి. అప్పుడు మన ఋణాల్ని తీర్చుకునేది ఎట్లా? ఇది ప్రస్తుతం మన ముందున్న [illegible]

M & TP Licence No. 76/64-5.



ఆరోగ్యమే మహాభాగ్యం

గాలిలో ఉండే వ్యాధి కారక క్రిములు మన దేహంలో ప్రవేశించడమే మన శరీరఉష్ణం పెరగటానికిగాని, తగ్గటానికిగాని కారణం. ఇందువల్లను, ఇంకా ఇతర అంటువ్యాధులవల్లను మన ఆరోగ్యం చెడిపోయి మన శరీరావయవాలు, లోపలిభాగాలు మామూలుగా పనిచెయ్యటం మానివేస్తాయి. అలాంటి సందర్భాలలో మనం మన ఆరోగ్యాన్ని సరిచేసుకోనక శరీరావయవాలను బలవంతంగా పనిచేయింపిస్తే అల్పజాడ్యాలే ప్రమాదకరమైనవిగ పరిణమిస్తాయి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు, తిరిగి పొందేందుకు దేహానికి టిష్యూలకు బలమిచ్చేందుకు, బరువు పెంచేందుకు, బలం పెంపొందించేందుకు ప్రకృతిసిద్ధంగా సన్నగా ఉండేవారు, బరువు తక్కువగా ఉండేవారు కూడ "మదన్-మిత్ర" వాడతారు.

మీ మనశ్శక్తిని, శరీరదార్ఢ్యతను కాపాడుకునేందుకు, తిరిగి పొందేందుకు అనేక కారణాలవల్ల పరిస్థితులవల్ల పోగొట్టుకొన్న యువ్వనశక్తిని తిరిగి పొందేందుకు **మదన్-మిత్రను** వాడండి.

మదన్-మిత్ర

ఇది అలసట, అరుచి, అజీర్ణం, అవయువములు మొద్దుబారటం, నిద్రలేమి, నాడీదౌర్బల్యం, మలబద్ధం, కడుపునొప్పి, బలహీనత, ప్రమేహం' రొమ్మునొప్పి, ఆకలిమందగింపు, అధికదప్పిక, ఇత్యాది అన్ని రొమ్మునొప్పి రుగ్మతలను నివారించి అవయువదార్ఢ్యతను సమకూర్చి శరీరానికి ఎక్కువబలం' రంగు, బరువు లిస్తుంది. **మదన్-మిత్ర** ఛాతీని పెంచి, శరీరబలాన్ని తిరిగి నిర్మించి అందమైన ఆకర్షణీయమైన వర్చస్సు నిస్తుంది.

ఆరోగ్యాన్ని కాపాడే, తిరిగి చేకూర్చే, వ్యాధులను నిర్మూలించే పటుమైన అనేక విటమిన్లుగల శక్తివంతమైన 60 కి పైబడిన ఆయుర్వేదమూలికలతో **కూడినది మదన్-మిత్ర.**

మదన్-మిత్ర అలసట పరిహారముచేత, క్రమమైన అలవాట్లు లేకపోవటంచేత అకాలంగా పెద్ద వయస్సు లక్షణాలు పొందటం మొదలైన అన్ని దవుర్బల్యాలకు మేలైనది. పటుమైన ఔషధగుణాలతో నిండిన **మదన్-మిత్ర** సేవించటానికి రుచికరమైనది. పత్యనియమాలు లేవు. వెల : 450 గ్రాములు 40 దినముల మందు రు. 8 లు. వి. పి. పి. ఛార్జి అదనం. మీకు కావలసినదానికి వెంటనే వ్రాయండి.

ఈమందుగుణం బహు కొద్దికాలంలో కనిపిస్తుంది. ఏమంటే అనేక విటమిన్లు, అనేక ఫలాలు ఇందులో చేరిఉన్నాయి. మదన్-మిత్రలోగాని **వనితామృతం** జంతుకొవ్వులు, మత్తుపదార్థాలు చేరలేదు. కాబట్టి దీన్ని వాడేప్పుడు శరీర వ్యాయామం చెయ్యనవసరంలేదు.

వనితామృతం

ఇది బలహీనమైన స్త్రీల శరీరదార్ఢ్యతను చక్కబరచి, లావణ్యాన్ని, వర్చస్సును పెంపొందిస్తుంది. ఇది అలసట, రక్తహీనత, అగ్నిమాంద్యం, అజీర్ణం, బలహీనత, మలబద్ధం, దిమ్ము, స్రావం, కడుపునొప్పి, నరాల దవుర్బల్యం, స్రుహతప్పటం, యిదాలోభం, వికారం, పనిమీద అయిష్టత, దాహం, పాలిపోయిఉండటం, మొదలైన గర్భిణీసమయంలోను, ప్రసవానంతరం, ఋతు సమయాలలోను కలిగే రుగ్మతలను పోగొట్టి శరీరానికి బలాన్ని, వర్చస్సును ఇస్తుంది. ఇది ఋతుక్రమాన్ని చక్కబరచి బహిష్టు బాధలను తొలగిస్తుంది. గర్భిణీస్త్రీలువాడితే సుఖప్రసవానికి తోడ్పడుతుంది. స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడేందుకు యువ్వన పాటవాన్ని తిరిగి చేకూర్చేందుకు **వనితామృతం** చల మంచి ఔషధం. పత్యం లేదు. 450 గ్రాములు 40 రోజుల మందు వెల : రు. 10/— వి. పి. పి. ఛార్జి అదనం. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయండి.

—————: హెడ్డాఫీసు —————

MADAN—MITHRA AUSHADALAYA, P. B. No. 44, PALGHAT (KERALA)

మద్రాసు సేల్సు డిపో :

546, పూనమల్లి హైరోడ్డు, మద్రాసు-7.

బెంగుళూరు ఏజెంటు :

మెస్సర్సు శోభా మెడికల్ స్టోర్సు, డి-49, కాటన్ పేట, మెయిన్ రోడ్, బెంగుళూరు-2.

పోస్టు ద్వారా పంపవలసిన ఆర్డర్లు హెడ్డాఫీసు (పాలఘాట్) కు పంపవలెను.

కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

(గత సంచిక తరువాయి)

తాజిక్ భారతదేశానికి నైసర్గికంగా సన్నిహితంగా వున్న రిపబ్లిక్ మాత్రమే కాదు, భారత ప్రజల ఆచార వ్యవహారాలకు కూడా అది చాలా సన్నిహితంగా వుంటున్నది. వేషభాషలు, ఆచార వ్యవహారాలు, భావనలు— అన్నిటిలోను మన కాశ్మీరు ప్రజలను జ్ఞాపక పరుస్తారు తాజిక్ ప్రజలు. భాషలో సమానత, భోజనంలోను సమానతతో వారు చపాతీలు భుజిస్తారు. వాటిని చపాతీలనే వారు వ్యవహరిస్తారు. ఉత్తర దేశపు తినుబండమైన 'నాన్' అక్కడ కూడా "నాన్"! పక్కెరకు అక్కడ కూడా షకర్ (చక్కెర) అనే పేరు. ఉప్పును వారు కూడ ఉత్తర భారతీయుల లాగ నమక్ అనే అంటారు.

మనదేశంలో వున్న కర్బూజా పళ్ళు అక్కడ కూడా విరివిగా పండిస్తారు. సమశీతోష్ణమైన వాతావరణం వుండటం వల్ల ద్రాక్ష, దోస, పీచెస్, కర్బూజా వంటి అన్ని రకాల పండ్లూ తాజిక్ రిపబ్లిక్‌లో హెచ్చుగా పండిస్తారు. వెళ్ళిన చోటెల్లా ఈ పళ్ళు కామరాజ్‌కు స్వాగత మిచ్చాయి.

[illegible] తాజిక్ పర్యటన కార్యక్రమం జూలై 24 వ తేదీ ఉదయం ఆరంభమైంది. కామరాజ్ తాజిక్ రిపబ్లిక్ సుప్రీం సోవియట్ అధ్యక్షుడు శ్రీ హోలోవ్‌ను శాసనసభ కార్యాలయంలో కలుసుకున్నారు. తాజిక్ నగరాభివృద్ధిని గురించిన కొన్ని వివరాలను తెలిపారు శ్రీ హోలోవ్.

"యాభై సంవత్సరాల క్రితం, అంటే 1913లో, ఇక్కడ చాల పాత కట్టడాలే వుండేవి. కర్మాగారాలు కూడ చాల తక్కువే. ఇప్పుడేమో ఇక్కడ మూడు వందలకు పైగా బ్రహ్మాండమైన కర్మాగారాలు విరాజిల్లుతున్నాయి.

"వ్యవసాయ పద్ధతిలోను మేము అభివృద్ధి పొందాము. పాత కర్ర నాగేళ్లతో వ్యవసాయం కొనసాగే ప్రాంతాలతో ఇప్పుడు యంత్రాల సహాయంగా వ్యవసాయం జరుగుతున్నది. [illegible] ట్రాక్టరు [illegible] తున్నది." అని తెలిపారు హోలోవ్.

అక్కడ ఉత్పత్తి అయ్యే ప్రధాన వస్తువు ఏది అని కామరాజ్ తెలుసుకొన కోరగా, "పత్తే ఇక్కడ హెచ్చుగా వుత్పత్తి అవుతున్నది" అన్నారు అధ్యక్షులు. 6,10,000 టన్నుల పత్తి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నదట.

వ్యవసాయం గురించి సంభాషణ జరిగిన మీదట, భాషను గురించి చర్చ బయలు దేరింది.

"మీ రిపబ్లిక్ బోధన భాష ఏమిటి?" అని ప్రశ్నించారు కామరాజ్.

"తాజిక్ భాషే బోధన భాష. దానితో పాటు రష్యన్ భాష కూడ అందరికీ బోధించబడుతున్నది. ఇదికాక ఉజ్బెక్ భాష కిర్గిజ్ భాష కూడ నేర్పబడుతున్నాయి" అన్నారు హోలోవ్.

"చట్టాలు ఏ భాషలో వుంటున్నాయి?" అని అడిగారు కామరాజ్.

"తాజిక్, ఉజ్బెక్, రష్యన్— ఈ మూడు భాషలలోను ఉంటాయి." అన్నారు ఆ అధ్యక్షులు.

తాజిక్ రిపబ్లిక్ శాసన సభలో ఏక కాలంలోనే ఈ మూడు భాషలలోను అనువదించే వసతి చేయబడి వున్నదని ఆయన తెలియ జేశారు.

"ఒకప్పుడు మా భాషకు అరబిక్ వర్ణమాలను వాడేవారు. తర్వాత రోమన్ లిపి అలవాటు చేశారు. ఇది సోవియట్ యూనియన్‌లో భాగమయిన తర్వాత రష్యన్ లిపినే మేము ఉపయోగిస్తున్నాము" అని ఆయన అన్నారు.

కామరాజ్ శ్రీ హోలోవ్‌కు ధన్యవాదాలు అర్పించినప్పుడు, "వెనుకబడిన దేశాల కన్నిటికీ తాజిక్ రిపబ్లిక్ ఒక ఉత్కృష్టమైన ఆదర్శంగా విరాజిల్లుతున్నది. మీ దేశ పురోగతి భారతీయులకు గొప్ప దృష్టాంతం కాగలదు" అన్నారు.

అతి ప్రాచీన లిఖిత పుస్తకాలున్న ఒక గ్రంథాలయానికి వెళ్లారు కామరాజ్. సుప్రసిద్ధ పారశీక భాషాకవి ఫిర్దౌసి పేరుతో ఈ గ్రంథాలయం పిలువబడుతున్నది. భారతీయ ప్రాచీన నవీన గ్రంథాల ప్రతులు, లిఖిత పుస్తకాల ప్రతులు, టర్కీ భాషా గ్రంథాల ప్రతులు, పారశీకదేశ లిఖిత గ్రంథాల ప్రతులు మొదలయిన వాటి నన్నిటినీ చాల జాగ్రత్తగా ఈ గ్రంథాలయంలో భద్రంగా రక్షిస్తున్నారు.

"ఈ గ్రంథాలయంలో ఎన్ని గ్రంథాలు ఉంటాయి?" అని ప్రశ్నించగా, "45 దేశాల గ్రంథాలున్నాయి. పద్దెనిమిది లక్షల ప్రతులున్నాయి" అని సమాధాన మిచ్చారు. భారతదేశం నుంచి విచ్చేసిన నాయకులు కొందరు ఈ గ్రంథాలయాన్ని కూడా దర్శించి వున్నారనే సమాచారాన్ని కూడా అక్కడివారు తెలిపారు.

గ్రంథాలయం సందర్శకుల పుస్తకంలో కామరాజ్ ఈ విధంగా వ్రాశారు:—

"ఈ గ్రంథాలయంలోవున్న వివిధానేక విషయాలను గురించిన అపూర్వమైన గ్రంథాలు, ప్రాచీన లిఖిత పుస్తకాలు నన్ను చాల ఆకర్షించాయి. విద్యావంతులకు చాల ప్రయోజనకరమైన గ్రంథాలయమిది. భారతదేశాన్ని గురించిన ప్రాచీన గ్రంథాలను ఇక్కడ చూపెట్టినప్పుడు, భారత ప్రజల మీద తాజిక్ ప్రజలకున్న సదాదరం స్పష్టంగా తెలుస్తుంది. — కామరాజ్."

గ్రంథాలయం నుంచి కామరాజ్ వెళ్ళిన స్థలం ఒక వ్యవసాయ పరిశోధన సంస్థ. తాజిక్ రిపబ్లిక్ వ్యవసాయ ప్రధానమైన దేశం కావడం వల్ల వ్యవసాయాభివృద్ధికి ప్రాముఖ్య మిచ్చి, ఒక బృహత్పరిశోధనాలయాన్నే నిర్వహిస్తున్నారు. ఈ పరిశోధనాలయంలో ఇంతవరకు ఐదువేలకు పైగా నిపుణులు శిక్షణ పొందారని తెలిసి ఆనందించారు కామరాజ్.

ఈ నిపుణు లందరూ ప్రభుత్వ వ్యవసాయశాఖ క్షేత్రాలలోను, సహకార వ్యవసాయ క్షేత్రాలలోను పనిచేస్తున్న వారు. ఈ నిపుణులకు బోధించడానికి ఆ పరిశోధన సంస్థలో 250 మందికి పైగా ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు వున్నారట.

పరిశోధనలో ముఖ్యమైనది ఏమిటని ప్రశ్నించగా, క్రిమినివారణం, ఉత్పత్తి ఎక్కువ చేయడం, భూసార పరిశీలన అని సమాధానం ఇచ్చారు. తాజిక్ రిపబ్లిక్ వ్యవసాయ మంత్రి శ్రీ మక్సైహోన్ ఈ పరిశోధన సంస్థలో చదివిన వారే. ఈ

రచన

ఆర్. వెంకట్రామన్

ంన్నతో చదివి తర్వాత ఆయన సహకార వ్యవసాయ క్షేత్రంలోను పనిచేశారు!

పత్తి అధికోత్పత్తికి ఈ పరిశోధనాలయంలో పెక్కు పరిశోధనలు జరుపుతున్నట్టు అక్కడివారు తెలిపారు. ఆ పరిశోధనల ఫలితంగా పత్తి ఉత్పత్తి పెక్కురెట్లు పెరిగిందని తెలిపారు.

ఆ సాయంకాలం సుమారు నాలుగు గంటలకు తాజిక్ రిపబ్లిక్ రాజధాని అయిన దుషాంబే నగరంలోవున్న ఒక సహకార వ్యవసాయ క్షేత్రానికి దయ చేశారు కామరాజ్. అక్కడి సహకార వ్యవసాయ క్షేత్రంలోని భూము లేవీ వ్యక్తుల స్వంత ఆస్తి కాదు. అక్కడ పనిచేసేవారంతా ఇన్ని గంటల పనికి ఇంత భృతి అని భృతి తీసుకుంటున్నవారు. ఈ సహకార వ్యవసాయ క్షేత్రంలో వుండేవారికి నివసించ డానికి యిల్లు, స్వంతంగా సేద్యం చేసుకోడానికి అర యకరా భూమి, ఆ వ్యవసాయ క్షేత్రంలోనే ప్రత్యేకించబడివుంది. ఆ స్వంత భూమిలో ఉత్పత్తి అయ్యే వాటిని విడిగా అమ్మి, దానివల్లవచ్చే రాబడిని వారే తీసుకోవచ్చు.

సోవియట్ యూనియన్‌లో వుత్పత్తి అయ్యే పత్తిలో చాలభాగం, తాజిక్, ఉజ్బెక్ రిపబ్లిక్‌లలోనే వుత్పత్తి అవుతున్నది.

అక్కడ వున్న క్షీరశాలను, కార్మికు ట్రాక్టర్లతో దున్నడాన్ని కామరా కొంచెంసేపు నిలబడి గమనించారు.

"గడచిన 25 సంవత్సరాలలోను ఏడున్నర లక్షల యకరాలభూమి కొత్తగా సాగు చేయబడింది" అని ఒకరు లెక్కల వివరాలు తెలిపారు.

కామరాజ్ వ్యవసాయ క్షేత్రాన్ని చూచిన తర్వాత, వ్యవసాయదారులు నివసించే ఇళ్లవైపు వెళ్లారు. వ్యవసాయదారులను చూడగానే కామరాజ్‌లో వుత్సాహం పొంగి వచ్చింది. వారికి కూడా వీరిని చూడడం చాల సంతోషం. ఆ వ్యవసాయదారులతో పాటు కూచుని, చాలసేపు పెక్కు విషయాలను గురించి సంభాషించారు కామరాజ్. వారి క్షేమలాభాలను గురించి కనుక్కున్నారు.

వ్యవసాయదార్ల ఇళ్లు మట్టి గోడలతో కట్టినవి. లోపల గదులలో కంబళ్లు వుంచారు.

వంట యింట్లో ఒక పొడుగాటి తాడు కట్టి, దానికి పెద్ద పెద్ద చపాతీలు వ్రేలాడగట్టారు.

"మీ నెలవరి రాబడి ఎంత?" అని ఒక వ్యవసాయదారుని ప్రశ్నించారు కామరాజ్.

"నిరంతరంగా ఆరు నూరు రూపాయల రాబడి వస్తుంది. పరిశ్రమ, ఉత్పత్తిని బట్టి దానికి పైబడికూడా ఇస్తున్నారు" అన్నారు ఒకరు.

"ఈ రాబడి మీకు చాలా?" అని అడిగారు కామరాజ్.

"నాకు చాలు. దీనికి తోడు నా కుటుంబంలో సంపాదించే వాళ్లు ఇంకా కొందరు వున్నారు. అందువల్ల మేమంతా సంతోషంగా బ్రతుకుతున్నాము" అని ఆయన అన్నాడు.

వ్యవసాయదారుల పిల్లలు కామరాజ్ చుట్టూ నిలబడ్డారు. తమ యిళ్లలో చేసిన తినుబండాలను వారు కామరాజ్‌కు ఇచ్చి తినవలసిందిగా కోరారు. కామరాజ్ సంతోషంతో ఆ చిరుతిండి వస్తువులను భుజించారు. తర్వాత కామరాజ్ ఆ వ్యవసాయదారులతో పాటు కూచుని, వారి కుటుంబం లోని వారిలాగే మాట్లాడారు. వారి జీవిత పరిస్థితి, జీతం, వృద్ధాప్యపు పెన్షన్ మొదలయిన వాటిని గురించి ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ వచ్చారు.

"నాకు వృద్ధాప్యపు పెన్షన్ ఇస్తున్నారు. నేను సంతోషంతోనే గడిపి వేస్తున్నాను." అని అంటూ ఒక వృద్ధుడు కామరాజ్ దగ్గరకు వచ్చి కూర్చున్నారు.


"మీకు ఎవరు పెన్షన్ ఇస్తున్నారు?" అని అడగగా, సహకార వ్యవసాయక్షేత్రమే పెన్షన్ ఇస్తున్నది. ఉచితంగా వైద్య సౌకర్యమూ కలిగిస్తున్నది. అన్ని బాధ్యతలను సహకార క్షేత్రమే వహిస్తున్నది." అన్నాడు ఆ వృద్ధుడు.

"చదువు సౌకర్యాలు ఎలాంటివి?" అని ప్రశ్నించారు కామరాజ్.

"చదువూ ఉచితమే. పిల్లలందరూ బళ్లకు పోతారు" అన్నాడు ఆయన.

అక్కడవున్న కొందరు మహిళలను చూచి కామరాజ్ మన వూరిలోని మహిళలను యోగక్షేమాలు కనుక్కున్నట్టు, "ఏమమ్మా క్షేమమేనా?" అని ప్రశ్నించారు. పసి పిల్లలను బుగ్గల మీద తట్టి "రాహో మ్! రా!" అని పిలిచి, తమ వద్దకు తీసుకున్నారు.

ఆ సహకారక్షేత్ర వాసులకు భారతదేశం నుంచి వచ్చిన ఒక పెద్ద నాయకులనే భావం మరుగైపోయి, మన సహకార క్షేత్రంలోని ఒక పెద్ద మనిషితో మాట్లాడుతున్నామనే భావం కలిగించారు.



తాజిక్ ప్రజలతో కామరాజ్

కామరాజ్.

కామరాజ్ వెళ్లిన ఆ ప్రాంతంలో ఎక్కువభాగం ముస్లిములే వున్నారు. అయితే, వారిలో ఏవిధమైన మతావేశమూ కనిపించలేదు. పాత టర్కీ సామ్రాజ్యంలో ఈ ప్రాంతం భాగమయినందున అక్కడక్కడ కొన్ని ప్రాచీన టర్కీ మసీదులు కనిపించాయి.

కామరాజ్

"పూజించడానికిగాని, మత సంబంధమైన ఏర్పాట్లు చేయడానికిగాని ఎలాటి ఆటంకాలూలేవు." అని అక్కడివారు చెప్పారు.

సాయంకాలం ఏడు గంటలకు తాజిక్ కళా ప్రదర్శనం ఏర్పాటయింది. దానిలో రష్యా "బాలే" నాట్యం జరిగింది. రష్యాలో "బాలే" నాట్య శాఖలు మాస్కోలోను, లెనిన్‌గ్రాడులోను ఉన్నాయి.

"లెనిన్‌గ్రాడ్ బాలే గొప్పదా? మాస్కో బాలే గొప్పదా?" అనే చర్చ ఎప్పుడూ జరుగుతూ వుంటుందట!" తాజిక్‌లో మేము చూచిన బాలేనాట్యం లెనిన్‌గ్రాడ్ బాణీది. దాని ప్రదర్శనంలో తాజిక్ సంగీతం గానం చేయబడింది.

తాజిక్ సంగీతం ఇంచు మించు హిందూస్తానీ సంగీతంలాగే వున్నదని కామరాజ్ అన్నారు. కొన్ని పాటలను కచ్చితంగా హిందూస్తానీ మెట్లలోనే పాడారు నరకులు. కళా ప్రదర్శనంలో పాల్గొన్నవారు సంప్రదాయ సిద్ధమైన తాజిక్ దుస్తులు ధరించినప్పుడు, దాదాపు కాశ్మీర్ వాసులలాగే కనిపించారు. తాజిక్ సాంస్కృతిక శాఖామాత్యులు, తక్కిన ప్రముఖులు ఈ కళా ప్రదర్శనంలో కామరాజ్ తోపాటు ఉన్నారు.

దాని తర్వాత అక్కడున్న "బాలల ఉద్యానానికి" వెళ్లారు కామరాజ్. ఆకాశమంటే మానులు, పచ్చని గుబుర్లు, పూలవడకలు, నీటి పూటలు, — మొదలు అయిన వాటితో మనోహరమైన వాతావరణం కల్పించేది ఆ "ప్యాపిల్స్ పార్క్." ఒకవైపు ఆరుబయలు రంగస్థలం. దానిలో ఒక మల్లయుద్ధం పోటీ జరుగుతూ వుండినది. మరొకవైపు కలప చిత్ర ప్రదర్శనం. మరొకవైపు పిల్లలు ఆడ కొనడానికి రంగులరాట్నం. విమానంవలె వున్న ఒక యంత్రం తల్లక్రిందులుగా తిరుగుతూ వుండినది. దానిలో కూర్చుని బెల్టు కట్టుకొని, పిల్లలు తిరుగుతూ వుండినారు. ఈ విధంగా ఎవరికి ఇష్టమైన ప్రదర్శనాలలో వారు పాల్గొనడానికి తగిన వసతులు, అవకాశం ఆ ఉద్యానంలో సంపూర్ణంగా వున్నాయి.

ఈ బాలోద్యానం చూచిన మీదట కామరాజ్ "మనదేశంలోను పిల్లల కాలక్షేపానికి ఇలాటి బాలోద్యానాలను ఏర్పాటు చేయడం మంచిది" అన్నారు మాతో.

పగటివేళ వేడిగా వున్న దుషాంబే నగరం చీకటి పడను పడను చల్లబడి, రాత్రిళ్లు మనం విశ్రమించినప్పుడు హితమైన వాతావరణంతో హాయిగా వుంటుంది.

(సశేషం)

—అనువాదం: తి. రా.

[ఆనందవికటన్ సౌజన్యంతో]



అవును, యు-ఫోమ్ ఆధునికజీవితానికే. యు-ఫోమ్ యొక్క లక్షలాది వాయు గోళాలు మీరింతకుముందెన్నడూ అనుభవించనంతగా మీ శరీరాన్ని సౌఖ్యానందములలో తేలియాడించ గలవు. యు-ఫోమ్ తేలికగానుండి మీకు కావలసిన ఆకారంలో కత్తిరించుకో టానికి వీలుగా ఉంటుంది. అది వివిధ రంగులలో, వెడల్పులలో మందము లలో వస్తుంది. ఉతికి ఎండలో ఆరబెట్టడానికి వీలవుతుంది. తక్కువ ధరలో లభ్యమవుతుంది చాలాకాలం మన్నుతుంది. సోఫాయికి కాంబినా, సీయస్టా మాట్రెస్, డ్రీమ్‌లైన్ దిండు, ప్రయాణానికి పిక్‌నిక్‌లకు లేదా. నిజానికి యుఫోమ్ ఇంటా బయటా వేలాది ఉపయోగాలకు వాడుకోవచ్చు.

యు-ఫోమ్

ఉల్లాసము కలిగించే బహువిధాల ఉపయోగాలు గల యురెతెన్ ఫోమ్

యు-ఫోమ్ ప్రైవేట్ లిమిటెడ్
సనత్‌నగర్, హైద్రాబాద్-18







FDS-UF-657-78

డిస్ట్రిబ్యూటర్లు:
ఇండస్ట్రియల్ ఎక్విప్‌మెంట్ కంపెనీస్, 125, మహాత్మ గాంధి రోడ్, సికిందరాబాద్. ఫోన్: 76812



రామం ఆరేళ్ళ పిల్లాడిగా వున్నప్పుడు! వాళ్ళ మేనమామగారి పెద్దమ్మాయికి పెళ్ళి జరిగింది! ఆ పెళ్ళికి, వాళ్ళ అమ్మనాన్న లతో బాటు, రామం కూడా వెళ్ళాడు. ఎందరెందరో చుట్టాలు వచ్చారు వాళ్ళ మామయ్య గారింటికి! తనతోటి పిల్లలు బోళ్ళందరుండడంతో రామానికి గంటలు నిముషాల్లా గడిచిపోయాయి!

పదిమంది ఆడాళ్ళు ఒకచోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడ వాళ్ళమ్మ కూడా వుంది. పరుగుపరుగున వచ్చి రామం వాళ్ళమ్మ వొళ్ళో కూర్చు న్నాడు. తన మనసులో ఉన్న విషయాన్నొక దాన్ని వాళ్ళమ్మకి చెప్పేశాడు. "అమ్మా! అందరు పిల్లల్లోకీ నాకు ఒకళ్ళే ఒకళ్ళు బాగా నచ్చారు! ఎవరో చెప్పనా? రెండు జడ లేసుకుని, తెల్లగా వుందీ! ఆ పిల్ల!"

వాళ్ళమ్మ ఒక్కసారిగా నవ్వేసింది. "అయ్యో నీ తెలివి బంగారంగానూ! నచ్చ వలసిన వాళ్ళే నచ్చారు. ఇంకనేం?" అంది. అంతటితో ఊరుకోకుండా "వదినమ్మా చూశావా మావాడేమంటున్నాడో! అంద ర్లోకీ మాపిల్ల ఒక్కర్తే నచ్చిందట మా వాడికి! వని గట్టుకొచ్చి చెప్తున్నాడు" అంటూ అక్కడున్న ఒకావిడతో చెప్పేసింది! అందరూ గొల్లుమని నవ్వేశారు.

"పిల్లాడి కంటె పిల్ల పెద్దదయినా ఫరవాలేదు! ఇద్దరికీ పెళ్ళి చేసెయ్యొచ్చు! రాముడి కంటె సీత పెద్దది కాదేవిటి!" అన్నారు అందులో కొందరు.

రామానికి ఎందుకో మనసు పాడయింది. ఎవళ్ళకీ చెప్పకుండా అమ్మ కొక్కదానికే చెప్దామనుకుని చెప్తే వాళ్ళమ్మ, ఆ విష యం అందరితోటే చెప్పేసింది! అక్కడున్న ఆడాళ్ళంతా ఇంకా ఆ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు.

"ఇంకిక్కణ్నుంచి అమ్మకి కూడా ఏదీ చెప్పకూడదు!" అని తనలో తానే అను కుంటూ అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు రామం!

పెళ్ళి ఎప్పుడు జరిగిందో, ఆవాడావుడి ఎన్నాళ్ళుందో రామానికి తెలియదు! ఒక నాడు సాయంత్రం మాత్రం మామూ లుగా ఆడుకుందామని ఆ బొగడ చెట్టు క్రింద కొళ్ళేసరికి అంతవరకూ తనతో ఆడ కున్న పిల్లలెవ్వరూ కనిపించలేదు! పం దిట్లో రాటలు పట్టుకొని ఒకళ్ళిద్దరు మాత్రం ఆడుతున్నారు! మామయ్యగారి ఇల్లంతా వెతికేడు. తనతో ఆడిన పిల్ల లెవ్వరూ కనిపించలేదు! ఎవళ్ళు కనిపించక పోయినా ఫరవాలేకపోను. ఆరెండు జడ లేసుకుని తెల్లగా వున్న పిల్ల కూడా కని పించలేదు! రామాని కేమీ తోచలేదు! గుం డెల్లో అదేదోలాగుంది! ఆ రాత్రి అన్నం తిన బుద్ధి వెయ్యలేదు! తన కదోలాగుందని వాళ్ళమ్మతో కూడా చెప్పకాడదు! చెప్తే, ఆడాళ్ళంతా మళ్ళీ నవ్వేస్తారు!

పందిట్లో ఒకమూలకి పోయి కూర్చు న్నాడు రామం! ఆ రెండు జడ లేసుకుని, తెల్లగా వున్న పిల్ల, అందర్లోకీ ఆ పిల్లే బాగుంది! బలే తమాషాగా నవ్వుతుంది! ఆ పిల్లని చూడగానే రామాని కదోలా గనిపిం చింది! ఆపిల్లతో మాట్లాడుదామంటే తనకు కొంచెం సిగ్గేసేది మొదట్లో! దొంగాటలో ఆపిల్ల తన కళ్ళు మూసి నప్పుడు ఎంతో బాగుంది తనకి! అప్తే

పోనూ తాను కావాలని దొంగయిపోయే వాడు! ఉన్న పిల్లలందర్లో ఆ పిల్లే పెద్దది! ఆపిల్లకి పదేళ్ళుట! ఆ సంగతి నాన్నగారితో అమ్మ చెప్తుండగా తాను విన్నాడు! ఏలాగైనా అందరి పిల్లల్లోకీ ఆపిల్లే ఎంతో బాగుంది! ఆపిల్ల, ఆ రెండు జడ లేసుకుని తెల్లగా వున్న పిల్ల....

రామం ఆలోచనలకి అంతు చిక్కకుండానే వాళ్ళమ్మ వచ్చి రామాన్ని పిలిచింది! "ఇక్కడ కూర్చుని ఏంచేస్తున్నావురా? ఇంటికి టైమైందిట దాపోదాం!" అంటూ చెయ్యి పట్టుకుని రామాన్ని లేవదీసింది!

రైలుబండి ఎక్కాక కూడా రామానికి ఆపిల్లే గుర్తుకు వస్తోంది, వాళ్ళదేవూరో, అమ్మ నడిగి తెలుసుకుందామనుకుని, మళ్లీ ఏదో ఆలోచన వచ్చి అడగడం మానేశాడు. బొగడచెట్టు, ఆ పిల్ల, దొంగాట, అలా లీలగా జ్ఞాపకం వస్తూండగానే నిద్రాదేవత వడిలోకి జారిపోయాడు రామం!

ఆ మరునాటి నుంచి అంతా మామూలే! ప్రొద్దున్నే లేవడం, స్కూలుకి వెళ్ళిరాడం, సాయంత్రం ఆడుకోడం! వాళ్ళవూరు వెళ్ళిన రెండుమూడు రోజుల దాకా కూడా ఆపిల్ల అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చినా, నాలుగైదు రోజులకి ఆ పిల్లనిపూర్తిగా మరచిపోయాడు రామం!

* * *

రామానికి పదకొండేళ్ళు వచ్చాయి! వాళ్ళ మామయ్యగారి రెండో అమ్మాయి పెళ్ళికి వాళ్ళ అమ్మనాన్నలతో రామం కూడా వెళ్ళాడు! అక్కడ బొగడచెట్టు అలాగే వుంది. కొమ్మలు మాత్రం కొంచెం ఎత్తుగా వున్నాయి. దాని చుట్టూ గచ్చు తీసివేయించారు! బొగడచెట్టు చుట్టూ ఇంతకుముందు తను వచ్చినప్పుడు ఖాళీ స్థలం వుండేది. ఇప్పుడు రంగురంగుల పూలమొక్కలు బోల్డన్ని లేచాయి! ఆబొగడ చెట్టు కింద చిన్నప్పుడు, తాఆడిన దొంగాట, ఆ రెండు జడ లేసుకుని తెల్లగా వున్న అమ్మాయి, లీలగా గుర్తుకు వచ్చాయి!, "ఆ అమ్మాయి కూడా ఈ పెళ్ళికి వచ్చి వుంటుందేమో!" అనుకుని, ఆత్రంగా మామయ్య గారిల్లంతా గాలించడం మొదలెట్టాడు రామం! ఇల్లంతా ఎక్కడ చూసినా చుట్టాలతో చాలా హడావుడిగా వుంది. అన్ని గదులూ వెతికాడు. ఆపిల్ల ఎక్కడా కనుపించలేదు! పెళ్ళికూతురున్న గది ఒకటి మాత్రం చూడాలి! అక్కడికి అందర్నీ వెళ్ళనివ్వరు. చాలామంది ఆడాళ్ళు తలుపు కడ్డంగా నించుని లోపలికి బుర్రలెట్టి ఏదో వింతగా చూస్తున్నారు!

అవతలి వైపు కిటికీ దగ్గర ఇద్దరే ఆడాళ్ళున్నారు! మంచి ఆలోచన దొరికింది రామానికి! ఆ కిటికీ దగ్గర కెళ్ళి ఆ ఆడాళ్ళని బ్రతిమాలుకుని, కిటికీ ఎక్కి కూర్చున్నాడు. లోపల జరిగే వింత చూద్దామని ఊచల మధ్య బుర్రపెట్టి చూచాడు! రామం కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి! కళ్ళప్పగించి రెండు నిముషాలు చూశాడు! తన ఎదుట కనుపించే దృశ్యం చాలా వింతగా వుంది! ఆ రెండు జడల మ్మాయి భరతనాట్యం చేస్తోంది. వాళ్ళ క్కయ్యో ఎవరో ప్రక్కన పాట పాడుతూ తాళం వేస్తున్నారు. ఆ రెండు జడల మ్మాయి ఇంతకుముందు తను చూసి నప్పుడు కంటె తెల్లగా వుంది! ఇంతకు ముందు పరికిణీలో కనిపించిందల్లా ఇప్పుడు ధగధగ మెరిసిపోయే వోణీలో కనిపిస్తోంది!

ఆ అమ్మాయి తనకేసి ఒక్కసారి చూస్తే బాగుణ్ణనుకున్నాడు రామం! అదేపనిగా, తనను తాను మరచి, ఆ అమ్మాయి నాట్యాన్ని చూస్తున్నాడు! ఆ అమ్మాయి నాట్యం చేస్తూ చేస్తూ, రామం వంక ఒకసారి చూసింది! ఏదో జ్ఞాపకం వచ్చి మరో రెండుసార్లు రామాన్ని చూసింది! రామం అదేపనిగా తనవంక చూస్తుండడం చూసి, ఒక నిముషంపాటు రెప్పవాల్చకుండా రామాన్నే చూసింది! రామం కొంచెం తడబడ్డాడు! వళ్ళంతా ఏదోలాగయింది! సిగ్గుపడిపోయాడు! కిటికీ దిగి అక్కణ్నించి బయటి కొచ్చేశాడు! మనసు ఎందుకో కంగారుగా వుంది! గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి! ఆ అమ్మాయి తేరిపారి, తన నెందు కలా చూసింది!! తను సిగ్గుపడకుండా ఇంకా అక్కడే ఉండవలసింది! ఛీ! అనవసరంగా వచ్చేశాడు! తిరిగి మళ్లీ వెళ్తే బాగుండదు! అయినా, ఆ అమ్మాయినే చూడాలని వుంది! ఎలా సాధ్యమవుతుంది! 'పెళ్ళి ఇంకా రాత్రి ఎప్పుడో కదా జరుగుతుంది! రేపు రాత్రిదాకా ఇక్కడుంటాం! ఎప్పుడేనా చూడచ్చు!' అనుకుని తృప్తి చెందాడు రామం! రామానికి ఇప్పుడా అమ్మాయి పేరు తెలిసిపోయింది! "రత్న కుమారి!" ఎంత బాగుంది ఆ అమ్మాయి పేరు! ఎప్పుడూ నవ్వుతూ రత్నంలా వుంటుందా అమ్మాయి! అప్పుడే స్కూల్ ఫైనల్ పాసయిపోయిందట! తానింకా ధర్డుఫారంలోనే వున్నాడు! ఆ అమ్మాయి అసలు తనతో మాట్లాడుతుందో లేదో! ఆ అమ్మాయి మరెవరో కాదు! వాళ్ళ మామయ్యగారి తోడల్లుడుగారమ్మాయి! తనకి వదిన వరస!!

ఆ రాత్రి భోజనాలయ్యాక, రామం వయసుగల మగపిల్లలందరూ ఒకగదిలో చిన్న గానకచ్చేరీ పెట్టారు! అందరూ తలో పాటాపాడాలని నిర్ణయించుకున్నారు! సరదాగా వింటున్నాడు రామం! అనుకోకుండానే తనవంతు కూడా వచ్చేసింది! ముందు కొంచెం సిగ్గుపడ్డాడు. పాడక తప్పదన్నారందరూ! ధైర్యంగా పాడడం మొదలెట్టాడు పాట కొంచెం బాగానే వచ్చింది! అందరి కంటే తనే బాగా పాడగలిగాననే తృప్తితో పాట ముగించాడు! అందరూ చప్పట్లు కొట్టారు! ప్రక్కపిల్లాడి మీదకు పోయింది పాట పాడవలసిన వంతు! ఆ పిల్లాడు తడుముకుంటున్నాడు! ఇంతలో ఆ రెండు జడలమ్మాయి రామం ఎదురుగా ప్రత్యక్షమయింది!

"అందరి కంటె ఈ అబ్బాయే బాగా పాడేడు! ఇతన్నే మరోపాట పాడమనండి!" అంటూ రామాన్ని చూపిస్తూ రామం ప్రక్కకువచ్చి కూర్చుంది! ఆ అమ్మాయితో పాటు మరో నలుగురమ్మాయిలు వచ్చారా గదిలోకి! రామానికి వాళ్ళెవరూ కనిపించలేదు! తన ప్రక్క ఆ అమ్మాయి కూర్చోడంతో రామానికి వొళ్ళంతా ఏదోలాగయింది! పాట పాడక తప్పలేదు! పాడేశాడు! అందరితో పాటూ ఆ అమ్మాయి కూడా చప్పట్లు కొట్టేసింది!

"వెరీ వెరీ గుడ్!" అంటూ లేచి, చక చకా నడిచి వెళ్ళిపోయింది! రామానికంతా అయోమయమయిపోయింది!

ఆ అమ్మాయిని ఎప్పుడో ఒంటరిగా కలుసుకుని ఏదైనా మాట్లాడాలనుకుంటాడు! తీరా సమయం చిక్కినప్పుడు, ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియక తికమక పడి, మెల్లిగా అక్కణ్నించి జారుకుంటాడు!

రత్నకుమారి— అప్పుడప్పుడు రామాన్నివో కంట కనిపెడుతూ వుండేది! తనకంటె ఆపిల్లాడు చాలా చిన్నవాడిగా కనిపించినా,

అతని కళ్ళల్లో ఏదో ప్రశంసాత్మక మెరుపు తెలిసి తనకు కన్పిస్తుంటే ఏదో తృప్తి వల్ల ఆ అమ్మాయి అలానే చూస్తున్నాది! చాలా వింతగా చూస్తున్నాడు! తను అతని కేసైనా పరిశీలనగా చూద్దామనుకున్నా, కనీసం తన కంటిచూపుతోనైనా అతన్ని సంతృప్తి పరుద్దామనుకున్నా, ఆపిల్లాడు మరీ చాలా చిన్నపిల్లాడిగా కనిపించాడు!' జాలిగా అతని కేసి చూసి, తన చూపు మరల్చేసేది!

ఆ పెళ్ళి జరిగిపోయింది! రామం, వాళ్ళ వూరెళ్ళే బండి ఎక్కేసమయం ఇట్టే వచ్చేసింది! ఆమెకోసం వెతుక్కుంటూ వెళ్ళాడు రామం! చీరలూ అవీ పెట్టెలో సర్దుతోంది రత్నకుమారి!

“మావూరు వెళ్ళిపోతున్నానండి!” జాలిగా అన్నాడు రామం!

ఒక్క అరనిముషం రామం కళ్ళల్లోకి చూసి, మౌనంగానే ‘వెళ్ళి’ రమ్మన్నట్టు తలవూపింది రత్నకుమారి! ఆమె తనతో ఎందుకు మాట్లాడలేదో అర్థంకాలేదు రామానికి! ఆమె తనకంటె నాలుగేళ్ళ పెద్ద! అందుకేనేమో!! రామం అక్కణ్నించి వచ్చేశాడు! అమ్మానాన్నలతో రైలెక్కాడు! వాళ్ళ వూరొచ్చేశాడు! ‘ఛీ! అనవసరంగా ఆ పెళ్ళి కెళ్ళాము!’ అనుకున్నాడు! ఆమె చేసిన భరతనాట్యం, తను పాడిన పాట, ఆ సంఘటనలన్నీ ఓ పదిరోజుల దాకా మరువలేకపోయాడు!

* * *

రామానికి పదహారేళ్ళొచ్చాయి! స్కూల్ ఫైనలు పాసయి, కాలేజీలో చేరాడు ఆ సంవత్సరమే! కాలేజీలో ఒక రెండు జడల అమ్మాయిని చూసినప్పుడు ఆ రోజు పెళ్ళిలో తాను చూసిన రత్నకుమారి జ్ఞాపకం వచ్చింది! తనకిప్పుడు పదహారేళ్ళు వచ్చాయి! రత్నకుమారితో ఇప్పుడు, ధైర్యంగా మాట్లాడగలడు! తనకు తెలిసిన తమాషాలన్నీ చేసి ఆమెను నవ్వించి, ఆమెను తను ఆకర్షించవచ్చు! ఇంతకుముందు రత్నకుమారిలో తాను చూసిన చలాకీతనం తనలో ఇప్పుడు వుంది! మళ్ళీ ఏదైనా పెళ్ళిలో రత్నకుమారిని కలుసుకుంటే బాగుండును! చిన్నప్పటి కంటె కూడా ఇప్పుడు తను బాగా పాడగలడు! ఎలాంటి పాటనైనా పాడేస్తాడు!

ఆమెను కలుసుకునే సమయం ఎప్పుడు వస్తుందా అని అనుకుంటూవుండగానే ఆమె పెళ్ళి శుభలేఖ వచ్చింది రామం వాళ్ళనాన్నగారికి!

ఊహలూ–అనుభవాలూ

మొదట కొంచెం ఆశ్చర్యపడ్డాడు రామం! కొంతసేపటికి తనని తానే సమాధానపరచుకున్నాడు. ‘ఆమెకప్పుడే ఇరవయ్యేళ్ళు వచ్చి యుంటుంది. పెళ్ళి జరగాల్సిన వయస్సే!’ అని!

ఏదో పెళ్ళి సందర్భంగా, ఆమెను కలుసుకుందామనుకున్న వాడల్లా, ఆమె పెళ్ళికే ఆమెను చూడ్డాని కెళ్తున్నాడతను! ఆమె నెలా చూస్తేనేం? ఇంతకుముందు ఆమె కనబరచిన చలాకీతనం తాను ఆమెకు చూపించాలి! కొంటెగా, అకతాయితనంతో ఆమెను ఆకర్షించాలి!!

వాళ్ళింటి కెళ్ళగానే, ఆమెను చూడాలన్న ఆతురత ఎక్కువయింది రామానికి! ఏ గదిలో వుంటుందో! ఏ నాట్యం చేస్తూ వుంటుందో!! ఎవరితో వేళాకోళాలాడుతూ వుంటుందో! ఎలాంటి వోణిలో కనిపిస్తుందో!!! రెండు జడలే ఫాషన్‌గా వేసుకుంటుందో!!

పెళ్ళికూతురున్న గది తెలుసుకోడం ఎంతో కష్టమవలేదు రామానికి! తను లోపలికి వెళ్ళడాని కెవరూ అడ్డుపెట్టలేదు! గదిలో నుండి ఏదో పాట వినవస్తూంటే తొందరగా లోపలి కెళ్ళి చూశాడు! ఆశ్చర్యం! పాడేది పెళ్ళికూతురు కాదు! పెళ్ళికూతురు కోసం గది అంతా ఒక్కసారి కలయచూశాడు! గదిలో ఓమూల కనిపించింది పెళ్ళికూతురు! తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు రామం! అయిదేళ్ళ క్రితం తాను చూసిన రత్నకుమారికీ, ఈ రత్నకుమారికీ ఎంత తేడా వుంది!!

తాననుకున్నట్టు ఆ అమ్మాయి రెండు జడ లేసుకోలేదు! ఇంతకుముందు కనుపించిన ఉత్సాహం ఆమెలో లేదు! ఒంటి జడ వేసుకుంది! ఆ జడనిండా పువ్వులున్నాయి! పట్టు చీర కట్టుకుంది! ఏదో చిత్రమైన బొట్టు పెట్టుకుంది! ముఖం పచ్చగా, బంగారంలా మెరుస్తోంది! వాళ్ళక్కయ్య వాళ్ళూ ఏదో అంటోంటే పైకి చూసీ చూడనట్లు చూస్తూ సిగ్గుగా నవ్వుతోంది! ఒంటినిండా ఏవేవో అలంకరణలతో, ఆమె ఒక దేవతా విగ్రహంలా కనుపించింది!!

ఆమెతో ఎన్నెన్నో మాట్లాడాలనుకుని, ఆమె దగ్గర ఎన్నెన్నో చిలిపి పనులు చేద్దామనుకుని వచ్చిన రామం నిస్పృహ చెందాడు!

ఆమెను పెళ్ళికూతురు దగ్గరి కెళ్ళడానికి వీలు చిక్కకుండా వుంది! ఆమె చుట్టూ ఎప్పుడూ నలుగు రాడాళ్ళుంటూనే వున్నారు!

రాత్రి భోజనాల సమయం! అందరూ చాలా హడావుడిగా వున్నారు! పెళ్ళికూతురింకా ఆగదిలోనే వుంది! రామం అదను కనిపెట్టాడు! ధైర్యంగా లోపలికెళ్ళాడు!

“నేను జ్ఞాపకం వున్నానా?” చిలిపిగా బుర్ర ఊపుతూ, అడిగాడు!

“జ్ఞాపకం వున్నావు!” అనే అర్థం స్ఫురించేలా ఆమె అతి జాగ్రత్తగా, తల ఆడించింది, కొంచెంగా నవ్వుతూ!

“చిన్నప్పుడు బొగడచెట్టు క్రింద ఒకసారి దొంగాటాడుకున్నాం, జ్ఞాపకముందా?” ఆమె నుండి ఏదో మంచి సమాధానం రాబట్టాలని రామం ప్రశ్నించాడు!

మళ్ళీ ఆమె అదే విధంగా తలాడించింది!

“ఇంతకుముందు మిమ్మల్ని చూసినప్పుడు భరతనాట్యం ఆడేరు మీరు! ఇప్పుడు కూడా ఆడుతున్నారా? ఆ రోజున మీరు చేసిన డాన్సు ఎంతో బాగుంది!”

ఆమె అడ్డంగా తల త్రిప్పింది, ‘ఇప్పుడు నేను డాన్సు చేయడం మానేశాను!’ అని అర్థం వచ్చేటట్టు!

రామం ముఖం చిన్నబోయింది!

ఆమె నెలా మాట్లాడించాలి?

“మీరింతకుముందులా ఉత్సాహంగా కనుపించరేం?” తన మనసులో వున్న భావాన్ని బయటపెడుతూ అడిగేశాడు రామం!

రత్నకుమారి జాలిగా అతనికేసి చూసింది “అప్పుడు నా వయసు పదిహేనేళ్ళు! ఇప్పుడు ఇరవై!” అనేసి, కొంటెగా అతనికి కావలసిన విధంగా ఒక్కసారి నవ్వింది! ఆ నవ్వు చూసి ఏదో తెలియని అనుభూతి పొందేడు రామం! ఆమె సమాధానం మాత్రం రామానికి తృప్తిగా లేదు!

ఎవరో వస్తున్న అలజడి కావడంతో, రామం బయటికి కొచ్చేశాడు. పెళ్ళిపీటల మీద, మిగిలిన సందర్భాల్లోనూ రత్నకుమారిని చూస్తూనే వున్నాడు రామం!

ఆమె ప్రవర్తనలో, ఆమె మాటల్లో, ఆమె చూపుల్లో, ఆమె నడకలో, ఏదో ప్రత్యేకత తను చూస్తూ అనుభవిస్తున్నాడు రామం! కాని, తన భావాలు ఎవరికీ చెప్పుకోలేడు! చెప్పకూడదు! ఆ భావా లామెకే చెప్పాలి! అదీ ఇప్పుడు కాదు! తాను ఇరవ

త్యేళ్ళ వాడతనాకి చెప్పాలి! చెప్పకుండా ఆమె తప్పకుండా వింటుంది! తనకి కావలసిన సమాధానం ఇస్తుంది!

ఆమె పెళ్ళి జరిగిపోయింది!

రామం ఇంటికి వచ్చేశాడు!!

*　　*　　*

రామం ఇరవయ్యేళ్ళ వాడయ్యాడు. చదువు పూర్తయింది. ఉద్యోగంలో కూడా ప్రవేశించాడు. తన పెళ్ళి విషయమై తల్లిదండ్రులు తొందర పెడుతున్నారు. పెళ్ళిచూపులకి వెళ్ళివచ్చాడు! ఆ అమ్మాయి ఏమాత్రం నచ్చలేదు! రత్నకుమారి పెళ్ళి కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తోంది రామానికి! ఆనాటి పెళ్ళికూతురు తన కెంటగానో నచ్చింది. ఆ రూపాన్ని తల్చుకున్న కొద్దీ తల్చుకో బుద్ధి అవుతోంది! తన మనసులో ఏదో కలవరం బయల్దేరింది! రత్నకుమారి లాటి పెళ్ళికూతురు తనకు మళ్ళీ దొరకదు! రత్నకుమారి, రత్నకుమారే! ఒకసారి ఆమెను చూడాలి! తన మనసులో వున్న ఆవేదన ఆమెకు చెప్పుకుని తృప్తి చెందాలి! తన భావాలు తెలుసుకుని ఆమె తనని తప్పక మెచ్చుకుంటుంది! తనని ఓదారుస్తుంది! ఆమె తన ఆరాధ్య దైవం!!

తల్లిదండ్రులతో ఏదో సాకు చెప్పి, ఆమె ఉంటున్న ఊరు వెళ్ళాడు రామం!

రత్నకుమారి, ఆమె భర్త కూడా తన నెంతో ఆప్యాయతతో ఆహ్వానించారు! రత్నకుమారి కొంచెం నీరసంగా కనిపించింది!

స్నానంచేసి సావకాశంగా పుస్తకం చదువుకుంటూ పడుకున్నాడు మేడ మీద! ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు! అతనికి మెలకువ వచ్చేసరికి మాత్రం రత్నకుమారి ఎదురుగా కనిపించింది! రామాన్ని భోజనానికి రమ్మని పిలిచింది! చుట్టూ కలయచూశాడు రామం! ఆమె భర్త ఆఫీసు కెళ్ళిపోయినట్టు! ఇంట్లో మరెవ్వరూ లేరు!

"మీరు తప్పుగా అర్థం చేసుకోపోతే మిమ్మల్ని నేనొకటడగొచ్చా వదినా?" ఇన్నేళ్ళుగా ఆమెతో చెప్పాలనుకున్న విషయాలన్నీ చెప్పేయాలని, అడిగేడు రామం!

రామాన్ని చూసి జాలిపడింది రత్నకుమారి! 'పిచ్చిపిల్లాడు' అనుకుని చిన్నగా నవ్వుకుంది. "ఏమీ అనుకోనులే, అదే మిటో అడిగెయ్!" అంది గుమ్మానికి జార్లబడి!

"మామయ్యగారి - రెండో అమ్మాయి పెళ్ళిలో నాట్యం చేశారు మీరు! ఆ నాట్యములో ఓ భంగిమలో మీరు ఒక్క నిముషం నుంచుంటే చూసి ఆనందిద్దామని వుంది!"

"అంతేనా!" జాలి కురిపిస్తూ తేలిగ్గా అడిగింది రత్నకుమారి.

"మీరు నిజంగానే ఏమీ అనుకోపోతే, మరో చిన్నకోరిక, మీ పెళ్ళినాడు నేను మీతో మాట్లాడ్డానికి వచ్చినప్పుడు నేను అడిగే ప్రశ్నలన్నింటికీ తల ఆడిస్తూ జవాబిచ్చారు! ఎలా గిచ్చారో ఒక్కసారి చూపించరూ?"

రత్నకుమారి చిన్నగా నవ్వి, మౌనంగా ఒక్కనిముషం అతని కళ్ళల్లోకి చూసింది!

అదను చిక్కింది రామానికి!


"వదినా! మీరు చదువుకున్నవారు! ఇలాటి కోరిక కోరేనేమిటని నన్ను నీచంగా అర్థం చేసుకోరనుకుంటాను! కళాత్మకమైన మీ ప్రవర్తన చిన్ననాటి నుండీ నన్ను ఆకర్షించింది! ఆ విషయం మీకు చెప్పి, మీ మెప్పు పొందాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను! మీరు నాకు అవకాశం ఇవ్వలేదు! బహుశా మీ కంటే నేను నాలుగేళ్ళు చిన్న వాడ్నని మీరు నన్ను చాలా తేలిగ్గా అర్థం చేసుకుని వుంటారు! నిజం చెప్పండి వదినా! వయసులో మీకంటె చిన్నవాడ్ననంతమాత్రాన, నేను మీకంటె దేంట తక్కువ? చదువు సంస్కారాల్లోనా? ఊగానాల్లోనా? అందచందాల్లోనా?"

రత్నకుమారి ఇంకా మౌనంగానే [illegible] బడింది! రామం ఆవేశం అణగిపోయింది!

"అడగవలసిందంతా అడిగేశావు [illegible] ముందు వచ్చి భోంచెయ్యి! తరవాత నీ సం[illegible]హాలన్నీ తీరుస్తాను!" అంటూ అతని స[illegible]ధానం కోసం నిలబడకుండా, మేడమెట్లు దిగి వెళ్ళిపోయింది! ఆమె తననేదో ఆజ్ఞాపించినట్లయింది రామానికి! కిక్కురుమ[illegible]కుండా ఆమె ననుసరించాడు!

వంటింట్లో తానడుగు పెట్టేస[illegible] టేబుల్ మీద అన్నీ నీట్‌గా ఏర్పాటు చేయబడి వున్నాయి! మాట్లాడకుండా అన్న[illegible] కలుపుకున్నాడు. కుంపట్లో నిప్పుల మీ[illegible]నున్న నేతి గిన్నెను చేత్తో పట్టుకు[illegible] గబగబా తెచ్చి టేబుల్ మీద ఉంచిం[illegible] రత్నకుమారి! నేయి వేసుకుందామని ఆగి[illegible] పట్టుకోబోయాడు! చెయ్యి కాలింది! కం[illegible]రుగా వదిలేశాడు! గిన్నె క్రిందపడబోయింద[illegible]

"అరే కాల్తోందే! మీరెలా పట్టుకో[illegible]గలిగారు?" అన్నాడు ఆమె ముఖంలో[illegible] చూస్తూ!



ఊహాలూ అనుభవాలూ

"అప్పుడే పాలుగేళ్ల నుంచి సంపారంలో అనుభవం సంపాదించాను! ఈమాత్రం వేడికి నా చెయ్యి కాలిపోదు!" అంది రత్నకుమారి నవ్వుతూ!

రామం తెల్లబోయాడు!!

"ఇప్పటికైనా అర్థమయిందా రామం, నీవు నాకంటె దేంట్లో తక్కువ వాడవో?" తేలిగ్గా అనేసింది రత్నకుమారి స్తంభానికి జార్లపడి! "చిన్నప్పటి నుండీ అనుకుం టూనే వున్నాను. నీవు వెర్రి రామానివని! తెలివి ఊహల్ని పెంచుతుంది! వయసు అను భవాన్నిస్తుంది! జీవితంలో ఉపయోగించేవి ఊహాలు కావు! అనుభవాలు!! ఊహాలుంటే మంచిదే! కాని వాటికి అనుభవాలని జత పరచినప్పుడే అవి ఉపయోగిస్తాయి! నీకే గనుక పెళ్లయి వుంటే, ఇందాక అడిగిన రెండు కోరికలూ కోరడానికి నువ్వు సందే హించే వాడివి! ఇది చెప్పినా అర్థంకాదు. అనుభవం మీద నీకే తెలియాలి!"

చెంప మీద ఛెళ్ళున కొట్టినట్లున్నాయి ఆమె మాటలు! రామం సిగ్గుపడిపోయాడు గబగబా భోజనం పూర్తి చేసుకుని, తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేసుకున్నాడు! అతను వెళ్లేముందు రత్నకుమారి అంది. "నిన్ను నేను తప్పుగా అర్థం చేసుకో లేదు! జరిగిందానికి ఊరికే బాధపడకు! తేలిగ్గా తీసుకో!"

"ఎంత అనుభవంతో చెప్పిన మాటలవి?" అనుకుంటూ రామం రైలెక్కాడు! రైలు వేగంగా పరిగెత్తుతోంది! కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తున్నాడు రామం! రామం, రత్నకుమారీ ఆకాశంలో కనిపిస్తున్నారు రామం పదహారేళ్ల విద్యార్థిలాగుంటే, రత్న కుమారి ఇరవయ్యేళ్ల పెళ్లికూతురులా వుంది! రామం ఇరవయ్యేళ్ల పెళ్లికొడు కులా కనిపిస్తే, రత్నకుమారి ఆరునెలల పసిపాపకు పాలిస్తూన్న తల్లిలా కనిపిం చింది! రామం ఇంకా పెద్ద వాడయినప్పుడు రత్నకుమారి అంతకంటే పెద్దదానిలా కనిపించింది! వాళ్లిద్దరికీ మధ్య ఆ నాలు గేళ్ల తేడా, ఎప్పుడూ వుంది! ఇంక ఈ జీవి తంలో రామం, రత్నకుమారీ అలా, ఆ నాలు గేళ్ల తేడాతో గడపవలసిందే! ●

వనితాలోకం :

దక్షిణాది వనితలపై నా అభిప్రాయాలు

కుమారి బిళ్లా సూర్యప్రభ

'దక్షిణాది వనితలు— నా అభిప్రాయాలు' గురించి శ్రీ సుక్తాంకర్ రచన చదివిన 'నేను దక్షిణాదివనితలపై నాకున్న అభిప్రాయాలు, వ్రాస్తున్నాను. సహృదయులయినపాఠకులు, నా యీ అభిప్రాయాలను ఘాటయిన విమర్శగా తీసుకోక, సాధారణంగా జరుగుతున్న సంఘటనలను వ్రాసానని తలుస్తారని ఆశిస్తున్నాను.

'మనలో మాట' లో సంపాదకులు, శ్రీ సుక్తాంకర్ అభిప్రాయాలతో దక్షిణాది వనితలే కాక మరే ఇతర వనితలూ ఏకీభవించరని వ్రాసారు. ఆ వ్యాసం చదవగానే నేను చాలా ఆశ్చర్యపోయాను. వెంటనే కుతూహలంతో శ్రీ సుక్తాంకర్ రచన చదివాను. ఆశ్చర్యం! నేనూ ఏకీభవించను శ్రీ సుక్తాంకర్ అభిప్రాయాలతో.


నేను ఆంధ్రవనితను. కారణాంతరాల వల్ల మద్రాసులో వుండవలసి వచ్చింది. ఇకముందు నేను వ్రాసే ప్రతీవాక్యమూ నా అనుభవాలలోని కొన్ని మచ్చు తునకలు.

మేము మద్రాసు 65 వ సం. మేలో వచ్చాము. ఆనాటి నుండి ఈనెల సెప్టెంబరు వరకూ జరిగిన విషయాలు వ్రాస్తున్నాను, ఇకముందు కూడా ఎటువంటి వింతలు చూడవలసి వస్తుందోమరి. ఇక అసలు సంగతికి వస్తాను మరి. జాగ్రత్తగా అర్థం చేసుకుంటారు కదూ?

మేము మద్రాసు వచ్చిన కొత్తలో సైదాపేటలో వుండేవాళ్లం. మా చెల్లిని త్యాగరాయనగర్ కేసరీ హైస్కూలులో చేర్పించాం. 'సైదాపేట నుండి త్యాగరాయనగర్‌కు బస్సు వుందా' అని అడిగాం, దక్షిణాది వారిని. 'లేద'న్నారు వాళ్లు. అందువల్ల మా చెల్లి సైదాపేటలో ఎలక్ట్రిక్ ట్రయిన్ ఎక్కి, మాంబళం స్టేషన్లో దిగి, స్టేషను నుండి బస్సు స్టాండుకి నడిచి, మళ్లీ బస్సెక్కి త్యాగరాయనగరంలో దిగి, అక్కడ నుండి స్కూలుకి నడిచి వెళ్లేది. అలా సంవత్సరం ఆఖరు వరకూ వెళ్లింది. పరీక్షలు రెండునెలలు వున్నాయనగా తెలిసింది మాకు సైదాపేట నుండి త్యాగరాయనగర్‌కి బస్సు వుందని! అదైనా ఎల్లా తెలిపిందనుకుంటున్నారు? ఈ దక్షిణాదివారి వల్లనే అని అనుకుంటున్నారా? హుఁ, అలా జరిగిన పక్షంలో ఈ విమర్శ వ్రాయటం దేనికి? ఇదేనా దక్షిణాదివారి మంచితనం?

మేము సైదాపేట నుండి పేరియ మెట్టుకి వచ్చేసాం. ఫ్లవరు బజారుకి వెళదామని బయల్దేరాను. అంతా క్రొత్త. ఏబస్సువెక్కాలో తెలియదు. బితుకుబితుగ్గా చూసాను సహాయం కోసం. 'ప్రక్కనే ఒక కాలేజీ అమ్మాయి—బి.యస్.సి. ఫైనలియర్ చదువుతోంది. నాకేలా తెలిసిందంటారా? పుస్తకం మీద పేరుంటుందిగా, దాన్ని బట్టి తెలుసుకున్నాను. అసలు సంగతి చెప్పడం మరిచిపోయాను. మద్రాసు వచ్చి సంవత్సరమైనా తమిళం మాత్రం పట్టుబడలేదు నాకు. 'ఇంగ, ఎంగ, తన్ని, తుని' అనే పొడిమాటలుతప్ప. మెల్లగా ఆఅమ్మాయి దగ్గరకు చేరాను. 'ఫ్లవరు బజారుకి వెళ్లే బస్సు నెంబరు ఎన్నా?' అన్నాను. 'నేనూ అక్కడికేపోతాను' అని అందని అనుకుంటున్నారా? ఇంతలో బస్సు రావటం, ఆ అమ్మాయి ఎక్కిపోవటం, బస్సు వెళ్లిపోవటం నేను నిలబడ్డచోటే మంచుండిపోవడం జరిగిపోయాయి. ఆ మూడు క్షణాల్లో ఆ అమ్మాయికి బస్సు నెంబరు చెప్పే తీరిక లేదంటారా? ఇదేనా దక్షిణాదివారు అడగక పోయినా చేసే సహాయం? ఆ తర్వాత తెలుగుతనం వుట్టిపడుతున్న ఒక పెద్ద మనిషి సహాయంతో నేను ఫ్లవరుబజారు చేరాననుకోండి.

పేరియమెట్టులో ఒక సందులో ఒక యిల్లు వుంది. క్రింద భాగంలో ఆరు కుటుంబాలు వుంటున్నాయి. పై భాగంలో మేము, ప్రక్కన మళయాళం వారూ వుంటున్నారు. ఆ యింటికి మామూలుగా వచ్చే వాళ్లకి తప్పితే క్రొత్తవాళ్లవరికీ ఆ యింటికి ఒక మేడ వుందని తెలీదు. పైన అంటే (మేడ మీద) డాబా వున్నా అది వేరే యిల్లులా వుంటుంది. ఇక ఇంట్లోకి వచ్చినా మెట్లెవరికీ కనిపించవు ఒక ప్రక్కకి వుండటంవల్ల. మయసభలో వున్నవి లేనట్టూ, లేనివి వున్నట్టూ కనిపించాయట. ఈ పెరియమిట్టు మయసభలో లేనివి వున్నట్టు కనిపించవు కానీ వున్నవి మాత్రం లేనట్టు కనిపిస్తాయి. మరి అడ్రసు ఇచ్చినా ఇంటిని కనుక్కోలేని బంధువులుంటారు. వారి మాట వదిలేద్దాం. ఎందుకంటే ఈ దక్షిణాది వారి మంచితనం నాకు తెలుసుగా! ఇల్లు కనుక్కున్నా, ఆ మెట్లని కనుక్కోవటం ఎవరికి సాధ్యం? అలా వచ్చిన మా బంధువులు క్రింద కుటుం



కాల వారిని అడిగేవారు. అన్నట్టు వ్రాయడం మరిచిపోయాను. క్రింద వారందరూ దక్షిణాదివారే. 'ఇక్కడ తెలుగువాళ్ళున్నారు కదా? వాళ్ళిల్లు చూపించండి' అని అడిగేవారు. ఏ భాషలో అని అడుగుతారా? మాకు తమిళం ఎంతవచ్చో వాళ్ళకు తెలుగు అంతవచ్చు. మాకున్నా భాషలో పుద్దండులే. 'యెనక్కు తెరియాదు' ఇదీ వాళ్ళ సమాధానం ఇదేనా దక్షిణాదివారు అడిగిన సహాయం చెయ్యటం? ఇంతకీ ఆ సందులో వున్నవి మూడిళ్ళు. తక్కిన రెండిళ్ళలో అరడజను కుటుంబాలు వున్నాయి. అంతా దక్షిణాది వారే! ఆ సందులో తెలుగు కుటుంబం మాది ఒక్కటే. మేము కలిపించినప్పుడల్లా అతి సానుభూతి కురిపిస్తారు ఈ దక్షిణాది వనితలు. 'అయ్యో పావం వునకి తమిళ తెరియాదా? రొంబా కష్టం అయిపోచ్చి!, మరి వాళ్ళ 'తెరియాదు' అని సమాధానం చెప్పటానికి కారణం అడ్డుగోడలాంటి భాషా సమస్య? లేక...

ఈ దక్షిణాది వనితలకు వున్న మరో సుగుణాన్ని ప్రశంసించారు శ్రీ సుకొంకర్. రోడ్డు మీదగాని, మరే యితర బహిరంగ ప్రదేశాలలో కానీ ఈ దక్షిణాది వనితలు బిగ్గరగా మాట్లాడటం వినలేదట శ్రీ సుక్తాంకర్. దీనికో వుదాహరణ చెప్పమంటారా? ఒకటేమి ఖర్మం చాలావున్నాయి వుదాహరణలు. ఎలక్ట్రిక్ ట్రైను వస్తున్నప్పుడు రైల్వే గేటు మూసేస్తారు. అప్పుడు గమనించండి ఈ దక్షిణాది వనితలను. ఫుల్ స్టాప్ లేకుండా సాగిపోతుంది వారి వాగ్ధోరణి. ట్రైను వెళ్ళిపోయాక గేటు తీస్తారు. ఈ జనసమూహంలో తోపులాటలు, త్రొక్కిళ్ళు ప్రారంభమవుతాయి. వెనక్కి, ముందుకి త్రోసుకుంటు సాగిపోతారు, ఈ జనసమూహం. ఈ హడావిడిలో తమ మాట ప్రక్కవారికి వినిపించకుండాపోతుం దేమోనని మరింత బిగ్గరగా తమ గొంతెత్తి మాట్లాడుతారు దక్షిణాది వనితలు. ఇక సినిమా హాలులో అడుగు పెట్టినది మొదలు సినిమా మొదలు పెట్టినా, ఆ తర్వాత కూడా ఈ వనితల వాక్ప్రవాహం అలా అలా సాగిపోతుండటం మీరెప్పుడూ గమనించలేదా? బస్సు స్టాండులలోను, పబ్లిక్కుగా రోడ్ల మీద అరిచే అంటే మాట్లాడే దక్షిణాది వనితలను మీరెప్పుడూ చూడలేదని గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి.

వనితాలోకం

ఈ దక్షిణాది వనితల తిరుతిండి గురించి ప్రస్తావించారు శ్రీ సుక్తాంకర్. దీనికో వుదాహరణ వ్రాయమంటారా? సినిమా మొదలుపెట్టారు. వేయించిన పెసరపప్పు వాసన నాసికా పుటాలను సోకుతోంది. ఆశ్చర్యంతో చుట్టూ చూసాను. ఆ మసక వెలుగులో నాకు కనిపించిన దృశ్యం. ఇరవై యేళ్ళ యువతి పొట్లంలోని పెసరపప్పు తీసుకుని తింటోంది. నాలుగిళ్ళవతల పెసరపప్పు వేయిస్తే గుప్పుమని వాసనేస్తుందే. సినిమా హాలులో అందునా చీకటిలో తింటే ఎవరికీ తెలియదనుకుందా ఆ యువతి. బస్సు స్టాండులో కాలేజీ అమ్మాయిలు చేతిలో ద్రాక్షపళ్ళు, నోట్లో ద్రాక్షగింజలు. సరిగ్గా వారం అయ్యింది. నేను ఆ కాలేజీ అమ్మాయిలను చూసి. విరగబడి నవ్వాలనిపిస్తోంది కదూ మీకు?

చదువుకున్న దక్షిణాది వనితలే కాదు, చదువుకోని దక్షిణాది వనితలు కూడా ఎంతో నమ్రతగా, వినయంగా వుంటారని సెలవిచ్చారు శ్రీ సుక్తాంకర్. నాన్నగారి ఆఫీసుకి క్యారియరు పట్టుకెళ్ళే ఆయా వుంది. మద్రాసులో ముసలివాళ్ళని 'ఆయా' అంటారు. మా క్యారియరు, మాయింటి ప్రక్కవాళ్ళ క్యేరియరు పట్టుకెళుతుంది ఆయా. వేరే ఎక్కడా దానికి క్యేరియర్లు మోసే పనిలేదు. పదిగంటలకు వస్తుంది. 'అమ్మా, సాపాటు' అంటూ అరుస్తుంది క్రింద నుండి . మేము మేడ మీద వుంటున్నాం. అది వచ్చిన అయిదు నిముషాలలో మనం దానికి క్యారియరు క్రిందకు తీసుకు వెళ్ళి యివ్వాలి. అలా యివ్వని పక్షంలో పెద్దగా అరుస్తుంది, 'రొంబా లేటు అయిపోచ్చి' అంటూ. 'ఎందుకలా అరుస్తావు, తెస్తాం వుండు. పదిగంటలకి వస్తే వంటెలా అవుతుంది' అని మేము అంటే, 'ఎన్నా అమ్మ, ఉనకెన్నా తెరియుం. వేయిల్ (ఎండ) వుండాది. కాలెల్లా..' అంటూ సణుగుడూ మొదలు పెడుతుంది. ఇదేనా చదువుకోని దక్షిణాది వనితల మంచితనం.

'వంటిపావకు నీళ్ళు పొయ్యటానికి ఎవరైనా వున్నారా' అంటే చెప్పలేని ఈ స్వార్థపూరితుల మంచితనాన్ని ఎవరైనా ఎలా సమర్థిస్తారు.

వ్యక్తి దూషణ, సంఘ దూషణ పనికి రాదంటారేమో, కేవలం కొందరిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని నేనిలా వ్రాయటం లేదు. మంచితనం తొణికిసలాడుతున్నవారు వుండచ్చు. స్వార్థపూరితులూ వుండచ్చు. వారి మంచితనానికి మచ్చుతునకంటూ ఏదైనా వ్రాయమంటారా—

ఒక తమిళ కుటుంబం వుంది. తల్లీ, నలుగురు కుమార్తెలు. మొదటమ్మాయి ఎం. బి. బి. యస్., రెండో అమ్మాయి బి. యస్‌సి. మూడో అమ్మాయి బి. ఏ., నాలుగో అమ్మాయి పి. యు. సి. చదివేది పోయిన సంవత్సరం. ఇప్పుడు ఏం చదువుతుందో నాకు తెలీదు. వీరికి తెలుగు కూడా వచ్చు. మేము చదువుకున్నాం అనే అహంకారం వారిలో లేదు. వారు మాకు ఎంతో మాట సహాయం చేసేవారు, చేతి సహాయం కూడా ఎంతో చేసారు మాకు. పాపం వాళ్ళకి తండ్రి లేడు. ఆయన కూడా డాక్టర్.

ఈ నవయుగంలో (నవయుగమేమిటి అని నవ్వుకుంటున్నారా, పోనీండి మీమాటే కానిద్దాం) ఈ ఇరవయ్యవ శతాబ్దంలో చదువుకీ, సంస్కారానికి పొత్తు కలవడం అసాధ్యం. ఒక్కొక్కపుడు చదువరుల కన్న చదువుకోనివారే ఎంతో తెలివితేటలుగా ప్రవర్తిస్తారు. శ్రీ సుక్తాంకర్ దక్షిణాది వనితలలోని మంచితనాన్ని మాత్రమే చూసి వుంటారు. అది ఆయన తప్పుకాదు. ఎదుటి వ్యక్తిని ఒకప్రక్క నుండే చూస్తాం మనం. ఎవరైనా ఆ వ్యక్తి గుణాన్ని పొగుడుతే, మనం ఆ గుణాన్నే అతనిలో పరిశీలిస్తాం. వేరే గుణాన్ని అతనిలో పరీక్షించడానికి ప్రయత్నించం, ప్రయత్నించలేము కూడా. శ్రీ సుక్తాంకర్ పై కోవకు చెందిన వ్యక్తని పాఠకులు గ్రహించి వుంటారు. మానవుడికి అన్నిగుణాలు వుండాలి. అప్పుడే పరిపూర్ణత పొందుతాడు మానవుడు.

అత్యాధునికులకు ఒక విజ్ఞప్తి...

వినాయకచవితి నాడు నెత్తి మీద అక్షంతలు వేసుకోకుండా చవితి చంద్రుడిని చూసాను. సాయంత్రం నాలుగు గంటలకు చవితి అయిపోయింది. నేను చవితి చంద్రుడిని ఏడు గంటలకు చూసాను. అప్పటికి చవితి అయిపోయింది. మరి నీలాపనిందలకు గురి అవుతానా నేను? సహృదయులయిన పాఠకులపై ఆధారపడి వుంది నా ప్రశ్నకు జవాబు!

దక్షిణాది వనితల మంచితనాన్ని, స్వార్థపూరిత అహంకారతత్వాన్ని సమపాళ్ళలో అర్థం చేసుకున్న పాఠకురాలిగా, ●

సీరియల్:

ఆమ్రపాలి

మూలం. రామచంద్ర ఠాకూర్

అనువాదం ఆకెళ్ళ సీతారామం

జరిగిన కథ

మగధరాజా బింబిసారుడు ఆమ్రపాలిని చేపట్టాలనే ఉద్దేశ్యంతో వైశాలికి వస్తాడు. పాలి భవనంలో ప్రవేశించి ఆమెని ఆకర్షిస్తాడు. పాలికి బింబిసారునిపై ప్రేమ జనిస్తుంది. మహానాముడు ప్రవేశించి వృత్తాంతమును గ్రహించి పాలిని [illegible] చేస్తాడు. బింబిసారుని వివాహం చేసుకున్న పాలికి తన తండ్రి నిర్ణయం తెలిసి మరణశయ్యపైనున్న మహానాముని చెంతకు వస్తుంది. మహానాముడు మరణిస్తాడు. చేటన బింబిసారుల వివాహానికి [illegible]. యుద్ధానికి సన్నద్ధులైన లిచ్ఛవీయుల్ని పాలి శాంతింపచేసింది. చేటన, సంజయుడూ పాలిని అనుగ్రహించమని బింబిసారుని కోరాడు. బింబిసారుడు పాలి [illegible] వస్తాడు. పాలి చేటకరాజు నగరం విడిచి వెళ్ళిపోయింది.

22

పాలికి పక్కలో ఎవరో తట్టి లేపి నట్టయింది. ఆమె తత్తరపడిపోయింది. ఆమె ముఖాకృతి ఘోరమయింది. కాని ప్రశాంతంగా ప్రసన్నమైంది. చివరకు ఆమె నవ్వు అంతర్ధానం అయింది. ఆమె అంది—'అన్నయ్య శ్రేష్ఠి, వింటున్నారా. పెళ్ళైన పుత్రుడు తల్లిదండ్రులకే సొంతమౌతాడో నాకేం తెలుసు?

మానుని ఏకాంతం [illegible]. అతడంతా విన్నాడు—'అమ్మ పాలీ, [illegible] తల్లి కానిదే తల్లిదండ్రుల [illegible] అర్థం చేసుకోలేరు.'

'నిజమే, నేనెలా తెలుసుకోగలను?' అని పాలి శాంతంతో అంది. మానునికి మరింత ప్రోత్సాహం లభించింది. అతడన్నాడు 'అమ్మా.. అమ్మా.. దేవీ, నా శోక సమయాన్ని, [illegible] అభిమానాన్ని క్షమించమని వేడుకోడానికి వచ్చాను. నన్ను క్షమించు, నాకు [illegible] నాడు తల్లివైనా నా పుత్రుడు...'

శ్రేష్ఠి మాట్లాడుతున్న సమయంలో మహల్ ద్వారం వైపు ప్రవేశించింది పాలి శాంతపూర్వకంగా అంది—'శ్రేష్ఠీ, నా ద్వారంలోకి ప్రవేశించే వారిని నేను ఆపలేను. ఎవరైనా వచ్చు. కానీ ఈ మహలునకీ ద్వారం, ద్వారంతో వెళ్ళేవాణ్ణి నేనెన్నడూ ఆపలేదు. నేను ఈ నియమాన్ని పదహారేళ్ళ నుండి పాటిస్తూ వస్తున్నాను. అలాంటప్పుడు, నీ పుత్రుని అడ్డుకోవడాన్ని నేనెలా చేసెను? నేను కేవలం మనోరంజనానికై నాట్యం చేసేదానిని, నిశానిని. అతడు వెళ్ళగోరితే నీవు నీ పుత్రుని సంతోషంతో తీసుకుపోవచ్చు.'

మానుని ఆశ తెగిపోయినట్టు కన్పించింది. అతడు నమ్రం కలవాడైనా మరింత నమ్రంతో అన్నాడు— 'పాలీ, వాడు నీ ఆజ్ఞ లేనిదే ఇక్కడి నుండి రవంతైనా కదలడు' నీవే వాణ్ణి ఇక్కడి నుండి పంపివేయగలవు. పాలీ, వాడు కుమారుడు, అజ్ఞాని, మూర్ఖుడు, [illegible]...'

'నా [illegible] చిన్నవాడని [illegible]. కాని ప్రేమకు వయోవర్ణముల బంధం ఉంటుందని మీ కెవరు చెప్పారు? ఒకప్పుడు నేను కుమారిని, మీరు నాకంటె ఎన్నో ఏళ్లు పెద్ద. అయినా, వయో వర్ణాల దృష్టితో ఉంచుకొని నన్ను వదల [illegible] లేదు. నేను [illegible] తరవాత నేను ఒక కుమారుణ్ణి [illegible] ఎందుకు తోస్తోంది? శ్రేష్ఠీ. నీ కుమారుడు [illegible]. తన ఇష్టప్రకారం వెళ్ళవలసిందే [illegible]. అతడు నీ కుమారుడు, నా...'

'నా కుమారుడు' అని చెప్తూ పాలి విస్ఫారిత నేత్రాలతో అట్టాలికలో నుండి క్రింది వైపు మార్గాన్ని చూడసాగింది.

మానునితో మాట్లాడుతూ ఆమె వెలుపలికి వచ్చింది. మార్గంలో బౌద్ధభిక్షుకుల గుంపొకటి పోతూంది. అందరి కంటె ముందు ఒక నవయువకుడైన భిక్షుకుడు పోతున్నాడు. పాలి అతనినే చూస్తోంది.

ఈ రోజులలో వైశాలిలో జటిలులు, పరివ్రాజకులు, నిర్గ్రంధుల ప్రభావం అతిశయిస్తూంది. వీరిలో ప్రతిధర్మానుయాయీ లిచ్ఛవీయుల్ని తన ధర్మధ్వజం క్రిందికి తీసుకొనిరావడానికి యత్నిస్తున్నాడు.

స్వాతంత్ర్య ప్రియులైన లిచ్ఛవీయుల మనసు ఈ నూతన ధర్మముల చేత ప్రభావిత మవుతోంది. ఉన్నత పదవి యందున్న లిచ్ఛవీయుడెవడైనా ఏ నూతన ధర్మప్రవర్తకుణ్ణయినా మన్నిస్తే, మర్నాడే ఆ ధర్మప్రవర్తకుని శిష్యగణం తమ ధ్వజమూ భేరీ—వీటితో వైశాలిలోని ప్రతివీధిని తన గురుజనుల గుణగానం చేస్తూ తిరుగుతారు. కాని వీరందరిలో నిర్గ్రంథులు, బౌద్ధభిక్షువుల ప్రాచుర్యం ఉంది. కాని వీరి యామ శాసనప్రదర్శనము మహాలనుంచి బౌద్ధులు జనులను అధికంగా ప్రభావితుల్ని చేశారు. లిచ్ఛవీయుల కళ్ళు ఇప్పుడు విశేషంగా బౌద్ధభిక్షువుల మీద లగ్నమయ్యాయి. ఏమంటే, 'థేరగాథ'లో వర్ణింపబడిన 'సియజ హోశీర' వంటి క్రూర లిచ్ఛవీయ గణం సంసారాన్ని త్యజించి తథాకథిత 'అర్హత పదము' పొందారు. ఇంకా, ఈ లిచ్ఛవీయ భిక్షుకులే గౌతమబుద్ధుని ఆజ్ఞా ప్రభావాల్ని అనుకరించి బౌద్ధ ధర్మప్రచారం చేసేవారు. ప్రాతఃకాలం బౌద్ధభిక్షుక గణం భిక్షకోసం 'చీవర పిండిపాత్రము' తీసుకొని బయలుదేరేవారు. ఎవరైనా భక్తుడు వాళ్ళని భోజనానికి పిలిస్తే వాళ్ళక్కడికి వెళ్ళేవారు. పిలుపు రాకపోతే మధ్యాహ్నం లోపున దినానికి ఒకసారి భిక్షమడిగి పొట్ట పోషించుకొనేవారు. నేడు ఎవరూ పిలవక పోవడం చేత ఈ చిన్నభిక్షు సమూహం భిక్షమడుగుతూ పాలి మహలు ముందునుండి బయలుదేరిపోతోంది.

ముందలి నాయకుడు ఆ యువకశ్రమణుడే. అతడు తన కాషాయవస్త్రాలలో వారందరికీ ప్రేరణామూర్తి లాగ కనబడుతున్నాడు. గౌతమబుద్ధుడు తన శరీరం, గుణాలలో నుండి ఒకభాగం తీసి మరొక చిన్నబుద్ధుణ్ణి తయారు చేసినట్టు అనిపిస్తోంది. అతని పేరు విమలకోడంగజుడు.

పాలి ప్రాసాదానికి ఎదురుగా మరొక మాణవ లిచ్ఛవీయుని చిన్న యిలు ఉంది. ఈ లిచ్ఛవీయుడు ఒక జటిలుని శిష్యుడు అవడం వల్ల, బౌద్ధభిక్షువుల్ని ఈసడిస్తున్నాడు.

యువకశ్రమణ విమలకోడంగజుడు పాలి ప్రాసాదం వైపు పోక మాణవ గృహం వైపు మళ్ళాడు. భిక్షువులు తన యింటివైపు రావడం చూసి మాణవునకు చాలా కోపం వచ్చింది. _ భిక్షకోసం విమలుడు హెచ్చ

అతని ముందు కిరకా చూసి సొలేదు అతడు కొన్ని దుర్భాషలాడి, ఏవగింపుతో అతని వైపు ఉమ్మి, తలుపులు మూసివేశాడు.

దీనికి విములుడు కొంచెమైనా కలత చెందలేదు. అతడు తన దక్షిణ హస్తాన్నెత్తి ఆశీర్వదించి తన సంఘంతో వెనక్కి పోయాడు. పాలి కళ్ళు పెద్దవి చేసి దీనినంతా చూస్తోంది కాని యువశ్రమణుడు తన సంఘంతో తన ప్రాసాదం వైపు వస్తూండడం చూసి అరిచింది. 'సునేత్రా, సునేత్రా, భిక్ష వెయ్యి. భిక్షం తీసుకొని వేగంగా ఇవతలికి కిరా..' ఆమె పుత్తభిక్ష అడుగవచ్చిన శాంకోబీయు శ్రేష్ఠిని విడిచి ఆ భిక్షుకుడికి భిక్ష వేయడానికి పరుగెత్తింది. కంగారు, పరుగెత్తడం వల్ల శ్రమ మూలంగా ఆమె ఒగరుస్తోంది. ప్రాసాదానికి వెలపల ఆ తేజస్వి శ్రమణుడు తన సంఘంతో నిల్చున్నాడు. అకస్మాత్తుగా అతని దగ్గరకు వచ్చి పాలి ఏమీ మాట్లాడలేకపోయింది. విములుని, అతని సుందరవదనాన్ని, ఆ ముఖానికి కుడి వైపున కనిపించే పుట్టుమచ్చను, అతని తీక్షణమైన నేత్రాలు ఆమె చూస్తోంది. అవును, కళ్ళు అవే. పాలి అతనిలో బింబిసారుని ప్రతిబింబాన్ని చూస్తోంది. నాసిక, పెదాలు, చిరునవ్వు—అన్నీ అలాగే ఉన్నాయి.

పాలి పిచ్చిదై ఉన్మాదినిలా విములుని దగ్గరకు వచ్చి నిల్చుంది. ఆమె గుండె వక్షాన్ని చీల్చుకుని బయటకు వచ్చిపడుతుందేమో అన్నంతటి వేగంతో కొట్టుకుంటూంది. ఆమె విమల శ్రమణునకు అతిసమీపంలో నిల్చుంది. శ్రమణుని దగ్గర నిల్చున్న వయసు మీరిన భిక్షుకులు తాకుతుందని భయంచేత సంకోచించి వెనక్కి తొలగిపోయారు. కాని విములుడు స్థితప్రజ్ఞునిలాగ అలాగే నిల్చున్నాడు. ఎప్పటి శాంతంతో అతడు ఆశీర్వదించి భిక్షాపాత్ర ముందుకు జాపాడు. దానివెంట ఇతర భిక్షువుల హస్తాలు కూడా ముందుకు సాగాయి.

పాలి ప్రాసాదం వైపు కాలు సాగడానికి ముందు ఒక భిక్షుకుడు నరకి యింటి నుండి భిక్ష తీసుకోనవద్దని విములుని సవినయంగా కోరాడు. కాని, ఉచ్ఛనీచాలను పాటించక, గతంలో దాస్యంచేసి ఇప్పుడర్హత పొందిన ఉపాలిథేరుడు, ఒకనాటి జాలరి యసోజథేరుడు, కొద్ది సంవత్సరాలకు పూర్వం శూద్రకర్మ చేసి ఇప్పుడర్హత పొందిన సునీతథేరుడు—వంటి ఉత్తమ బౌద్ధ భిక్షుకుల ఆవేపు వెళ్ళడానికి ఆవంత అయినా సందేహించలేదు. ఆ భిక్షుకుని వేపు ఒక స్మిత దృష్టి సారించి అతడు పాలి ప్రాసాదం ఎదుట వచ్చి నిల్చున్నాడు. విములుడు భిక్షాపాత్ర ముందుకు చాపి భిక్షకోసం ఎదురు చూస్తున్నాడు. పాలి అతని ముఖారవిందాన్ని చూడడంతో మై మరచింది. ఇతర భిక్షువులు వీరిద్దరినీ చూస్తున్నారు.

పాలి శ్రమణునికి మరింత దగ్గరగా రాసాగింది. భిక్షాపాత్ర ఆమె వక్షానికి తగలగానే ఆమె ఆగింది. ఆ భిక్షుకుడు ఇంత సేపటి నుండి ఎందుకోసం నిల్చున్నాడో ఇప్పుడామెకు కొంత తెలిసింది. ఆమె వెంటనే చెవులు, చేతులు, మెడలోని ఆభరణాలను ఒకదాని తర్వాత ఒకటి తీసి శ్రమణుని భిక్షాపాత్ర నింపసాగింది. చూస్తూండగానే భిక్షాపాత్ర అమూల్యమైన రత్నజటిత స్వర్ణాభూషణాలతో నిండిపోయింది.

భిక్షుగణములన్నీ విములుని చూస్తున్నాయి. విములుని దృష్టి తన భిక్షాపాత్ర మీద ఉంది. అతడు మెల్లగా పాలి హస్త వేపు చూసి, పాలి దగ్గర నిల్చున్న సునేత్ర స్వర్ణపాత్రతో భిక్షాపాత్ర ద్రిమ్మరించాడు పాలి విస్మితయై చూస్తోంది. ఆమె కొంచె



కోపించి అంది—'భిక్షుకా.'

తక్షణం విమలుడు తన జీవనమయమైన చిరునవ్వుతో సతమసకుడై అన్నాడు—'దేవీ, పొట్ట నింపుకోడానికి మాకన్న పాశనం కావాలి, మేము భూషణాలను ఏంచేసు కుంటాం?'

'శ్రమణా, నీవు ఈ నగల విలువ ఎరుగుదువా?' పాలి అతన్ని ఆశపడేలాగ చేసింది. 'పది సంవత్సరాల దాకా నీకు రెట్టింపు భిక్షుకులకు కూడా భిక్షమెత్త పనసరం ఉండదు.'

'దాని తర్వాత?'

'నేను మరికొన్ని నగలిస్తాను.'

'దాని తర్వాత?'

'నీవు జీవితమంతా సుఖంగా నిర్వహించ గలుగునంతటి ధనమిస్తాను.'

'దాని తరవాత?'

'దాని తరవాతనా? నేను నిన్ను నా మహల్లో నాకళ్ళ ముందు ఉంచుతాను. పాలి మనసులో కోరిన వనువును, సుఖాన్ని ఇవ్వకలదు. ఏవస్తువు నీకు లభిసుంది.'

'తర్వాత?'

'శ్రమణా, నీవింకా నవయువకుడవు. నీ కింకా పదిహేడేళ్ళయినా నిండి ఉండవు. జీవిత సుఖాన్ని నీవేమి చూశావు? ఈ వస్త్రంలో నీ గురువు తన కల్పనైనా నీ దగ్గరకు రానిచ్చి ఉండడు. నా మాట విని నీవు నా దగ్గర ఉండు. నీవు కావాలంటే అందమైన బాలికతో నీకు వివాహం చేస్తాను. సమస్త వైభవాల్ని నీ పాదాల మీద గుమ్మరిస్తాను.'

'ఆ తర్వాత?'

'నిరోక్షీ, మూర్ఖశ్రమణా, తరవాత దేవతలకు కూడా ఎవరిని చూసి ఈర్ష్య కలుగుతుందో అటువంటి వ్యక్తివి అవుతావు.'

'తర్వాత?'

'యువకుడా, నన్ను మూర్ఖురాల్ని చెయ్యకు. నీ 'తర్వాత' వల్ల జీవితంలో నాకు ఎక్కడా అంతం రాలేదు.'

'మేము 'అంతము'ను అడిగే జీవితాన్ని గ్రహించడానికి యత్నిస్తాం. అప్పుడు మాకు ... అంతమూ దుఃఖంగా ... జీవితం దుఃఖమనీ తెలుస్తుంది.'

'జీవిత ప్రవాహాన్ని ఎరగని యువకుడా, ... దుఃఖం ... సుఖం. నీయూ సాధా ... నీయూ దగ్గర

భిక్షాపాత్ర, నూతన బిచ్చపీయ ప్రహారాల వంటి మలిన ప్రహారాలు, అవమానాలు, తిట్లు, నీకు నిజంగా నచ్చుతాయా? ఇదేనా నిజమైన సుఖం? జీవితాన్ని మర్దించడంలోనే నీ సంతోషం, జీవిత సమాప్తం ఉన్నాయా?

'నీ వెప్పుడైనా భిక్షమెత్తావా?'

'లేదు.'

'అయితే అందులో ఇమిడి ఉన్న సుఖ దుఃఖాలు నీవు ఎలా తెలుసుకోగలవు? అవసరాలన్నింటికీ దూరంగా ఉండి, భిక్షమడిగి, ఒక్కదినం గడుపు. అప్పుడు ఈ సరళ జీవిత సుఖం అర్థమవుతుంది.'

వీరిద్దరూ వ్యాహా దుతున్నప్పుడు దూరంగా కుటీరంలో నివసిస్తున్న ఒక బీద స్త్రీ ఒగరుస్తూ వారి దగ్గరకు వచ్చి నిల్చుంది. సునేత్ర, పాలి, విమలుల సంభాషణ వినడంలో ఆమె మునిగిపోవడం చేత, దాసితో కూడ భిక్షువులకు ఇవ్వడానికి తెచ్చిన ఫలములు, మిఠాయిమాట మరిచింది. ఆ స్త్రీ విమలుని భిక్షాపాత్ర రిక్తంగా ఉండడం చూసి వణకుతున్న చేతులతో, గోధుమలు, దళసరిగా ఉప్పు జొన్నరొట్టెలు వేపుడు ధాన్యం, పచ్చడి, బియ్యంతో చేసిన మిఠాయి భాగం దానిలోవేసి భిక్షువు పాదాల నంటింది. విమలు డదరిపడి చూశాడు. భిక్షాపాత్ర నిండిపోయింది. వెకవెకలాగ, చిరునవ్వుతో అతడు బ్రాహ్మణిని ఆశీర్వదించి, స్తబ్ధంగా ఉన్న పాలికి నమస్కరించి పోసాగాడు. ఈలోపున సునేత్రకు జ్ఞప్తి కొచ్చింది. ఆమె వేగంగా పరుగెత్తి తక్కిన భిక్షువుల పాత్రలు పళ్ళూ, మిఠాయిలతో నింపివేసింది. భిక్షుకులు మౌనంగా వాటిని స్వీకరించి ఆశీర్వదించి విమలుని వెంట వెళ్ళిపోగారు.

ఇటు చూడకుండ, వేగిరపడకుండ, ఏమీ చెప్పకుండపోతున్న భిక్షుకుని పాలి చాలసేపు చూస్తూ ఉంది. సునేత్ర అప్పుడు కొంచెం కలవరపడి అంది— అమ్మా, లోపలికి రండి .. కాని పాలి రెప్పవాల్చకుండా అలాగే చూస్తోంది!

అమ్మా, విను, లోనికిరా .చూడు, ఎదుట ఎంత గుంపు ఉందో లోపలికి రా తల్లీ!

నేనెప్పుడూ బిచ్చమెత్త లేదు అని పాలి తనలో అనుకుంటున్నట్లుంది.

'అవును తల్లీ, లోపలికిరా.'

'సునేత్రా, మాబోటివాడూ బిచ్చమెత్త లేదా?'

'లేదమ్మా, ఇప్పుడు లోపలికి పద.'

'సునేత్రా, బౌద్ధభిక్షువులు మహోద్యానంలో ఆగారా?'

'అవునమ్మా, మీకు జ్వరం వచ్చినట్లుంది. లోపలికి...'

'ఆ శ్రమణు డెవరు?'

'నేనిప్పుడు చెప్తాను. ముందు మీరు లోపలికి..'

'సునేత్రా ...పాలి' అకస్మాత్తుగా సునేత్ర భుజాలు గట్టిగా పట్టుకుంది. ఆమెఅంది— 'ఆ శ్రేష్ఠి ఇంకా మహల్లోనే కూర్చున్నాడా?'

'అవునమ్మా. ఇందుచేతనే చెప్తున్నాను. లోపలికి..'

సునేత్ర వాక్యం పూర్తవడానికి ముందే పాలి మహలు వైపు పరుగెత్తింది.

సునేత్ర విస్మిత జనసమూహం మీద ఒక కన్నువేసి పాలిని వెన్నంటింది. తన స్వామిని ఉన్మాదం పొందుతూన్నట్లు ఆమెకు నమ్మకం కలిగింది.

మహలుకు పోయిన కొన్నిక్షణాల తర్వాత పాలి ఒక నవయువకుని హస్తం పట్టుకొని మాఘ శ్రేష్ఠి దగ్గరకు వచ్చి నిల్చుంది.

'శ్రేష్ఠి, ఈ నిప్పుతరత్నాన్ని తీసుకో. ఇతడు క్షమాపణ అడుగుతున్నాడు. ఇతడెప్పుడూ నాయింట్లో కాలు పెట్టడు.'

యువకుడదరిపడి పాలి వంక చూసి దైన్యంతో అన్నాడు— 'దేవీ, మాయింటికి రావడానికి సిద్ధంగా ఉన్నానని ఇప్పుడే గద మీరన్నారు? ఇంకా....'

'ఈ రోజుటి నేను మూర్ఖులనే చూస్తున్నాను. ఇప్పుడు మరో మూర్ఖుని చూడాలనే కోరిక కలిగితే మొదట మీయింటికి వస్తాను. నీవిప్పుడే వెళ్ళిపో.'

'దేవి...'

'నేను దేవిని కాను, మూర్ఖుడా.'

'అవును, నేనే మూర్ఖుణ్ణి. నీవు నాతో ఒక మాతలా ప్రవర్తించావు. నన్ను మూర్ఖుణ్ణి చేశావు. ప్రేమ దగమైన ఆత్మహృదయం విలువ నీకేమి తెలుసు ందిని? నేను వెడుతున్నాను. నీవు చెప్తున్నావు. అంచేత తప్పకుండా వెడతాను. కాని.. కాదు, కాదు.. కఠినురాలా, నీవు నన్ను ఇన్నాళ్ళవరకూ ఆశ పెట్టావు...నేను..నేను..'

'నాకేమి శిక్షనివ్వాలో నీ తండ్రి నడుగు. ఇతడూ పన్నెండేళ్ళ నుండీ నన్ను శిక్షి

అనే చెప్తున్నాడు. మీరిద్దరూ నిశ్చయించి తప్పకుండా ఇటు రావాలి.'

ఇలా అని ఆమె ఎప్పటిలాగ యువకుని వాత్సల్యపూరిత దృష్టితో చూసి అతని బుగ్గ మీద మెల్లగా తట్టింది. యువకుడు భ్రమపడి ముగ్ధుడై తన యెడల తల్లిలా వ్యవహరించిన పాలితో ఏమీ అనలేకపోయాడు.

కోపాన్ని, తీవ్రమైన అవమానాన్ని అనుభవించి అతనికళ్ళు అశ్రుపూరితమయ్యాయి. మాఘుడు పాలి ఉపకారానికి ఆనందించి కొంచెం తెలుసుకొన్నాడు. అతడామెకు సానుభూతితో, శ్రద్ధతో వందనం చేసి కుపితుడైన తన పుత్రుని చెయ్యిపట్టుకొని వెళ్ళిపోయాడు. పాలి నీరసమైన చిరునవ్వుతో వాళ్ళని చూస్తూ ఉంది.

సునేత్ర తలబాదుకొని అలసిపోయింది. కాని, ఏమీ తెలియలేదు. తుదకు కొంచెం ఆలోచించి పరుగెత్తుకుంటూ పాలి దగ్గరకు వచ్చి అంది— 'అమ్మా, ఈ యువకుని బుగ్గ మీద ఆసాధువుకున్నట్టు ఒక పుట్టుమచ్చ ఉంది కదా?' పాలి అదరిపడి ఆమెను చూసి నవ్వి అంది— 'అతని పెదాలు, కళ్ళు కూడ సాధువుని లాగే ఉన్నాయి.'

పాపం సునేత్ర ఏమీ అనలేకపోయింది. పుట్టుమచ్చ ఉన్న ఏ యువకునివైపైనా పాలి ఏ భావాలతో చూసిందో ఆమె కిప్పటి వరకు అర్థంకాలేదు.

* * *

పాలి హృదయం ఎక్కువ వేదనతో నిండి ఉంది. పూర్తిగా పదహారు సంవత్సరాలు గడచినా ఆమె తన పుత్రుణ్ణి పూర్తిగా మరచిపోలేకపోయింది. బాలుని సుఖం కోసం తన హృదయాన్ని రాయి చేసుకుని వాణ్ణి శాశ్వతంగా దూరము చేసిన తలే ఈ పదహారు సంవత్సరాలలో ఇప్పుడు తన పుత్రుడేలా ఉంటాడు, ఎలా కనిపిస్తాడని లక్షల కొలదీ సారు ఊహించింది.

ఇంత దీర్ఘకాలంలో ఒకసారియైనా ఆమె తన సోదరుని గాని, పుత్రునిగాని చూడలేదు. ఎప్పుడైన తేజస్వి అయిన కిశోరుని మీదగాని, యువకుని మీదగాని ఆమె దృష్టి ప్రసరించినప్పుడు ఆమె ఆసక్తితో అతన్ని చూస్తుంది. వారిలో ఎవరి ముఖమైనా బింబిసారుని ముఖాన్ని రవంతైనా పోలి ఉంటే అతన్ని ప్రేమిస్తుంది. వీలుపడితే తన దగ్గర ఉంచుకొని పుత్రునిలా లాలించి పెంచుతుంది. బీదవాడైతే అతనికి సహాయం చేస్తుంది. మహత్వాకాంక్ష కలవాడయితే అతను కోరిన చోటికి పంపడానికి ఏర్పాటు చేస్తుంది. మహాత్ముడైతే అతనిని కొన్నిదినాలు తన దగ్గర ఉంచుకొని, పరాయివాడని అతన్ని పోనిస్తుంది. ఈ విధంగా సంపర్కం కలిగి భ్రమించిన సమయాలకు ఎందరో జ్ఞానం పొంది తమ ఇళ్ళకు పోతున్నారు. అలాంటి కిశోరుల్ని ఉంచుకోవడం వల్ల పాలికి అనేకమైన అవమానాలు వచ్చాయి. కాని ఆమె ఆరాటం కేవలం తనూ ప్రతీకారం చెయ్యక అలాంటి మాటలను వ్యాపించ చెయ్యనిచ్చేది. ఈ విషయం సునేత్రకు తెలియదు...

'దేవి..' అంటూ సునేత్ర అకస్మాత్తుగా పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పసాగింది.. 'ఉదయం ఆరామ భిక్షువులు వచ్చారు కదా.. వారు మాట్లాడుకున్నారు, అంటే ఇప్పుడు ఈ సంఘారామంలో దిగంబరుడైన పాటీక పుత్రునితో వాదం చేస్తారు..'


'దిగంబరుడు పాటీక పుత్రుడెవరు?'

'అవును, దేవి, మీరెరుగరు. వైశాలిలో అర్థభాగానికి పాటీక పుత్రుడంటే పిచ్చి. ఆ గోష్ఠిలో ప్రశ్నలకు జవాబివ్వడానికి బౌద్ధసాధువులు వస్తారు..'

'భిక్షుకులందరూ వస్తారా?'

'రారు తల్లి, కేవలం ఆ సుందరుడైన శ్రమణుడు వస్తాడు. అతడు సామాన్యుడని అనుకోకు. అతనికనేకమంది విద్వాంసులు, ఉత్తమ కోటికి చెందిన భిక్షువులలో స్థానముంది. అతడే పాటీక పుత్రుని ప్రశ్నలకు జవాబిస్తాడు.'

ఇది శీఘ్రంగా చెప్పి సునేత్ర ఊరుకుంది. ప్రశ్నలకు మించిన సమాధానం ఇవ్వడంవల్ల ఆమెకు సంకోచం కలుగుతోంది. కాని పాలి ఏమీ అనలేదు.



సంధ్యా సమయంలో సంఘారామమంతా ధార్మికులు, కౌతూహలప్రియులు అయిన లిచ్ఛవీయులతో పూర్తిగ నిండిపోయింది. అప్పుడు తన శిష్యమండలితో దిగంబర పాటీక పుత్రుడు సంఘారామంలో ప్రవేశించాడు. అతడు రాగానే అతని అనుచరులు హర్షనాదం చేసి ఒకరి మాట మరొకరికి వినిపించనంతటి కోలాహలం చేశారు. అనుశాసన ప్రియులైన లిచ్ఛవీయుల వ్యవహారం ధార్మికోన్మాదంలో ఊగులాడసాగింది. రాజకీయ సభలలో ఐక్యంతో ఉన్నా, వారు ఈ రోజులలో పెంపొందుతున్న విభిన్న ధార్మిక సభలలో ప్రకటంగా భిన్నాభిప్రాయాన్ని ఇష్టడం చేస్తున్నారు. కొంత సేపయిన తర్వాత గగనభేది అయిన హర్షనాదం మళ్ళీ వినిపించింది. ఈ హర్షనాదంతో పాటు సభ అంతా ప్రవేశద్వారం వైపే చూసింది. బౌద్ధభిక్షువు వచ్చి ఉండవచ్చని అందరూ అనుకున్నారు. కాని ఆగంతుకుడు ప్రవేశ ద్వారం వరకు వచ్చాక ఎందరో విస్మితులై అటు చూడసాగారు. ఆగంతుకురాలు పాలి!

పాలి పాదాలు సంఘారామంలో పడగానే వాతావరణంలో విచిత్రమైన మార్పు కలిగింది. ప్రతిమూలా గుసగుస ఆరంభమైంది. ధర్మాంధుడైన వృద్ధుడొకడు నిల్చొని చెప్పసాగాడు— 'అమ్రపాలీ, ఇది రాజకీయ లిచ్ఛవీయ పరిషత్తు కాదు. యువకుల స్వచ్ఛంద సభ కూడాకాదు. ఇది ధర్మసభ.'

'అయితే ఏం?' అని పాలి ప్రశ్నసూచకంగా చూసింది.

'ధర్మసభలో నర్తకి అవసరంలేదు!' అని మరొక వృద్ధుడు గొణిగాడు.

'లిచ్ఛవీయుల సభలో స్త్రీలకు స్థానం లేదా? అట్టి హాస్యాస్పదమైన నియమం ఎప్పటి నుండి ప్రారంభమైంది?'

'ఇది ధర్మసభ. ధర్మసభలో స్త్రీలకు స్థానంలేదు.' అని [illegible] అసహాయపడే మాణవ లిచ్ఛవీయుడు. అతడు నేడు విశేషించి బౌద్ధ [illegible]వుల పరాజయం చూడవచ్చాడు.

'ధర్మం కేవలం పురుషుల కోసం కాదు.' తన సమాధానం ఇంకొకరి నోట వి[illegible] అదిరిపడి వెనక్కి చూసింది. సంఘ[illegible] ప్రవేశద్వారంలో అతేజస్వి [illegible] నిల్చున్నాడు. జనులంతా ఆశ్చ


పడి ఆ యువక బౌద్ధ భిక్షుకుని చూడ పోగారు. వయోవృద్ధుడైన పాటిక పుత్రునితో వాదం చేయడానికి కతడు పంపబడ్డాడు. యువక భిక్షుకుడు తన మండలితో అక్కడికి వచ్చి నిల్చి ఉన్నటు పాలివి గురించిన తగవులో ఎవనికీ తెలియలేదు.

ప్రతాపసింహా లిచ్ఛవీయుడు కూడా సభలో ఆసీనుడై ఉన్నాడు. అతడు తక్షణం లేచి అడగసాగాడు. 'మీ తథాగతుడో బుద్ధుడు స్త్రీలను ధర్మసభలోకి రానిస్తాడా?'

(సశేషం)

వైజ్ఞానిక గాథావళి - 81

- ద్వారి -



బోడ్ సూత్రము

శ్రీనాథుని వీధినాటకములని ఒక గుజిలీ బజారు పుస్తకము వచ్చింది. "అది శ్రీనాథుడిదీకాదు నాటకమూ కాదు" అన్నారు కొందరు విమర్శకులు. దీని నిజముమాట ఎలాగున్నా, 'బోడ్‌సూత్రము' అంటూ జ్యోతిశ్శాస్త్రవేత్తలు అనేది సూత్రమూ కాదు, అదిబోడ్ చెప్పినదీ కాదు. 1766లో విట్టెన్‌బర్గ్ నివాసి టిషియసు మొట్టమొదట కనుక్కొన్నాడు దానిని. అతడు సూర్యుడికీ—1766 నాటికి శాస్త్రజ్ఞులు ఎరిగిన— గ్రహాలకూ ఉన్న దూరాల్ని— బుధుడు దగ్గిర్నుంచి శనిదాకా— వరుసగా రాసుకున్నాడు. గ్రహాల దూరాల్ని మైళ్ళలో రాస్తే చాలాచాలా పొడుగు అంకెలు అవుతాయి, వాటిల్లో వాటికివున్న సంబంధాలు కంటికానవు. ఈదూరాల్ని సులువుగా జ్ఞాపకముంచుకోవడానికి వీలుగా, టిషియసు, పైనచెప్పిన దూరాల్ని భూమి కక్ష్యయొక్క పెద్దవ్యాసార్ధముతో భాగించాడు. అంటే గ్రహాలు సూర్యుడికి ఎన్ని భూకక్ష్యావ్యాసార్ధాల దూరాల్లోఉన్నాయో తెలుస్తుంది. అటువిటన్ని క్రిందిపట్టికలో నాలుగోకాలములో ఉన్నాయి.


గ్రహం	సంఖ్య	4 కలిపి 10తో భాగిస్తే వచ్చేది	గ్రహం దూరం
బుధ	0	0.4	0.4
శుక్ర	3	0.7	0.7
భూమి	6	1.0	1.0
అంగారక	12	1.6	1.5
సె	24	2.8	—
గురు	48	5.2	5.2
శని	96	10.2	9.5
యురేనస్	192	19.6	19.2
నెప్ట్యూన్	384	38.8	30.1
ప్లూటో	768	77.2	39.5

మొదటికాలములో గ్రహములపేర్లున్నాయి. రెండో కాలములో, గ్రహములకు టిషియసుఇచ్చిన సంఖ్యలున్నాయి. 0,3 అయిన తర్వాత ప్రతిసారూ రెంటితో గుణిస్తే, 6, 12, 24,48 ఇలా వరుసగా వస్తాయి. "ఇలాగ ఎందుకు గుణించాలి" అని అడగబోకండి. తరువాత కాలములో సంఖ్యల్ని రెండోకాలములోని సంఖ్యకు4కలిపి 10చేత భాగిస్తే వచ్చేసంఖ్యలు. ఇలాగ ఎందుకుకలిపి భాగించి చెయ్యాలి అనిఅడిగితే వైజ్ఞానికంగా ఏవీ జవాబులేదు, కాని. 'ఇలా చేస్తే భూమికెదురుగా, 1అన్నఅంకె వస్తుంది' అని ఒక జవాబూ, "ఇలా చేస్తే గ్రహాలకన్నిటికీ మూడూ నాలుగూ కాలములు ఒకే అంకెనిస్తాయి" అని రెండోజవాబూను!

0, 3, 6, ...అన్న అంకెలకూ నాలుగుకలిపి పదితో భాగించడానికి అర్థమున్నదేదీలేదు. కనుక ఈ ప్రక్రియలు చేసినతర్వాత మూడూ నాలుగు కాలములకు చేకూరే సమత్వము యదాలాభమే అనుకున్నారు. 1781లో యురేనసుకనుక్కొన్నప్పుడు టిషియసు సంఖ్య 19.6 అన్నది ఆ ఖగోళ దూరానికి చెందిన 19.2తో బాగానేసరిపోయింది. 1772నాటికి బెర్లిను వేధశాలాధ్యక్షుడు బోడ్, టిషియస్ సూత్రాన్ని బాగా ప్రచారముచెయ్యడముతో దానికి బోడ్‌సూత్రమన్నపేరు రూఢిఅయిపోయింది. సిసిలీ దేశపుజ్యోతిశ్శాస్త్రజ్ఞుడు పియాజీ 1801లో చిన్న గ్రహాన్ని కనుపెట్టి బోడ్‌కి రాశాడు. ఇదిగాని ఇందాకటి పట్టికలో ఐదోగ్రహమూ అని బోడ్ అనుమానించాడు. జర్మనీదేశపు ఫ్రీడ్రిచ్ గాస్‌దాన్ని కనుక్కొన్నాడూ, సిరిస్ అనిపేరు పెట్టారు. దానికి టిషియసు సంఖ్య 2.8 అయింది! అయితే ఎనిమిదింటికి సరిపోయిన ఈటిషియస్‌బోడ్‌సూత్రము, నెప్ట్యూన్, ప్లూటోలకు సరిపోలేదు! సిరిస్‌తోపాటు చిన్న గ్రహాలుపల్లాస్, జూనో, వెస్టా వంటివి మూడువందల్లు కనబడ్డాయి, ఇవన్నీచేరి, భూమివస్తువుతో వెయ్యోవంతుకేనా రావట.

సూత్రమన్నది నాలుగు కలిపిపదితో భాగించే ఇంద్రజాలమువల్లకాదు ఏర్పడవలసినది. భౌతిక గుణాల్ని పరిశీలిస్తే వాటి సామరస్యము బయటపడాలి, అసామంజస్యాన్ని సూత్రీకరించాలి. మాటకి, చిన్న గ్రహాలకాంతిమత్వము మారుతూన్నట్టు కనిపిస్తే అవి తమ చుట్టూ తాము తిరుగుతూన్నాయన్నారు. 1931లో ఈరోస్‌అన్న చిన్నగ్రహాన్ని టెలిస్కోపులో చూచి అది గుండ్రంగా కాక దోసపండులాగఉన్నదన్నారు. వీటిలోకొన్నిటికక్ష్యలు సుదీర్ఘ దీర్ఘవృత్తాలుటా, 1969లో జాగ్రఫోస్ అనేది భూమికి చేరువౌతుందటా, ఇకారస్ అన్నది సూర్యుడికి— బుధుడికంటేనూ— చేరువగా పోతూవుంటుందటా, దాని కక్ష్య బుధుడి కక్ష్యలాగా మెల్లిగా తిరుగుతుందట. ఈతీర్మానాలన్నిటికీ భౌతిక ఆధారాలు ఉన్నాయి.

టిషియస్— దీనికే బోడ్‌పేరు పెట్టారు— సూత్రానికి లేదు. రసాయనశాస్త్రములో మూలపదార్థాల్ని వర్గీకరించడానికి ఇనుమూ కోబాల్టూ నికెలూ, రాగి, వెండీ, బంగారమూ వంటివిచూచి మూడుమూడు చేరి ఒకగుంపు అయిందనడమూ, ఏడుమూలకాలుదాటి ఎనిమిదోది మళ్లీ మొదటిదానిని పోలితే స్వరములవలె మూలకాలు ఏడేసి అనడమూ కూడా టిషియసు సూత్రంకంటే మంచిసూత్రాలే. నాదృష్టికి గ్రహసంగీతము విన్నాడన్న పైథాగొరసు ఊహకవు విజ్ఞాని. అయితే టిషియసు సూత్రము గ్రహాలు సూర్యుడికి ఎంతదూరంలో వున్నాయో జ్ఞాపకముంచుకోడానికి మంచి సూత్రము. యదాలాభ గణితము లాభకారే అయింది! ●



నారాయణ చేసిన పరిష్కారం

న్యాయపతి గోపాలకృష్ణ



"పని గాబరాపడుతున్నారు · తొందర కూడదు, బాబు," అన్నాడు నారాయణ వంటింట్లో నుండి వస్తూ.

రంగు పెన్సిలుని కుర్చీ మీద వొదిలి, చేతులను పైకి చాపుతూ, అన్నాను "ఇంకొక్క ఐదు పేపర్లు దిద్దేస్తే...." వాక్యం పూర్తి చేసేలోగా పెద్ద ఆవలింత ముంచుకొని వచ్చింది

"ఇవ్వాల్టి కోటా పూర్తి అవుతుంది," అని ముగించేడు నారాయణ.

తొలిరోజు రాత్రి నేను ఒంటిగంట దాకా పడిగాపులు పడి అన్నరు పేపర్లు దిద్దుతూ వుండడం నారాయణ కనిపెట్టేడు. 'రోజుకి యిన్ని పేపర్లు దిద్దుతాము, అని మనస్సుతో తీర్మానించుకొని వుంటావని కూడా గ్రహించేశాడు. అదే నారాయణతో వున్న తమాషా.

"సినిమాకి వెళ్తానన్నావ్!

"అన్నాను, బాబు."

"మరి వెళ్లవూ?"

"మీరు వెళ్లమంటే వెళ్తాను, బాబు."

"వెళ్లు, వెళ్లు. టైం అయింది."

నారాయణ వంటింట్లోకి వెళ్లి రెండు జేబుల తెల్లచొక్కా ఒకటి వేసుకొని బయటికి వచ్చేడు.

ప్రొద్దుటి నుండి నన్ను వేధిస్తున్న ప్రశ్న గుర్తుకు రాగా అడిగేసేను, "నారాయణా, దెయ్యాలు ఉంటాయంటావా?"

"ఉంటాయి, బాబు."

"నిన్న రాత్రి ఏమయిందో తెలుసా? ఇక్కడే వాకిట్లో కూర్చొని పేపరు దిద్దుతున్నానా? ఎక్కడి నుండో రెండు పెంకుముక్కలు వచ్చి నాకు గజం దూరంలో పడ్డాయిపోయి. ఇదివరకు కూడ అలా చాలా సార్లు జరిగింది. మన ప్రక్కింటి వాళ్లను అడుగుదూ వాళ్ల యింట్లో కూడ పడుతున్నాయేమోనని."

"అడిగేను, బాబు," అన్నాడు నారాయణ సవినయంగా "ఈ ఎక్కడి నుండో పెంకు ముక్కలు వచ్చిపడడం అన్నది రోజూ జరుగుతోంది, మరి అడక్కు," అన్నాడండి వాళ్ల అబ్బాయి."

"మన యింట్లో దెయ్యం ఒకటి తిరుగుతున్నాదన్నమాట."

"అలా అనడానికి ఆధారం లేదు బాబు. ఒక్కొక్క విషయం అలా ఎందుకు జరుగుతుంది అని అడిగితే సమాధానం చెప్పలేం."

నాకు ధైర్యం చెప్పడానికి నారాయణ

ఇక్కా పోటు తన్నాడని అనుకున్నాను. నేను రాకముందు ఆ యింట్లో వున్న కుటుంబీ కుడు అకస్మాత్తుగా గుటుక్కుమన్నాడు. అతను పోవడం వల్లనే ఆ కుటుంబం యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయేరు కూడ. అతనే దెయ్యమయి తిరుగుతూ వుండవచ్చని వా దృఢనమ్మకం.

"శికాణా అన్నావు. ఒరియా మాట కదూ?"

"అవును, బాబు. శికాణా అంటే...నమ్మ కం." నారాయణ వెళ్ళిపోయేడు.

ఒకగంటలో మూడు పేపర్లు దిద్దేసేను. అసలు, పేపర్లు యూనివర్సిటీకి చేరవలసిన గడువు తేది పదిరోజుల క్రితం దాటి పోయింది. నేను అంతవరకు వాటిని ముట్టు కోకపోవడం అన్నది కేవలం బ. వల్లనే. ఆ విషయంలో బలరామారావు మేష్టారు అభినందనీయుడు. గంపెడు సంసారం, బాధ్య తలూ వున్నా, గ. తే.కి పదిరోజుల ముందే పేపర్లు దిద్దేసి యూనివర్సిటీకి పంపిం చేసేడు.

వీధి తలుపు చప్పుడయింది. ఈ అర్ధ రాత్రి వేళ ఎవరు వస్తారా అని ఆలోచించు కుంటూ వెళ్ళి తలుపు తీసేను. టెలిగ్రాఫ్ బంట్రోతు.

టెలిగ్రాంను చదివేను. గబగబా లోనికి వచ్చి కుర్చీలో కూలబడ్డాను. టెలిగ్రాంలో వ్రాసి వున్న విషయం యిది:

'కాకినాడ

కుటుంబం రేపటి మెయిల్‌తో వస్తు న్నారు రంగనాథ్.'

* * *

సాధారణంగా అతిథులు యింటికి వస్తు న్నారంటే కుర్చీల్లో కూలబడే మనిషిని కాను. నేను ఒంటరిగాణ్ణి కావడం వల్లనూ, నా యిల్లూ, హృదయం విశాలమైనవి కావడం వల్లనూ, ఎవరో ఒకళ్ళు బంధు త్వం కలుపుకుంటూ ఆత్మీయత ఒలకపోసు కుంటూ రావడం, కొన్ని వక్షాల పాటు వుండిపోవడం నాకు పరిపాటే.

రంగనాథ్ మా స్వంత మేనమామ. నేను యింటర్మీడియట్ వాళ్ళింట్లోనే వుండి చదువుకోవడం, నాకు అవసరం వున్నప్పుడు అతను ఐదూ, పదీ ముట్టచెప్పి వుండడం వల్ల, అతనికి నేను జీవితంలో ఎంతో ఋణ పడి వున్నాను. అదీ కాకుండా, నేను ప్రస్తు తం వుంటున్న యింటికి యజమాని రంగ నాథే. ఇల్లు (అద్దెకి)యిచ్చినప్పుడు పెట్టిన షరతుల్లో యిదొకటి: 'మేం ఐరంపురం ఎప్పుడు వచ్చినా యీ యింట్లోనే దిగు తాం.' వాళ్ళకు ఏఏ గదులు కేటాయించాలో కూడ ముందుగానే నిర్ణయింపబడింది. కాబట్టి రంగనాథ్‌గారి కుటుంబం వస్తున్నా రంటే నేను చలికిలపడడానికి పెద్ద కారణం వుండి వుండాలి...

ప్రతీ మానవుడికీ ఏదో ఒక లోపం వుండనే వుంటుంది. ఎవరో ఎత్తిపొడిచి చెప్పేదాకా తన బలహీనత గురించి అతనికి తెలియకపోవచ్చు. అప్పుడు ఆ లోపాల్ని సరి దిద్దుకోగలిగితే సరిదిద్దుకొని లేకుంటే తాత్కాలికంగా బాధపడి, రెండవ రోజు పూర్తిగా విస్మరిస్తాడు. కాని అతనిలో లేని లోపాలను అంటకడుతూ పరిహాసం చేసే వాళ్ళు తటస్థపడితే?

అటువంటి వాళ్ళ కోవకి చెందిన వ్యక్తి రంగనాథ్ గారి మూడవ కూతురు వనజ. ఆమె పేరు తలుచుకొనే సరికి నాకు ఏవో అడవులూ, క్రూరమృగాలూ గుర్తుకు వస్తాయి. ఆమె దేవత రూపంలో కనిపించే ఒక రాక్షసి. ఆమెగారి ఆటపాటలకు ఎవ్వరూ అతీతులు కారు.

నేను మామయ్య యింట్లో పది పన్నెం డేళ్ళ క్రితం ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులలో ఆమె ఏడు—తొమ్మిది సంవత్స రాల పిల్ల. అందరి ఆడపిల్లల్లా క్రమేణా పెరుగుతూ, అందరినీ ఒక్కసారికి సొమ్మ సంలో ముంచేసింది.

క్రిందటి వేసవిలో ఆమె నా మీద పన్నిన కుట్రలు జన్మలో మరచిపోలేను. హైదరాబాదులో మా అన్నయ్య పెళ్ళికి వివిధ ప్రాంతాల నుండి స్నేహితులు, బంధు వులు వచ్చేరు. వనజారాణి కూడ వాళ్ళ అమ్మతో సహా వచ్చింది. ఆడపెళ్ళివారు మగపెళ్ళివారితో హాస్యాలు ఆడడం అన్నది సాంప్రదాయకంగా ఒకరోజు అయితే, వనజా దేవి గారికి నాతో హాస్యాలు ఆడడం ఒకదిన చర్య.

ఒకసారి. అందరూ భోజనాలకి కూర్చో బోతూ వుంటే వనజ ఎక్కడి నుండో కేక వేసింది: "గోపాలా, నీ స్థలం యిక్కడ వుంది" అని ఆడవాళ్ళంతా కూర్చున్న వరుసని చూపించింది! నేను పేలవంగా నవ్వేసి ఊరుకున్నాను.

ఇంకొకసారి. భుక్తాయాసం తీర్చు కుంటూ కూర్చున్నారు అంతా. ఈమెగారు బహిరంగంగా ఒక ప్రకటన చేసింది. నేను చాలా బాగా పాడుతానని. పాటకీ నాకూ ఎంత దూరమో ఆ భగవంతుడికి తెలుసు. అక్కడ కూర్చున్న వాళ్ళకు తెలియకుండా ఒకటే బలవంతం చేసేరు! మరి తప్పక అక్కడి నుండి బయటికి వచ్చేసేను.

మూడవసారి. ఒకగుంపు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వనజ మాట్లా డుతోంది: "కొందరికి కొన్ని అక్షరాలు పలుకవు. ఉదాహరణకి గోపాల్‌కి ష అని పలుకదు."

నాకు ఒళ్ళు మండిపోయింది. నాకు ఏ అక్షరం పలుకకపోవడం అంటూలేదు. అటువంటిది యీమెగారు ఒక అద్భుతమైన అబద్ధం కల్పించి ఎంత ధైర్యంగా చెబు తోంది!

"ష కి బదులు ఏమంటాడేం?" అని ప్రశ్నించింది ఒక అమ్మాయి.

"వ అంటాడు. అది కూడ ఒక తమాషా అయిన యాసతో అంటాడు," అంది వనజ.

అంతటితో చిన్నా, పెద్దా అంతా కలిసి నా మీద పడ్డారు. ష అనమని. రోషంతో అనేసేను 'ష్వ'. అందరూ గొల్లు మని నవ్వేరు.

వనజ చెప్పుకుపోతుంది— నేను కిళ్ళీలు ఎక్కువగా నములుతానని అందునుండి కొన్ని శబ్దాలు పలుకవని.

నాలుగవసారి. ఒక అమ్మాయిల గుంపు కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వనజ అందులో వుంది. నేను సీరియస్‌గా ఏదో పని మీద వెళ్ళిపోతూ వుంటే నాకు వినబడే టట్టుగా వనజ అంటోంది: "నేను పెళ్ళి అన్నది చేసుకుంటే, గోపాల్ లాంటి వాళ్ళతో మాత్రం చేసుకోను."

నేను ఆగిపోయి నవ్వుతూ అన్నాను: "అసలు నిన్ను చేసుకోవడానికి సిద్ధంగా ఎవరున్నారు యిక్కడ?" నాకు ఆ అవకాశం కలిగినందుకు రెండురోజుల వరకు చాలా సంతోషించేను. ఆ సంతోషంలో ఆమె నన్ను పరిహాసం చేస్తున్నా పట్టించుకోలేదు..

అటువంటి వనజారాణి రేపు ప్రొద్దుటే రాబోతోంది! నా పేపర్లు దిద్దడమన్నది పెద్ద సున్నా!

ఒకటే ఆశ... ఆమె రాకపోయినా రాక పోవచ్చు.

* * *

పదకొండు గంటలయింది. స్నానం చేసి బయటికి వచ్చేసరికి వీధిలో రెండు రిక్షాలు ఆగి వుండడం గమనించేను. వచ్చిన వాళ్ళకి

స్వాగతం చెప్పడానికి మీ అయినా మోహిని కొన్నను.

అత్తయ్య, పదిహేడేళ్ల కొడుకు బాబు మాత్రం వున్నారు. వనజ రాలేదు! ఆ పరమ సంతోషంతో అత్తయ్యని అడిగేను: "ఏం, అత్తయ్యా, బాగున్నావా?"

"ఆ" అని జవాబు చెప్పింది అత్తయ్య కొండాగా నవ్వుతూ.

"నిన్న అర్ధరాత్రి అందింది మీ టెలి గ్రాం. అప్పటికప్పుడు రెండుగదులు మీ కోసం ఖాళీ చేసి, శుభ్రపరిచేను," అన్నాను ఒక గదిలోకి ప్రవేశిస్తూ.

నేను విశ్వేష్మడయ్యేను వనజ ఎదు రుగా నిలబడి వుంది!

"ఏం, నేను రాకపోతే బాగుండునని అను కున్నావా?" అంది వనజ నవ్వుతూ. వనజలో అంతటి పొగరుపోతుతనానికి కారణం ఆమె అందమేనని నాకు ప్రస్ఫుటమయింది.

"బాగుంది, నువ్వు వస్తే నాకేం?" అన్నాను.

"మీ వంటవాడు వున్నాడు కదూ" అని అడిగింది అత్తయ్య, లోనికి వస్తూ.

"ఉన్నాడు. కాఫీ త్రాగుతారా, లేక ఏకంగా భోజనం చేసేస్తారా?" అని అడి గేను. (ఈ ప్రశ్నకు బాగా అవార్థాలు తీసింది వనజ.)

భోజనాలయ్యేయి. నాకు నిద్ర ముంచుకొని రాగా పడుకున్నాను.. కళ్ళు తెరిచేసరికి, బాబు రేడియోని వేస్తు న్నాడు. అదే తన స్వంత రేడియో అయితే వాడు ఆ విధంగా చస్తే తిప్పడు. ముల్లు లావు అంగుళం కదిలేసరికి ఒక విమానం తల మీద నుండి వెళ్ళిపోతున్నట్టు శబ్దం వస్తోంది.

"వాల్యూం కొంచెం తగ్గించరా" అన్నాను. నా మాటలు వాడికి వినబడలేదు. నేను లేచి వెళ్ళి వాల్యూంని పూర్తిగా తగ్గించేసి, "సిలోన్ కోసమా?" అన్నాను.

కొంచెం ఆలోచించి, "ఆ" అన్నాడు బాబు.

"ఈ సెట్‌లో అంత బాగా రాదు."

"కాకినాడలో మా సెట్‌లో బాగా వస్తుంది."

"ఇది బరంపురం ఆయె మరి," అన్నాను, యిప్పటిదాకా మాటలలో పైచెయ్యి నాదే నని సంతోషపడుతూ, కాని ఆ సంతోషం కాస్త జారిపోయింది.

"ఎందుకురా అనవసరంగా యింకొకళ్ళ

నారాయణ చేసిన పరిష్కారం

రేడియో తిప్పుతావు?" అంటూ వనజ వచ్చింది రంగంలోకి.

"ఏదో బాగా వచ్చే స్టేషనులో తగు వాల్యూంలో వుంచితే ఏ బాధాలేదు."

"మరి ఏ స్టేషనూ రాకపోతే?"

"రేడియోని కట్టేయాలి."

"మరి దానికి లైసెన్సు కట్టడం దండుగ అన్నమాట."

"ఏదో ఒక స్టేషను రాకుండా పోదు."

వనజ విరగబడి నవ్వింది. "నాకేదో సామెత జ్ఞాపకం వస్తోంది. ఏమిటది—? ఏదో 'రుచి' అని వస్తుంది మధ్య" అని తమ్ముణ్ణి అడిగింది.

"అటుకుల రుచా?" అన్నాడు బాబు.

"ఆ. జ్ఞాపకం వచ్చింది. ఎద్దుకేం తెలుసురా అటుకుల రుచి?—అదీ సామెత."

"అంటే నేనొక ఎద్దునని మీ ఉద్దే శమా?"

"అబ్బే, అదికాదు. ఎద్దుకి అటుకుల రుచి తెలియనట్టే, నీకు తెలుగు పాటలలోని మజా తెలియదు," అంది వనజ నవ్వుతూ.

"అబ్బ, ఏమిటే ఎప్పుడూ ఆ విరగబడి నవ్వు!" అంటూ అత్తయ్య వచ్చింది. వనజ, బాబు వెళ్ళిపోయేరు. అత్తయ్య తెలుగు క్యాలండరు నా దగ్గర వున్నది పుచ్చుకొని వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనానంతరం నేను యథా ప్రకారం పేపర్లు దిద్దే నిమిత్తం వాకిలిలో కూర్చొని వున్నాను. పనిలో వున్నానని గుర్తించిన అత్తయ్య నా కాలాన్ని అట్టే వృథా పరచకూడదనీ నిశ్చయాన్ని ముఖంలో కనబరుస్తూ, వచ్చి ఎదురుగా కూర్చుంది.

"మీ కాలేజీలో బలరామారావు మేష్టా రని ఒకతను ఉన్నాడట. నీకు పరిచయం వుందా?"

"లేకేం, అతను తరుచు యిక్కడికి వస్తూ వుంటాడు. కూడ."

"మనిషి ఎటువంటి వాడు?"

"లావుపాటి శరీరం. ఎప్పుడూ మిల్లు ధోతి, కమీజ వేసుకుంటాడు. కళ్ళద్దాలలో నుండి ప్రతీ వ్యక్తినీ, విషయాన్నీ తీక్షణంగా చూస్తాడు. ఆ చూపు, అతని మీసం అవ తలి వాళ్ళకు కొంచెం భయం కలిగిస్తాయి. కాని మొత్తంమీద మనిషి మంచివాడే."

"ఒక విషయం చెప్తాను. ఊళ్ళో ఎవరి తోనూ అనకు. వనజ పెళ్ళి యీ ఏడాదిలో చేసేద్దామని అనుకుంటున్నాము. పెళ్ళి చూపులకనే వచ్చేం.

"కాని బలరామారావు మాష్టారికి కనీసం ఏభయి ఏళ్ళయినా వుంటాయి."

"అబ్బ, నువ్వొకడివి" అని గసిరింది అత్తయ్య. "అతని అబ్బాయి పెళ్ళికి ఉన్నాడట" అని కాస్సేపు ఆగి అంది: "అబ్బాయి మంచివాడేనని విన్నాం. రైల్వే ఉద్యోగం. నాలుగు వందలు దాకా వస్తా యట."

పెళ్ళిచూపులకి సాధారణంగా అబ్బాయి అమ్మాయి యింటికి వెళ్తాడన్న విషయం నాకు స్ఫురించింది. వనజ విషయంలో ఆ సాంప్రదాయం తారుమారు అయివుంటు వచ్చని తిరిగి సరిపెట్టుకున్నాను.

"మామూలుగా ఆ అబ్బాయి కాకినాడ రావలసి వుంటేను" అత్తయ్య అంది. "కాని యిప్పట్లో సెలవు దొరకదట. ఈ ఊరు అయితే సులభంగా రాగలడని అన్నారు.. సంబంధం ముందర నిశ్చయం అయిపోతే" ఆఖరి మాటలు అంటున్నప్పుడు అత్తయ్య ముఖంలో ఆడవాళ్ళకు స్వభావ సిద్ధమైన చింత కనిపించింది.

"మామయ్య వస్తాడా?"

"మూడు వంతులు వస్తారు" అని ఆ సంశయాత్మక విషయాన్ని చర్చించడానికి అయిష్టం కనబరిచింది అత్తయ్య. ఒక నిమిషం అలా ఏదో ఆలోచిస్తూ కూర్చొని గదిలోకి వెళ్ళిపోయింది ఆమె.


నేను, నా పేపర్లు మిగిలేం. ఒక్కొక్క పేపరు నుండి ఒక్కొక్క విద్యార్థి తన మన స్తత్వాన్ని కనబరుస్తున్నాడు. అలా ఎనిమిది గురు విద్యార్థులు నా కళ్ళలో మెరిగి అంత ర్ధానమయ్యేరు.

నాకు అరగజం దూరంలో మూడు పెంకు ముక్కలు పడి, త్రుళ్ళి, దగ్గరగా వున్న బాల్చీకి తగిలి, పెద్ద చప్పుడు చేసేయి. ఆ చప్పుడు కయినా యింట్లో వాళ్ళు లేస్తే బాగుండునని అనుకున్నాను. ఉన్న యీ ఒకటి, రెండు రోజులు వాళ్ళు లేచి చూస్తే మాత్రం ఏంలాభం అనిపించింది మరుక్షణానికి.

మళ్ళీ పేపర్లలో మునిగేను. ఒంటి గంట దాకా పనిచేసి, కోటా పూర్తి చేసి పడుకున్నాను.

* * *

ఉదయం నేను లేచేసరికి, ఆ రోజటి



మీరు మృదువుగా వేపొరబ్ రాస్తే అది వెంటనే వెచ్చదనా న్నిచ్చి హాయిని గొలుపుతుంది... మీ పిల్లవాడు సులభంగా శ్వాసను పీల్చుకొని రాత్రంతా హాయిగా నిద్రపోతాడు.

బాధ నివారణకు మీ పిల్లవాడు మీ మీద ఆధారపడతాడు. అతడు రొంపతో బాధపడుతున్నప్పుడు విక్స్ వేపొరబ్ రాయండి. ఛాతీ గొంతుక, వీపు మరియు ముక్కుచుట్టుప్రక్కల మీ ప్రేమపూర్వక చేతులతో విక్స్ వేపొరబ్ మర్దన చేస్తే, మీ కళ్ల ముందే ముక్కు దిబ్బడ పోవడం ప్రారంభమవుతుంది. అతడు తిరిగి సులభంగా శ్వాసను పీలుస్తాడు. ఎందుకంటే ఔషధ ఆవిరులు ఏడు సెకండ్లలోనే జలుబు భారమున్న చోట్లకి చేరతాయి. అప్పుడు పిల్లవానిని చక్కగా పరుపు మీద పడుకోబెట్టండి.

అతడు బాగా నిద్రపోతూంటే వేపొరబ్ రాత్రంతా పని చేస్తూంటుంది. తెల్లవారే టప్పటికి జలుబు భారమంతా పోతుంది. అతడు లేచేటప్పటికి హాయిగా, ఆరోగ్యంగా వుంటాడు.... ఆటలతో మురిపించే మీ ముద్దు బిడ్డ.



విక్స్ వేపొరబ్ జలుబులకు ఈ రాత్రే రాయండి

పత్రిక మీద డిజైన్లు చెక్కుతున్నాడు బాబు. వాడి ప్రక్కనే వనజ కూర్చొని వుంది.

"ఒరేయి, ఒరేయి. ఆ పేపరు ప్రక్కింటి వాళ్ళదిరా" అని అరిచేను.

వనజ ముక్కు మీద వేలు వేసుకుంది. "తమరు ప్రక్కయింటి వాళ్ళ పేపర్లు చదువుతూ వుంటారన్నమాట" అని ఎగతాళిగా అంది.

"ఆ. తప్పేం?" నిజానికి నేను ఏ పేపరు తెప్పించనవసరం లేకుండా కాలేజీ లైబ్రరీకి సమస్తమైన పత్రికలూ వస్తాయి. సెలవు రోజులు కావడం వల్ల యిప్పుడు యింట్లో అవసరం వచ్చింది. ప్రక్కింటి అతను తనంతట తనే అన్నాడు: "మళ్ళీ మీరు కూడా పేపరు తెప్పించడం ఎందుకండీ? ఉదయం తొమ్మిది గంటలకి రోజూ మా నౌఖరీ వాడిచేత పంపిస్తాను. చదివేసి సాయంకాలం లోగా మళ్ళీ యిచ్చేయండి."

సలహా ఉత్తమమయిన దవడం వల్ల, నేను 'సరే' అన్నాను. ప్రత్యుపకారంగా వాళ్ళ కొళాయిలో నీళ్ళు రానిరోజున నారాయణ చేత నూతిలో నుండి నీళ్ళు తోడించి, వాళ్ళకు పంపిస్తూ వుంటాను. ఈ మా యిరుగుపొరుగుల పొత్తు వనజకేం తెలుసు?

"తప్పని ఎవరన్నారు? కాని స్వల్ప విషయాలకి యితరుల మీద ఆధారపడవలసిందా అని."

వ్యవహారం యథాప్రకారం ఎక్కడి నుంచో బయలుదేరి నాకు వ్యతిరేకంగా వచ్చింది.

"పోనీ, అది నా న్యూస్‌పేపరే అనుకో. అలా గీతలు పెట్టవచ్చునా?"

"పెన్ను సరిగ్గా వుందో లేదో చూసేను. అంతే" అన్నాడు బాబు, పత్రికను మేజా మీద పడేస్తూ.

వాడి చేతిలో నా పెన్ను గిలగిలా తన్నుకుంటోంది. ఆ దృశ్యం చూడలేక పెరట్లోకి వెళ్ళిపోయేను.

నేను తిరిగివచ్చేసరికి, వనజ, బాబు ప్రశాంతంగా కూర్చోవడం చూసి కొద్దిగా మురిసాను. ఎదురుగా కూర్చున్నాను. పేపరు తిరగవేస్తూ. వాళ్ళ రియేక్షన్ చూద్దామని అన్నాను "ఈ యింట్లో ఒక దెయ్యం తిరుగుతోందని నా గట్టి నమ్మకం."

బాబు నోరుపూర్తిగా విప్పేసి నావైపు చూడసాగేడు. వనజ నన్ను పరీక్షగా చూస్తూ "ఎందువల్ల?" అని అడిగింది.

నారాయణచేసిన పరిష్కారం

"రాత్రి పూటలు ఒక్కొక్కసారి పెంకు ముక్కలు ఎక్కడి నుంచో వచ్చి మీద పడుతూ వుంటాయి."

"నీ మీద పడ్డాయా?"

"ఆ. ఇదిగో కావలిస్తే చూడు. నిన్న రాత్రి ఒంటిగంటకి పడిన పెంకు ముక్కలను భద్రంగా దాచేను," అని వాకిలిలో ఒక స్తంభం దగ్గర పెట్టిన వాటిని చూపించేను.

వనజ పూర్తిగా నమ్మేసింది. "బాబోయి, దెయ్యమే," అంది.

"మన ప్రక్కింట్లో కూడ యిలా రోజూ పడుతూవుంటాయని అతను చెప్పేడు."

వనజ పరుగెత్తుకొని వెళ్ళి వాళ్ళ అమ్మతో చెప్పింది. అత్తయ్య కూడ వచ్చింది, "వూరుకోవే, నీపిచ్చి. వాడేదో తమాషాకి అంటూవుంటే," అని అనుకుంటూ.

"తమాషా కాదు, అత్తయ్యా. నిజంగానే," అన్నాను సీరియస్‌గా. "కావలిస్తే నారాయణని అడుగు."

నారాయణని వెంటనే పిలిచి అడిగేసేవారే — అతను ఆవేళకి వుండివుంటే. కాని వాళ్ళ అన్నయ్యకి ఒంట్లో బాగులేదని ఆ రోజు ప్రొద్దుటే వండేసి వెళ్ళిపోయేడు.

అత్తయ్య ఏమీ మాట్లాడలేదు.

విషయం మార్చుదామని, "బాబు యీ సెప్టెంబరు పరీక్షకి కడతాడా?" అన్నాను.

"ఏమో వాడి చదువు విషయం ఒక పెద్ద బెంగ అయిపోయింది. పోనీ, యిక్కడ వున్న నాలుగు రోజులు వాడికి లెక్కలైనా, అవీ చెబుదూ," అంది అత్తయ్య.

"వాడికి శ్రద్ధవుంటే నాకే అభ్యంతరమూ లేదు."

"శ్రద్ధ లేకేం," అన్నాడు బాబు కొద్దిగా నత్తితో. "లెక్కలలెన్నే కష్టమవుతోంది."

"వూరికే కాలం వృథా చేయక, గోపాల్ దగ్గర రానివేవో నేర్చుకో" అని గట్టిగా అనేసి అత్తయ్య లోనికి వెళ్ళిపోయింది.

విషయం మార్చడం వల్ల అట్టే ప్రయోజనం లేకపోయింది. వనజ అంతసేపూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ నేవుంది. బాబు కూడ ఆలోచనలో పడ్డాడు.

ఇద్దరూ రోజంతా అలికిడి లేకుండా కూర్చున్నారు. నేను నిరాటంకంగా పేపర్లు దిద్దుకున్నాను.

చీకటి పడుతున్నకొద్దీ వాళ్ళ ముఖాల్లో భయాందోళనలు ఎక్కువ కాసాగేయి. బాబు ఆంజనేయ దండకం జ్ఞాపకం ఉన్నంత వరకూ పదేపదే వల్లించుకుంటున్నట్టు కనబడ్డాడు.

బజారులో చిన్న పని చూసుకొని, ఒక అరగంటలో యింటికి తిరిగి వచ్చి, నా రేడియో గదిలోకి వెళ్ళేను.

వనజ వచ్చి గుమ్మం దగ్గర నిలుచుంది ఆమెను చూసి నేను ఆశ్చర్యపోయేను— మునుపటి భయాందోళనలు ఆమెలో యిప్పుడు కొంచెమయినా లేవు.

"గోపాల్, ఒక ముఖ్య విషయం చెప్పాలి నీతో."

"ఏమిటది?"

"మరేంలేదు. ఆ పెంకులు పడడం అన్నది దెయ్యాల పనికాదు. మనుష్యుల పనే."

"అంటే?"

"చెప్తా విను. ఆ మనిషి యింకెవరో కాదు— ప్రక్కింటి అతడే."

"అతనా? పెంకులు విసిరితే అతనికేమి వచ్చింది?"

"నిజానికి అతను విసరడం లేదు. కొడుకు చేత విసిరిస్తున్నాడు."

"ఎందువల్ల అని?"

"దానికి కారణాలు చాలా వున్నాయి. వాళ్ళ కొళాయిలో నీళ్ళు రానప్పుడు మన యింటి బావిలో నుండి నీళ్ళు తీసుకుంటామంటే నువ్వు పనికిరాదన్నావట. అది మొదటి కోపం."

"అది చాలా పాత సంగతి. ఈ రెండు నెలలలో ఎప్పుడూ ఒద్దనలేదే."

"ఆ పాత సంగతి మీదే అతనికి యింకా కోపం వుంది. పైపైకిమాత్రం నీతో స్నేహంగా మాట్లాడుతూ వుండవచ్చు. రెండవ కారణం అతని కొడుకు మార్కుల విషయమై మీ తోటి లెక్చరరుతో ఒక మాట మాత్రం పారేయమంటే నువ్వు పారేయలేదట."

"అటువంటి పనులంటే నాకు అసహ్యం."

"అందుకే నువ్వంటే వాళ్ళకు ఒక రకమైన అసహ్యం. మూడవ కారణం — వాళ్ళ అమ్మాయి...."—

"వాళ్ళ అమ్మాయి?"

"వాళ్ళ అమ్మాయి వీధిలో నడుస్తూ వుంటే తదేకంగా చూస్తూ వుంటావట. ఒకసారి కేకలు కూడ వేసేవట."—

"కేక వేసిన సంగతి నాకు తెలియదు గాని, ప్రతి అమ్మాయిని చూస్తూ వుంటాను"

"ఇవి మూడు కారణాలు. ఇవేవీ లేక పోయినా, మామూలుగా ఒక పెద్ద సంసారం చిన్న యింట్లో వుంటూ, ఆ ప్రక్కనే ఒక బ్రహ్మచారి పెద్ద యింట్లో వున్నా డంటే, వాళ్ళకి ఈర్ష్య కలుగకమానదు," అని దృఢంగా చెప్పింది వనజ.

ఈ కారణాలు చెప్తున్నప్పుడు ఆమె ఎంతో అందంగా కనిపించింది.

"ఈ పొట్టి ఆయనకు పుట్టెడు బుద్ధులున్నాయన్నమాట" - అన్నాను కర్ర్యంతంగా.

"గట్టిగా అనకు. వాళ్ళకు వినబడినా వినబడవచ్చు."

"ఇంతకీ యివన్నీ నీకెలా తెలిసాయి?"

"చాలా గమ్మత్తు చేసేనులే. మధ్య తలుపు లేదూ— ఒకసారి ఏమీ ఎరగనట్టు తీసేను. వాళ్ళ అబ్బాయి కూర్చొని వున్నాడు. వాళ్ళ అక్కయ్య ఉందా అని అడిగేను. లేదన్నాడు. మెల్లగా మాటలలో పెట్టి, నీ మీద ఉన్నవీ లేనివీ చాడీలు చెప్పేను. నాతో పూర్తిగా ఏకీభవిస్తూ అతను ఈ విషయాలన్నీ చెప్పేసేడు. అయినా పూర్తిగా కసి తీరడం లేదనీ, మంచి అవకాశం కోసం చూస్తున్నామని చెప్పేడు."

"వాళ్ళ మీద నీకు అనుమానం ఎలా వచ్చింది?"

"నువ్వు చెప్పిన మాటబట్టి, ఎక్కడి నుండో ఈ పెంకు ముక్కలు వచ్చి పడడం రోజూ జరుగుతున్నదే. మరి అడక్కు అని వాళ్ళ అబ్బాయి అన్నాడని చెప్పేవా? వాళ్ళింట్లో పెంకులు పడడం అన్నది నిజమయితే, అలా ఎవరైనా అంటారా? 'అవును, ఇక్కడ కూడ పడుతున్నాయి. ఆశ్చర్యంగా వుంది' అంటారు."

వనజని చాలా మెచ్చుకున్నాను. "ఇప్పుడు ఏం చేస్తే మంచిదంటావ్?"

"అదే ఆలోచించి చెప్తాను," అని అనేసి ఏదో సినిమా పాట పాడుకుంటూ వెళ్ళి పోయింది వనజ.

'జూహారు బు' అని అనుకుంటూ

నారాయణ చేసిన పరిష్కారం

మంచం మీద వ్రాలేను.

వనజ నిమిషంలో తిరిగి వచ్చి, "జాగ్రత్తగా విను," అని చెప్పనారంభించింది. "ఒకానొక పట్నాయక్‌కి పొరుగింటి పాఢి మీద ఏదో కక్ష వుండేదట. అప్పుడు పాములూ, తేళ్ళూ తీసుకొని వచ్చి పాఢి యింట్లో వదిలి పెట్టేవాడట. ఆ బాధ భరించలేక పాఢి రెండవ రోజునే యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయేడట. పట్నాయక్‌లా నువ్వు మాత్రం చేయలేవా?"

"ఎందుకు చేయలేను, వీళ్లను అల్లరి చేయాలంటే ఎంత సేపు?"

"రైట్. ఈ ఆలోచన నాది కాదు సుమా. అమ్మ చెప్పింది."

నేను ఆశ్చర్యపోయేను. తిన్నగా వెళ్ళి అత్తయ్యని "అవునా?" అని అడిగేను. "ఆ" అంది అత్తయ్య సీరియస్‌గా. "వాళ్ళు నీ మీద అంత పగ బూనినపుడు, ఆత్మరక్షణ కోసం నువ్వేం చేసినా తప్పు లేదు."

ఇక కార్యాన్ని అమలు పరచడమే తరువాయి. కాని ఎలా? నారాయణ రాత్రి లోగా వచ్చేస్తే బాగుండును. అతనికి తెలియని విషయం, కానిపని అంటూలేదు. ముఖ్యంగా నా కోసం ఏం చేయమన్నా చేస్తాడు. కాబట్టి నారాయణ రావడమే తరువాయి.

ఆశించిన విధంగా నారాయణ వచ్చేడు.

"నారాయణా, నీ వంటపని యీ పూటకి తప్పి పోయింది కాని, యింకొక అర్జంటు పని తగిలిందోయి."

"ఏమిటి, బాబూ?"

ఆరోజు వనజ ప్రక్కింటి వాళ్ళ నుండి తీసిన కూపీ విశదంగా చెప్పి, "పాములూ, తేళ్ళూ తీసుకొని వచ్చే పూచీ నీది," అని ముగించేను.

నారాయణ ముఖం చిట్లించుకున్నాడు.

"ఏంవోయి, నీకీ ఆలోచన నచ్చలేదా?"

"ఈ ఆలోచన పనిచేయదు, బాబు."

"తొల్లి పట్నాయక్ — పాఢి విషయంలో పని చేసింది."

"అవ్వచ్చు. కాని మన విషయంలో పని చేస్తుందని నమ్మకమేమిటి? ఎక్కడో ఒక చోట పప్పులో కాలు వేయడం అవుతుంది."

నారాయణ యొక్క విముఖత నాకు చాలా బాధ కలిగించింది. "మరేం చెయ్యడమో చెప్పు పోనీ," అన్నాను.

"నిజమైన దెయ్యాలు కొనండుకు సంతోషించండి."

మరి లాభం లేదనుకొని ప్రసంగాన్ని అక్కడితో వదిలేసేను.

ఆ రోజు రాత్రి నేను, వనజ, బాబు డాబా ఎక్కి నక్కి నక్కి చూస్తున్నాం. మా డాబా చివరి నుండి ప్రక్క యిల్లంతా చక్కగా కనిపిస్తుంది. ఏదైనా అలజడి అవుతుందేమోనని చూస్తున్నాం. ఒంటి గంట దాటిపోయింది.

"ఆ శుంఠకి యివ్వాళ చక్కగా నిద్ర పట్టిపోయి వుంటుంది," అన్నాను.

మెల్లగా మాట్లాడమని సంజ్ఞ చేసింది వనజ.

"నాకేమిటి భయం?" అన్నాను.

పెద్ద చప్పుడయింది. ఏమిటా అని చూసే సరికి, బాబు పెద్ద పెంకు ముక్కలను చేతితో పట్టుకొని వున్నాడు. ఒకసారి నా వైపు చూసి నవ్వేసి, టపీ టపీమని నాలుగు ముక్కలను విసిరేసేడు.

సంతోషం, భయం మాత్రతీ ఒక్కరిలో యుద్ధం చేస్తూవుండగా, గబగబా క్రిందికి వచ్చేసి, ఎవరి పక్కల మీద వాళ్ళం పడుకున్నాం.

*

ఆ రోజు మంగళవారం. సాయంకాలం ఆరు గంటలకి అబ్బాయి వస్తాడు అమ్మాయిని చూడడానికి.

నరాయయ్య రాలేకపోయేడే అని దిగులు పడుతున్నా, ఆ పరిస్థితికి మనస్సును అలవాటు పరచుకున్నందువల్ల సంబాళించుకొంది అత్తయ్య. వాళ్ళ అన్నయ్యనీ వదిననీ ఆ సమయానికి సాయంగా రమ్మని యిదివరకే ఆహ్వానించింది.—

నా దృక్పథంలో చూస్తే, నాకు సంతోషంగా వుంది — కాలేజీలో ,చాలా మర్యాదగా ఎన్నిక అయ్యే సీనియర్ లెక్చరర్ మా యింటికి కేవలం చదువు దృష్ట్యా కాళవియ్యానికి వస్తున్నాడంటే విచిత్రంగా తోచింది.

వనజ యథాప్రకారం ఫ్రీగా వుంది. బాబు ఉబుసుపోక పాటలు పాడుతూ, బొమ్మలు గీస్తూ, రేడియో తిప్పుతూ వున్నాడు.

సాయంకాలం తానే వచ్చింది.

అత్తయ్యా వాళ్ల అన్నయ్యా వదినలు ముందు వచ్చేరు. హాలులో కుర్చీల్లో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. వాళ్లతో క్వైట్‌గా కూర్చున్నాం నేనూ, బాబు. అత్తయ్య ఒక చోట కూర్చోలేక యిటూ అటూ తిరుగుతోంది. వనజ ముస్తాబయి రేడియో గదిలో కూర్చొని ఏదో పుస్తకం తిరగవేస్తోంది.

అబ్బాయి, అబ్బాయి తండ్రి సదరు బలరామారావు మాస్టారు, అతని భార్య వచ్చేరు. తగు విధంగా ఆహ్వానించి వాళ్ళని కూర్చోబెట్టేం.

మాస్టారు నన్ను పలుకరిస్తూ, "పేపర్లు పంపించేసేవా లేదోయ్?" అన్నాడు.

"లేదండీ, ఇంకా నాలుగు రోజుల సమయినా మిగిలివుంది."

అమ్మాయి రావడం, అబ్బాయి అమ్మాయిని చూడడం, అమ్మాయి అబ్బాయిని చూడడం జరిగేయి. అమ్మాయిని పాట పాడమన్నారు. చక్కగా పాడింది.

కాఫీ తీసుకొని వచ్చి అందరికీ యిచ్చింది వనజ. అందరూ త్రాగడానికి ఉపక్రమించేరు.

ఉన్నట్టుండి నాకు ఒక భ్రాంతి కలిగింది — ఎదురుగా మా ప్రక్కింటి పొట్టి అతను కనిపించేడు. ఒక చేతిలో ఖడ్గం, రెండవ చేతిలో విల్లు, మూడవ చేతిలో గొడ్డలి, నాలుగవ చేతితో యుద్ధక్షుర పట్టుకొని వున్నాడు....

నా చేతిలోవున్న కప్పు తుఫానులో యింటి కప్పులా ఎగిరింది. వెళ్ళి వెళ్ళి మా మాస్టారి ఒళ్లో పడింది.

"వాట్ యీజ్ రాంగ్ విత్ యు?" అని గర్జించేడు మాస్టారు.

"ఐ యాం సారీ," అంటూ లోనికి వెళ్లి ఒక తువాలును తీసుకొనివచ్చి యిచ్చేను, చేతులు యింకా వణుకుతూనే వున్నాయి.

ధైర్యం చిక్కబెట్టుకొని, ఆ భయంకర రూపం వైపు మళ్లీ చూసేను. నేను లేచిన కుర్చీలో కూర్చొని వున్నాడు అతడు.

"ఇరుగు పొరుగు వారు కాబట్టి పరిచయం చేయవలసిన అవసరం లేదనుకుంటాను," అన్నాడు మాస్టారు.

"హ" అని నవ్వేను.

"గోపాలకృష్ణ గారూ, మిమ్మల్ని ఏదో విషయం బాధ పెడుతోంది. ఒంట్లో బాగులేదా?"

"ప్రొద్దుటే నుండి జ్వరం. రోజంతా అలా డల్‌గానే వున్నాడు," అంది అత్తయ్య.

లాభం లేదనుకొని, "మన్నించండి," అని చెప్పి, నా పడక గదిలోకి వచ్చి, మంచం మీద వ్రాలేను.

ఆ పొట్టి అతను ఎందుకు వచ్చేడు? నిన్న బాబు చేసిన అఘాయిత్యాన్ని గురించే అయివుండాలి. అన్ని ఆయుధాలతో వచ్చిన వాడు ప్రూరిక్షనే ఎందుకు కూర్చున్నాడు?.. అసలు బాబు నిజంగా ఒక వెధవ! వాళ్ళు నిజంగా పెంకులు విసురుతున్నారా లేదా అని చూద్దామంటే గొప్పగా తను బండెడు రాళ్ళు తీసిపోసేడు వాళ్ల మీద! ఒక వేళ వాళ్ళు అమాయకులయితే?... ఏది కాని పెద్ద రభస కానున్నది. పెళ్ళివారు వున్నప్పుడే జరిగేటట్టుంది.

వనజ లోనికి వచ్చింది. "భయపడుతున్నావా, గోపాల్?" అంది నవ్వుతూ.


"నీ తమ్ముడు చేసిన ఘన కార్యానికి."

"కాని ఆ గొడవేమీ యిప్పుడు లేదుగా. ఆ పొట్టి అతను యిప్పుడు పెళ్లి పెద్దగా వచ్చేడు."

"పొట్టి పెద్ద ఏమిటి?"

వనజ నవ్వు ఆపుకోలేకపోయింది. "జరిగిందంతా చెప్తా విను. మధ్యాహ్నం నువ్వు దీర్ఘంగా పడుకొని వున్నప్పుడు అతడు రానే వచ్చేడు — నువ్వు వూహించిన రూపంలో. పెద్దగా కేకలు వేస్తూ వచ్చేడు. 'ఈ యింట్లో అతనికి ఏమయినా బుద్ధుంటూ వుందా? ఏడీ ఆ మాస్టారు?' అని విజృంభించేడు. నువ్వు గాఢంగా నిద్రపోతున్నావు. బాబు నిద్ర నటిస్తున్నాడు. అప్పుడు నారాయణ వచ్చి చిక్కు విడదీసేడు."

"నారాయణా?"



"ఆ. ఆ పెంకులు విసరడం మా నిజమే, కాని అప్పుడు నువ్వు తెలివిత లేవని చెప్పమన్నాడు నారాయణ. అమ అలాగే చెప్పింది."

"అంటే నమ్మేసేడా?"—

"తెలివి ఎక్కడికి పోయింది అని అ గేడు. నువ్వు ఆ సమయంలో బాబు లెక్కలు చెప్తున్నావనీ, ఏదైనా విషయ బోధపరుస్తున్నప్పుడు చేతిలో ఏదివుం అది విసిరేయడం నీకు అలవాటు అ చెప్పింది అమ్మ."

"ఇంతకీ రాళ్ళు రువ్వేది అతనం నేను వినరగానే అంత ఉక్రోషం రావాలేం?

వనజ నవ్వసాగింది. "నువ్వు నిజం పిచ్చివాడివి. అసలు పెంకులు ఎక్క నుంచో పడడం లేదు. నువ్వు యింటి ఎలా వుంచేవో ఒకసారి ఆలోచించు.

అప్పుడు నాకు గుర్తుకు వచ్చింది... ఇల్లు శిథిలావస్థలో కనపడడం యిష్ట లేక, ఒకరోజు సగం విరిగిన పెంకులన్నిటి యింటి కప్పుమీద నుండి పూడవికి (క్రింద) తీసుకొని వచ్చేను. వాటిని సాలోస్ని నా య్యకు అన్యాయం చేసిన నాడిపుతాన భద్రంగా దాకిలి ప్రక్కన రెండు స్తంభా మధ్య వున్న దూలంమీద అమర్చిపెట్టే ఆ దూలం ఎలుకలకి రహదారి....

వనజ వెళ్లిపోయింద.

నారాయణ వచ్చి నన్ను ఉద్దేశం చూస్తూ నిలబడ్డాడు.

"నారాయణా"


"ఏం, బాబు?"

"నన్ను పిచ్చివాడిని చేసింది ను వన్నమాట."

"పరిస్థితి అలా వచ్చింది, బాబు. బా విసిరేడని చెప్తే, వనజమ్మగారి పెళ్ అడ్డంకులు రావచ్చని అలా చెప్పమన్నా బాబు. పొట్టి అతను వాళ్ళకు దగ్ బంధువాయె మరి."

నేను నిట్టూర్చేను.

నేను యింటర్మీడియట్ చూమం యింట్లోనే వుండి చదువుకోవడం, అవస ఉన్నప్పుడు అతను నాకు ఐదూ, పదీ ముట్ చెప్పి వుండడంవల్ల నేను అతనికి పడ ఋణాన్ని యిలా తీర్చుకున్నానని తృ పడ్డాను.



చిరుద్యోగపర్వం

నవ కథ.

వరప్రసాదం

శేషపల్లి వెంకటలక్ష్మీనారాయణ

భజగోవిందరావింటి కెళ్ళిన ఆదివారం వెళ్ళొచ్చిన సోంవారం నుంచి చిరుద్యోగి చిరునవ్వు చూపిస్తున్నా డాఫీసులో. భజగోవిందరావు రూంలోకి చొరబడుతున్నాడు వీలున్నపుడల్లా. భజగోవిందరావుకూడా కళ్ళేరుపులు అయిపు లేకుండా పోయినయ్ చిరుద్యోగిని చూసేప్పుడు....

ఒకనాటి సాయంకాలం ఆరింటికే ఆఫీసు బయటికొచ్చాడు, చిరుద్యోగి. సైకిల్తీసి బయల్దేరాడు. సైకిలు వెనకాలికే ఫైళ్ళు లేవు. ఆ సంగతి ఆకాశంలోంచొక మేఘం చూసింది 'యిక్కడో విద్దూరం వుంది. చూద్దురుగాని రండం'టూ మిగతా మేఘాల్ని కూడా పిల్చింది. 'యితగాడు ఫైళ్ళొదిలేసి చిరునవ్వు నవ్వుతున్నాడు. చిరుద్యోగి చిరునవ్వు నవ్వితే చిటపట చినుకులు పడద్దూ' అంటూ పక్క మేఘాల్ని హెచ్చరించింది. .. వడగళ్ళు కూడా పడ్డయ్. చిరుద్యోగి చిరునవ్వు నవ్వితే వడగళ్ళవాన వస్తుందిట. చిరుద్యోగి బట్టతలమీద వాయిస వడగళ్ళు పడ్డయ్ 'అబ్బా' అని చేత్తో తాత్కాలిక రక్షణ ఏర్పాట్చేసి గొడుగు తెరిచాడు.. పక్కనించి జల్లు కొడ్తూనే వుంది. చిరుద్యోగి తడుస్తూనే పెద్ద బజారుకెళ్ళి ఆరు మావిడిపళ్ళు, పది కమలా ఫలాలు, యింకేవేవో పళ్ళూ ఫలాలు కొని యింటి కెళ్ళి రిక్షాలో పెళ్ళాం నెక్కించుకుని భజగోవింద రావింటి కెళ్ళాడు. పళ్ళ బుట్ట సత్యభామాదేవిగారి కిప్పించి స్పెషల్గా తెచ్చిన ద్రాక్షపళ్ళగుత్తి భజగోవిందరావు కిచ్చి 'నమస్కారవండి' అన్నాడు. 'కూర్చో వయ్యా, చిరుద్యోగి, బాగా తడిసి పోయావే... అమ్మాయ్ కూర్చోమ్మా' అన్నాడు. చిరుద్యోగర్ధాంగి సత్యభామాదేవి పక్కన కూర్చుంది. చిరుద్యోగి కూర్చుంటూ 'మా ఆవిడ మావిడి పండు పూజ్జేసుకుంది. మొన్న పిన్నిగార్ని బజార్లో చూసిందట. పండులాంటి ముత్తైదు. అలాటి వాళ్ళకే పళ్ళివ్వాలి. ఆవిడ కివ్వందే యివ్వాళ భోంచెయ్యను' అని వాకోసం కవిపెట్టుక్కూర్చుంది. సరే, నే వారున్నర కింటి కెళ్ళి యిట్టేసుకొచ్చా' నన్నాడు. సత్యభామా దేవిగారు కోప్పడింది, 'అబ్బాయ్, మీ మొగాళ్ళ ఆఫీసు కెడితే యింటి గొడవ అసలు గుర్తుండదా?... పిల్ల ఏం తినకుండా వుపోషం వుంటె మువ్విప్పుడా యింటి కెళ్ళేది... మువ్వు పెందరాళే యింటి కెడితే పిల్ల యీపాటి కష్టం తినేసేదా' అంటూ.

'అవునయ్యా చిరుద్యోగి, మువ్వాసంగతి చెప్పి ఏ మూడింటికో యింటి కెళ్ళిపోతే పోయేదిగా?.. పాపం పిల్ల యిప్పటిదాకా భోంచేయకపోతే ఎట్టా?' అన్నాడు భజగోవిందరావు కూడా.

'ఆ... ఆరింటిదాకా అన్నా పన్జెయ్యకపోతే పన్లేవల్దు. ఫైళ్ళు కదలవ్' అన్నాడెంతో వినయంగా చిరుద్యోగి.

'హాటిన్నిగ్గిసిరి... అవట్టానే వుంటయ్ పోనీ ఆనందరావు కివ్వక పోయావ్

పైళ్ళని' అన్నాడు భజగోవిందరావు.

'ఆఁ ఫర్వాలేదులెండి... అయి పోయిం దిగా' అన్నాడు చిరుద్యోగి. అని వెంటనే లెక్కేసుకున్నాడు తనెక్కడున్నానా ఛార్టులో నని. ఆనందరావనే వాడు భజగోవిందరావు అంతరంగికుల్లో అయిదోవాడు. వాడికి పైళ్ళివ్వమన్నాడంటె తను కనీసం అయిదో వాడయ్యాడన్నమాట. ఫర్వాలేదు. యింకా నాలుగు మెట్లే వున్నయ్. తొందర్లోనే ఎక్కేయ్యొచ్చనుకున్నాడు.

'పోన్లే యిక ముందైనా యిట్టా చెయ్యకు... అమ్మాయ్‌చేత రెండింటికే వచ్చి వడ్డింపించేసి అన్నం తిని పించెయ్... అమ్మాయ్, నువ్వి పూటిక్కడే భోంచెయ్' అంది సత్యభామాదేవి.

'అబ్బే ఎందుకండీ... అదీగాక నేను పూజ్జేసుకునిగాని తిన్ను. మీలాంటి వాళ్ళ కివ్వడంతో నా కెంతో సంతృప్తిగా వుంది. ఆకలి కూడా వెయ్యటల్లేదు' అంది చిరుద్యోగర్ధాంగి... అందరూ కాస్సేపు మాట్లాడుకున్నారు. కాస్సేపయ్యాక 'అమ్మాయ్, నువ్వింకా అన్నం తిన్లేదు. లేకపోతే కాస్సేపు కూర్చుని ఆ సుందరమ్మ కథ చెప్పుకునే వాళ్ళం... సరే సుందరమ్మ కథలు మొదలెడితే యిపుడయ్యేనా పెట్టేనా?.... నువ్వపుడపుడూ వస్తూండు. అప్పుడెప్పుకుందాం... అయినా పూజ లోజన దాన్సంగ తెందుకు..' అని నవ్వింది సత్యభామాదేవి. 'భలే మాటలన్నారు పిన్ని గారు...' అని చిరుద్యోగి నవ్వాడు. భజ గోవిందరావూ నవ్వాడు. చిరుద్యోగర్ధాంగి నవ్వింది. 'మీరా యింటి కోసారి రావాలను కుంటున్నా' అంది సత్యభామగారు మళ్ళీ.

'అంతకంటేనా పిన్నిగారు... తప్ప కుండా రండి. నో సాయంకాలం నేనొచ్చి తీసుకెడ్తాను. అన్నట్టు మర్చే పోయా చెప్పటం. మీరు భజగోవిందరావుగారు రేపు శుక్రవారం భోజనానికి రావాలి మా యింటికి. రేపు శుక్రవారం ఉద్యాపన చేస్తోంది మా ఆవిడ' అన్నాడు చిరుద్యోగి.

'అవునండి అత్తయ్యగారూ... మీర్, బాబాయిగారు తప్పకుండా రావాలి. మిమ్మల్ని చూస్తుంటె మా పిన్ని గుర్తు కొస్తుంది.... ఏవిటో యీ బాంధవ్యం మీర్తప్పకుండా రావాలి. మేవొచ్చి మళ్ళీ పిలుస్తాం అనుకోండి' అంది చిరుద్యో గర్ధాంగి.

'సరే అమ్మాయ్... మళ్ళీ నువ్వంతదూరం పంపి తీసుకెళ్ళిలా. అబ్బాయినొచ్చి పిలిస్తే చాలు' అంది సత్యభామాదేవి.

"మొగుడు పెళ్ళాం కెళ్ళాల్లని వినయం... యిద్దరూ కూడా బుద్ధి మంతులు. కదండీ' అంది సత్యభామాదేవి గారు పళ్ళు లెక్కెడతా.

'అవునవును... అతగాడ్నదివింది ఎప్పుడు. చదువు వినయాన్ని ఇస్తుందన్న మాట వూరికే పోతుందా' అన్నాడు భజగోవింద రావు ద్రాక్షపళ్ళు తింటూ....

నాలుగో నోము వుద్యాపనప్పుడు చిరు ద్యోగింట్లో అయిదో తడవ భోంచేస్తున్న భజగోవిందరావన్నాడు: 'చిరుద్యోగీ, నువ్వో పన్చెయ్యి. వచ్చే నెల్లో యు.డి.సి. పోస్టు



ఒకటి శాంక్షనయ్యింది మనాఫీసుకి. నువ్వప్లయ్ చెయ్. అది శాంక్షనయ్యిందని నే నెవ్వరికీ చెప్పలేదింకా.. నువ్వూ చెప్పకు అప్పడ్డాకా.. అప్లయ్ చెయ్' అని.

'సరే— సార్' అన్నాడు చిరుద్యోగి యింకో మాఁవిడిపండు భజగోవిందరావు విస్తట్లో వేస్తూ.

చిరుద్యోగి యు.డి.సి. అయ్యాడు. యు.డి.సి. అయ్యిన్రోజున భజగోవింద రావింటికి మూణ్ణాలుగు తడవలు చేరే వాడు అపీ యిపి. భజగోవిందరావు 'ఎందో కయ్యా' అంటూనే అందుకున్నాడు. యల్.డి.సి. పోస్టొదిల్నా దాంట్లో నేర్చు కున్న పాఠాన్ని మాత్రం వదల్లేదు చిరు ద్యోగి..

కొన్నాళ్ళు పోయాక...చిరుద్యోగింటి [illegible] ఒక బి.బి. [illegible] యిస్పెళ్ళి తప్పుతున్న కుర్రాళ్ళకి ట్రయు షెన్లు చెపుతున్నాడు. చిరుద్యోగికో ఆలో చన వచ్చింది. వాడ్దగ్గరకెళ్ళి 'ప్రిన్సిపాల్ గారూ! మీ కాలేజీ ఎప్పుడు ప్రారం భిస్తారు' అన్నాడు.

'ఏవిట్రా చిరుద్యోగీ, నీ కాటగా వుందా, లేకపోతే యు.డి.సి. నయ్యానని గర్వంగా వుందా' అన్నాడు పండితుడు.

"అది కాదురా మాస్టరూ... నీ రూం ముందు 'ట్యుటోరియల్ కాలేజి' అని బోర్డు కట్టు... బాబ్బాబు... దాంతో నాకు పనుంది" అన్నాడు చిరుద్యోగి.

'బోర్డు కడితే యిన్‌కంటాక్సువాడ వస్తాడు... వస్తిట్లా బతకనియ్యడు దబ్బు లేదా ఏం.... అదీగాక బోర్డుకు డబ్బు అన్నాడు.

'ఒరేయ్... మరీ పిదరువు లరవకు కోటేసుకుని కోర్టు లోపలికెళ్ళని కో శ్వరరావులందరూ బోర్డులు కడ్తుం అంతో యింతో వస్తున్న నువ్వు కడ్తానికే పోనీ మనిద్దరం కల్సి రాయిద్దాం బోర్డు యినకంటాక్సు భయమయితే పకరోజు తీసెయ్యి బోర్డుని' అన్నాడు చిరుద్యో

'సరే... యింతకూ అదెందుకు' అన్నా ప్రిన్సిపాల్. 'తర్వాచ్చెపుతాను.. న్నూ మా ఆఫీసరింటికి రావాలి న అన్నాడు చిరుద్యోగి.

... మర్రోజు స్నేహితుడు, చిరు భజగోవిందరావింటి కెళ్ళేరు. 'పిరే గోవిందరావుగారు... మా ఆఫీసరు

వీరే ఫలానా ట్యుటోరియల్ కాలేజీకి అనుభవం కల ప్రిన్సిపాలుగారు... పేరు విద్యానందగారు' అంటూ పరస్పర పరిచయం చేశాడు చిరుద్యోగి. యిద్దరు చేతుల్చాపి కరచాలనం చేసుకున్నారు. 'మీ కీర్తిని గురించి పూర్వమే విన్నాను. కానీ మిమ్మల్ని చూసే భాగ్యం యిప్పుడే కల్గింది' అని ఒకళ్ళనొకళ్ళు స్తుతించుకున్నారు. చిరుద్యోగి మొదలెట్టాడు:

'ఎల్లుండి విద్యానందగారి కాలేజీ ప్రారంభోత్సవం.. మీలాంటి వక్తశ్రేష్ఠ ఉపన్యాసం యిప్పించాలని వారి అభిలాష. మీకు పని వత్తిడివున్నా యీ శ్రమ తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు'.

'భళా భళి' అన్నారు విద్యానందగారు.

భజగోవిందరావు మొహం వికసించింది. అయినా దాన్ని కనపడ్నీకుండా..

'...మీలాంటి విద్యా వేత్తల్తోనూ విద్యా సంస్థల్తోనూ సంబంధాలంటె నాకు చాలా యిష్టం. .. కానీ ఎల్లుండి కేంపు కెళ్ళాల్సొస్తుందేమోనని చూస్తున్నాను. అన్నాడు భజగోవిందరావుగారు.

'మీరెలాగైనా వీల్చేసుకుని రావాలి. యీ యేడాది మా కాలేజి మీ సువర్ణ హస్తాల్తో ప్రారంభోత్సవం చెయ్యాలి.' అన్నారు విద్యానంద.

'సరే, మీరింతగా చెపుతుంటె తప్పుతుందా' అన్నాడు భజగోవిందరావు.

'నే చెప్పలా.. వారు సహృదయులు... మన కోరిక తీర్చెయ్యరు' అన్నాడు చిరుద్యోగి. 'అయితే మేం వస్తాం... నమస్కారం' అంటూ వెళ్ళిపోయారిద్దరూ... వాళ్ళను అటు వెళ్ళనిచ్చి భజగోవిందరావు లోపలికి పరిగెత్తి 'ఏమేవ్ ... యిది చూశావా? మనం ఉపన్యాసాలిస్తున్నాం ... నువ్వూ వస్తా వేవిటి వినడానికి' అన్నాడు.


ఉపన్యాసం అయిన రాత్రి చిరుద్యోగి భజగోవింద రావింటి కెళ్ళాడు. భజగోవిందరావు భోజనం చేశాక భజన మొదలెట్టాడు. చిరుద్యోగి. 'సార్.. నిజంగా ఏం బాగా చెప్పారండి! మీరొప్పిన సంగతులన్నీ మనం యెప్పుడూ చూసేవే.. అయినా చెప్పే దాకా యెవడికీ తెలియవ్' అన్నాడు.

'చిరుద్యోగీ, యింకో కొత్త విషయం చెప్పాను అబ్జర్వ్ చేశావా?' అన్నాడు భజగోవిందరావు.

చిరుద్యోగపర్వం

'ఏవిటండి.. ఓహో.. అదా.. గుర్తుకొచ్చింది. 'విద్యార్థులు ఆధ్యాత్మికచింతన' అన్నదా.. భలే హ్యూమరస్‌గా వుంది సార్. మా పక్క బెంచీలో వున్నాయన గంటసేపట్నుంచీ నవ్వుతూనే వున్నాడు. నాకు చచ్చేంత నవ్వొచ్చింది. బయట కెళ్ళిపోయాను నవ్వాపుకోలేక. అట్లాగే చాలామంది బయట కెళ్ళిపోయారు.' అన్నాడు చిరుద్యోగి.

'విద్యార్థులూ—ఆధ్యాత్మిక చింతన' అనేది కూడా ప్రపంచంలో లేని న్యూసెన్సంటే ననుకో... కానీ యింకోటుంది. యింతవరకెవ్వడూ చెప్పలేదది. నేనే చెప్పింది మొదటిగా యివాళ. ప్రతివాడు 'నేటి విద్యార్థులే రేపటి పౌరులు' అంటాడు. అంతటితో ఆపేస్తాడు. కానీ నేనంతటితో ఆపకుండా 'ఎల్లుండి నాయకులు కూడా వాళ్ళే'నన్నాను. గమ్మత్తుగా లేదూ?' అన్నాడు భజగోవిందరావు సంతోషంగా.



'గ్రాండుగా వుంది సార్.. మీరింకోటి కూడా అన్నట్లున్నారు. 'నేటి విద్యార్థులే నిన్నటి అమాయక పసిపిల్లలు' అని అన్నాడు చిరుద్యోగి. నిజానికీ సంగతి భజగోవిందరావు చెప్పలేదు. 'నేటి విద్యార్థులే నిన్నటి అమాయకపు పసిపిల్లలు' అంటే నమ్మ బుద్ధవ్వటం లేదని ఎవరన్నా అంటారేమోనని అది చెప్పలేదు. అయినా 'అవును, చెప్పాన'న్నాడు భజగోవిందరావు.. అవీ యివీ మాట్లాడి చిరుద్యోగి లేస్తూ 'కానీ, మీటింగు బ్రహ్మాండంగా జరిగింది సార్.. నమస్కారండి' అని బయలేరాడు.

ఇలా రెండుమూణ్ణెల్లు గడిచాక సూపర్నింటు పోస్టొకటి ఖాళీ వచ్చింది. భజగోవిందరావు చిరుద్యోగి చేత అప్లయి చేయించాడు. కానీ యీ పోస్టు కొంచెం పైవాళ్ళతో కూడా సంప్రదించాలి. అందుకని అప్లికేషన్ పెట్టిన కొన్నినెలలకి చిరుద్యోగిని పైకెళ్ళి సంగతులేవిటో కనుక్కొని అప్లికేషన్ని పైకి లాగమన్నాడు భజగోవిందరావు. చిరుద్యోగి నాలుగురోజులు శెలవు పెట్టి పైకి బయల్దేరాడు.

పై ఆఫీసు వరండాలో బోల్డుమంది కూర్చున్నారు. పై ఆఫీసులో వో పద్ధతుంది. ఏ కాగితం కూడా దాని తాలుకా వాడొస్తేగాని కదల్దు. ఆ ఆఫీసు కొన్ని జిల్లాల విషయాలు చూడాలి మరి. అందుకని కాగితం తాలుకా వాడుగానీ, వాడి తాలూకా యింకెవరన్నాగానీ వస్తే దాన్ని పైకి తీస్తారు. లేకపోతే 'వాడికే అంత యింటరెస్టు లేదు. మనకేవో రెస్టులేదు. మనకెందుకీ పని. తనక్కాని పనికి, కానీ రాని పనకి పోరాదు. పూర్వం గాడిద—కుక్క కథ తెల్సుగందా' అని వూరుకుంటారు. అందుకని పను కావాలంటే కాగితాల్నట్లా పోస్టులో పంపి మర్రోజు బయల్దేరి క్కడికి రావాలి. అలా బయల్దేరొచ్చి యిక్కడ కూర్చుని పను చేయించుకుంటారు. వరండాలో కూర్చున్న వాళ్ళందరూ అలాంటి వాళ్ళే. చిరుద్యోగి కూర్చోదల్చుకోలేదు. నుంచునే పన్చేయించు కెళ్ళా అనుకున్నాడు. ఓ క్లర్కు దగ్గర కెళ్ళి నిలబడ్డాడు. అతడితగాణ్ణి 'కూర్చో' అన్నాడు. 'నేను కూర్చోను. నువ్వే నుంచో ఎన్నాళ్ళు నా కాగితం మీద కూర్చున్నావ్. యిహ లేచి నుంచో. బయటికెళ్ళి కాఫీ తాగుదాం' అన్నాడు చిరుద్యోగి. చిరుద్యోగి కాగితం రెపరెపలాడింది 'నా నాథుడొచ్చాడు. నా చెర తీరేను. నాకు శాపవిముక్తి కలిగేను' అనుకుంటూ. చిరుద్యోగి ఆ క్లర్కుని రెక్కుచ్చుకుని లేపాడు కాగితం మీంచి..

'ఏవిటి కథ' అన్నాడు చిరుద్యోగి, పైళ్ళ మీద కూర్చుని చిరుద్యోగి అప్లికేషన్ని తొక్కిపడున్న క్లర్కుకి కాఫీ యిప్పిస్తూ—

'ఏవుంది.. మామూలే.. మామూళ్ళుంటయ్ గందా' అన్నాడు వాడు.

'అయినా నీ కాగితాన్ని తొందరో,


'అదనపు
తెలుపుదనము
ఎక్కడ నుంచి
వస్తుంది?'
Tinopal







చిరుద్యోగ పర్వం

ంగా ఏడాదాఖర్ గా.. పంపాలని రెడ్ లేబిలు వేశాం' అన్నాడు వాడు మళ్ళీ.

ఇంకా తెల్సిందేవిటంటే భజగోవిందరావు చిరుద్యోగపికేషన్ మీద కాన్ఫిడెన్షియల్సు బాగా పంపించాడు. అందుకని అంతా అయిపోయినట్టే. కాని ఆ మిగతా లాంఛనాలయిపోతే ఆర్డరు రావటమే తరువాయిట. పై ఆఫీసులో వున్న ఆఫీసరు పేరు వరప్రసాదరావు. వరాలు ప్రసాదిస్తూ వుంటాడని ప్రతీతి. కాని దానికి ముందో పెద్ద తతంగం వుంది. తతంగం తంతా అంతా తెరవెనకాలుండిపోయింది. ప్రసాదం సంగతి మాత్రం ప్రతివాడికీ తెల్సింది. దాంతో ఆయన ప్రతివాడికీ సహాయం చేసాడని పేరొచ్చింది బయటికి. కాని చిరుద్యోగి కనుభవం వచ్చింది కాబట్టి కాఫీ తాగిన క్లర్కు నడిగాడు, 'ఏవిటి ఈయనని గురించనుకునే మాట నిజమేనా? వుత్త చేతుల్తో వెళితే వుపకారం చెస్తాడా'ని. క్లర్కు ఫెళ్ళుమని నవ్వాడు. 'భలేవాడివే! ఆఫీసులో పనేస్తూ కూడా ఇలాంటి అర్థంలేని ప్రశ్నేస్తావా? వుత్త పుణ్యానికంత పుణ్యం చెయ్యాల్సిన అవసరం ఎవరికుంది? అతగాడన్నీ పాపాల్చేశాడనా నీ వుద్దేశ్యం. అతగాడికీ వ్యాపారంలో పాపపుణ్యాలు బేరీజు వేస్తే రెండూ సమానం అవుతయ్. అవకాశం చేస్తయ్. ఇటు ఈ చేత్తో డబ్బు పుచ్చుకుని ఆచేత్తో రసీదిస్తున్నట్టు అర్థాదిస్తుంటె.. ఆయన ప్రిన్సిపులేమిటంటా 'ఎంత పాపం చేస్తే అంతే పుణ్యం చెయ్యాల'న్నది. అందుకని నువ్వుత్త చేతుల్తో వెళ్తే పాపం ఏం చెయ్యటలేదు కాబట్టి 'హలో' అని 'వెళి రా' అంటాడు. 'తెల్సిందా' అని మళ్ళీ మొదలెట్టాడు కాఫీ తాగిన క్లర్కు వక్కపొడి చిరుద్యోగి జేబులోంచి తీసుకుంటూ. 'నీకు వరప్రసాదరావు కథ చెపుతాను విను. విన్నాక ఏం చెయ్యాలో నువ్వే తెల్సుకుంటావు వరప్రసాదరావు. మొట్టమొదటెందో బ్యాంక్‌లో క్యాషియర్‌గా చేరాడు. నోటు లెక్కెట్టటం అలవాటయ్యింది. ఇంత కష్టపడి లెక్కెట్టుకున్న నోటల్లో పాయింతం అయిదయ్యేసరికి ఒకటి కూడా జేబులో పడకపోయేసరికి చాలా బాధపడేవాడు. అందుకని నోట్లు లెక్కెట్టుకోడమే కాకుండా లెక్కెట్టి వెక్కి జేబులో పెట్టుకోవాలని బుద్ధి కల్గింది. ఇదిక్కడుంటే జరిగే పనికాదని దాన్నొదిలేసి, చిన్నుద్యోగమైనా పదిమందొచ్చే దాన్నొక దాన్ని పట్టుకున్నాడు. 'ఒరేయ్, అదేంపని.. బంగారంలాంటి బేంకుపని, అయిత్తరవాత వస్తే అయినకాడికొచ్చే దొదిలేసి, ఆ ఇచ్చేదానికే అర్ధరాత్రి దాకా వస్తూ ఇదట్టుకున్నావేవిటి?' అని కేకలేశారందరూ.. 'అంతేనా విచారూ సింది... ఆ పై వాటి మాట చూడండి, మరి' అన్నాడు వరప్రసాదరావు, నెలాఖర్న జేబులోంచి నాలుగు వదుల్తిస్తూ. 'అట్టా చెప్పుమరి' అన్నారిందాక కేకలేసినవాళ్ళు.. వరప్రసాదరావు బాంక్‌లో పనే సెప్పుడో అలవాటు చేసుకున్నాడు. అతగాడి చెయ్యి ఎప్పటికప్పుడు ఎండిపోటమా వుండేది. వేళ్ళు తడిపితేగాని లెక్కెట్టడం కుదిరేదికాదు. పది నోట్లు లెక్కెట్టాలంటె తప్పడపలు వేళ్ళు స్పాంజిలో ముంచాల్సిందే. అదే పని పై ఆఫీసులో చేరాక, పై ఆఫీసులో పై కెళ్ళాక్కూడా చేసున్నాడు. చెయ్యి తడిపితేగాని కాగితాలు కదల్వడు. కథంతా తెల్సుకుని చిరుద్యోగి వరప్రసాదరావు దగ్గరకెళ్ళాడు. నమస్కారం పెట్టి భజగోవిందరావిచ్చిన రెండు కాగితాల పుత్తరం ఇచ్చాడు. వరప్రసాదరావు మొదటి కాగితం చదివాడు. రెండో కాగితం చదువుదామంటే అది అంటుకుని విడిపట్టంలేదు.

'పెద్దవది, కాయితాలంటుకున్నయ్, విడిపట్టలేదు' అని విసుక్కున్నాడు వరప్రసాదరావు. చిరుద్యోగి జేబులోంచి పదిరూపాయల నోటు తీసి మడిచి బల్లమీద పెట్టి 'ఇదో పొర్దయు వకాపించాలి' అన్నాడు వరప్రసాదరావు నోటు డ్రాయర్లో పెట్టుకున్నాడు. నోటందుకున్న చెయ్యి వేళ్ళు తగలంగానే రెండో కాయితం విడిపడింది.. అది చదివి 'భజగోవిందరావింతగా రాస్తే తప్పకుండా చెయ్యాల్సిందే'నని చిరుద్యోగపికేషన్ మీదున్న ఫైళ్ళని పడగొట్టించి ఆర్డరు పైకెట్టమని కాఫీ తాగిన క్లర్కుని పిల్చి చెప్పాడు. చిరుద్యోగి నమస్కారం పెట్టి క్లర్కువెంట హాల్లోకి వెళ్ళాడు. చిరుద్యోగిని తన సీటు దగ్గర కూర్చోపెట్టి పైపు కొడ్తాని కెళ్ళాడా క్లర్కు....



చిరుద్యోగపర్వం

'విజయోస్తు, రాకుమారా!' అన్నమాట విని వులిక్కిపడ్డాడు చిరుద్యోగి. టేబిలు మీద నలిగిపోయి, రంగుమారిపోయి చిరిగిపోటానికి సిద్ధంగావున్నటాడు బిగించగా పడ్డ నాతలోనూ వున్న ఒక కాగితంలోంచి వినిపిస్తున్నాయ్ యీ మాటలు.

'నాకు చెర విముక్తి కల్గించావు. నేను చిరుద్యోగాధీనుని యిష్టసఖిని. పదిహేను సంవత్సరాల క్రితం నాథుని అభివృద్ధి కోసమై యీ ఆఫీసు పరిసరాల్లోకి వచ్చాను. వరప్రసాదరావు పట్టి, అలమరాలో బంధించాడు. నా నాథుడు యీతనితో పోరాడజాలక నారాకకై వేయి కన్నులతో నిరీక్షిస్తున్నాడు.. నీ అప్లికేషన్ పైకి తియ్యాల్సొచ్చేసరికి నా పని కూడా చెయ్యాల్సిన అవసరం కల్గింది. నన్ను కూడా రెండుమూడ్రోజుల్లో పంపిస్తున్నాడు. ధన్యవాదాలు రాకుమారా! నీ మేలు నా జన్మలో మర్చిపోలేను... అయినా యీ జన్మ ఫిరాయించయిపోతూంది కాబట్టి, జన్మజన్మలకీ మరిచిపోలేను... నా నాథుణ్ణి త్వరలో కల్సుకుంటాను.. అయినా అతగాడు జీవించియుండెనో, లేక నిరాశ చేసుకుని అసువులన్ బాసెనో..' అంది.. క్లర్కు దగ్గర్నుంచి ఆర్డరు తీసుకుని రైలెక్కాడు చిరుద్యోగి.

చిరుద్యోగి సూపర్నెంటయ్యాక విహంగరావో వుత్తరం రాశాడు. తను ఛీఫ్ ఎప్పుడో అయ్యాట్ట. ప్రస్తుతం అదేదో కమిటీలో అమెరికా వెడుతున్నాట్ట. సూపర్నెంటయినందుకు సంతోషిస్తూ, అట్లాగే ఛీఫ్ అయితే మరింత సంతోషిస్తానని రాశాడు. అయినా యీ లెవెలు కొచ్చాక పాతం మర్చిపోకుండా వుంటే ఛీఫ్ అవటం ఏమంత కష్టంగాదని కూడా రాశాడు. 'యిక నీ వివాహానికొచ్చింది టేకాఫ్ స్టేజి.. అలా అలా పైకెళ్లిపో' అని రాశాడు.

'అవును. టేకాఫ్.. యిహ పైకెళ్లడమే మన పని' అనుకున్నాడు పూర్వపు చిరుద్యోగి, యిప్పటి ఉద్యోగి.

(అయిపోయింది) ●

వారఫలం

28-10-1966 శుక్రవారం మొదలు 3-11-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో పోటీవారితో పోటీ పెరగడం వలన మీ కార్యక్రమాలను మార్చుకోవలసి వస్తుంది. రావలసినడబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

వృషభం : వారంప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు ఏర్పడి తరువాత సర్దుకొంటాయి. భాగస్వాములతోకలిసి చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రావలసిన డబ్బు మీద ఆధారపడి ఇతరులకు వాగ్దానాలు చేయడం తగదు. మీతాలూకు వస్తువులుపోయే ప్రమాదం ఉంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. బంధువులతో స్వల్పభేదాభిప్రాయాలు రావచ్చును.

మిథునం : వ్యాపారంలో మీరు ఇదివరకు చేసిన ప్రయత్నాలు ఇప్పుడు ఫలించగలవు. సాహసంతోకూడిన వ్యవహారాలుకూడా ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో ప్రయోజనంగల సంభాషణ జరుపగలరు. వారాంతంలో అనుకోని చికాకులు యేర్పడతాయి. అధికవ్యయం జరుగుతుంది.

స్త్రీలకు— కుటుంబకార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. అలంకార వస్తువులు కొంటారు.

కర్కాటకం : వృత్తివ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, ఆదాయం మాత్రం బాగా ఉంటుంది. వ్యాపారం భారీయెత్తున చేయడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వృత్తిలో ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగాఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

సింహం : వృత్తివ్యాపారాల్లో ఇదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. అధికారులవలన జరుగవలసినవ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీకృషి రాణించగలదు. ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కన్య : వారం ప్రారంభంలో వృత్తి వ్యాపారాల్లో వ్యయప్రయాసలకు గురికావలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. నూతన వ్యవహారాలు వారాంతంలో లాభించగలవు. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు— స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. సాహిత్యకళా రంగాల్లో మీ ప్రజ్ఞకి ఆదరణ వస్తాయి.

తుల : ఈవారం శుభాశుభ మిశ్రంగా ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో ముఖ్యమైన పనులు వారం మధ్యలో పూర్తిచేయడం మంచిది. కొన్ని వ్యవహారాల్లో మీకంటే పెద్దవారుకూడా మీ సహకారాన్ని కోరవలసివస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరుతాయి. బంధువులకు సహాయం చేస్తారు.

వృశ్చికం : వృత్తివ్యాపారాల్లో ఆదాయంతో పాటు వ్యయం కూడా పెరుగుతుంది. పోటీవారితో వాదప్రతివాదాలకు దిగడం తగదు. ఆర్థిక వ్యవహారాల్లో మోసగాళ్ళకు లొంగిపోవడం వలన ఇబ్బంది కలుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయంచేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగానే ఉంటుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు : కొన్నివ్యవహారాల్లో మీరు మొహమాటాలకు లొంగిపోవడంవలన చేజిక్కిన అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. సాహసముతోకూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ఉద్యోగంలో మెప్పుకు రాని కార్యభారాన్ని వహిస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మకరం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయంకంటే ఆదావుడి అధికంగా ఉంటుంది. ఆర్థికంగా మీ స్వంత వ్యవహారాలు బాగానేఉన్నా, ఇతరులనిమిత్తం శ్రమపొందవలసి వస్తుంది. అధికారులవలన జరుగవలసిన వ్యవహారాలు శ్రమమీద ఫలిస్తాయి. ప్రయాణాలులాభించ గలవు. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాలవిషయంలో అనుకూలత లభించగలదు.

కుంభం : సామాన్యమైన పనులకుకూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. రావలసిన డబ్బుమీద ఆధారపడి నూతన వ్యాపారాలు ప్రారంభించడం తగదు. విస్తరణ ప్రయత్నాలలో మిత్రుల సహకారం లభించగలదు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో స్వల్పభేదాభిప్రాయాలు రావచ్చును. అనుకూలమైన వార్తలను వింటారు.

మీనం : రావలసిన డబ్బు సమయానికి అందడం వలన అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగానే నెరవేరుతాయి. వృత్తిలో పోటీవారిపోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. విలాసవస్తువులు కొంటారు.

—మహేష్


మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు. ఈ పానీయమును మీరే త్రాగి చూడండి. మీ అతిథులకుకూడా ఇవ్వండి. మీరు తప్పక సంతోషములో వికసిస్తారు. అవును. మీ ఆనందభరితులైన అతిథులుకూడాను లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది.
LIPTON
లిప్టన్స్
అంటే
మంచి టీ



వసుంధర

వెంకప్ప తర్కం

మధుర నేలిన విజయ రాఘవరాయులు తెలివైన మంత్రికోసం పోటీలు జరుపుతూన్న సందర్భంలో ఈ సంఘటన జరిగిందని చెప్పుకుంటూ ఉంటారు.

ఆనాడు పెద్దయ్య, తిమ్మయ్య, వెంకప్ప అనే ముగ్గురు మేధావులు పోటీ చేశారు. రాజా ఆ ముగ్గురినీ ఒకరి వెనుక ఒకరిని కూర్చోబెట్టేడు. ముందర వెంకప్ప కూర్చున్నాడు. అతని వెనుక తిమ్మయ్య, అతని వెనుక పెద్దయ్య కూర్చున్నారు. పెద్దయ్యకు తన ముందర కూర్చున్న తిమ్మయ్య, వెంకప్పలు కనిపిస్తున్నారు. తిమ్మయ్యకు వెంకప్ప మాత్రం కనబడు తున్నాడు, వెంకప్పకు ఎవ్వరూ కనబడడం లేదు.

ఈ విధంగా ముగ్గురినీ కూర్చోబెట్టి, ఐదు తలపాగాలు తెప్పించి, వారికి చూపించాడు రాజా. అందులో మూడు నల్లనివీ, రెండు తెల్లనివీనూ.

"వీటిలో మాకు తోచిన ఏవో మూడు తలపాగాలు తీసి మీ తలలమీద ఉంచుతాం. మీరెవ్వరూ వెనుదిరిగి చూడకూడదు. తన తలమీద ఉన్న పాగా రంగును తెలుసుకో గలిగిన వారు నెగ్గినట్లు భావిస్తాం" అని రాజా పంజ్ఞ చెయ్యగా — సేవకుడు వచ్చి, వారి ముగ్గురికీ ముందు కళ్ళకు గంతలు కట్టేడు. రాజా నిర్ణయించిన తలపాగాలు వారి తలలకు పెట్టి, కళ్ళకు కట్టిన గంతలు తొలగించాడు.

రాజా ముందర పెద్దయ్యను ప్రశ్నించాడు. "మీ తలకు చుట్టిన పాగా ఏ రంగుదో చెప్పగలరా?"

పెద్దయ్య తనకు తెలియదని ఒప్పుకున్నాడు. తరువాత తిమ్మయ్యను కూడా అదే ప్రశ్న వేశాడు రాజా. తిమ్మయ్య కూడా తనకు తెలియదని ఒప్పుకున్నాడు. ఆఖరున వెంకప్పనూ అదే ప్రశ్న వేశాడు రాజా.

"తెలిసింది ప్రభూ! నా తలపాగా నల్లనిది" అన్నాడు వెంకప్ప.

నిజంగా వెంకప్ప తలకు చుట్టినది నల్ల తలపాగాయే! రాజా మెచ్చుదలగా తలవూపేడు.

"దానికి కారణం తెలియ జేస్తే సంతో షంగా వింటాం" అన్నాడు రాజా.


వెంకప్ప తన తర్కాన్ని ఇల్లా వివరించాడు. "మీ వద్ద నున్నవి ఐదుపాగాలు. అందులో మూడు నల్లనివీ, రెండు తెల్లని వీనూ. పెద్దయ్యగారు తిమ్మయ్యగారి తలమీద, నా తలమీద ఉన్న పాగాలను చూశారు. మా ఇద్దరివీ కూడా తెల్ల పాగాలే అయిఉంటే, తన తలమీద ఉన్నది నల్లని పాగా అని పెద్దయ్యగారికి వెంట తెలిసి ఉండేది. కాని, వారు తమకు తెలియదన్నారు. అంటే మా ఇద్దరి పాగాలు నల్లనివేనా అయి ఉండాలి, లేదా ఒకటి నల్లనిదీ, ఒకటి తెల్లనిదీ అయి ఉండా అని గ్రహించాను. ఈ సంగతి తిమ్మయ్య గారి మేధస్సుకి కూడా తప్పకుండా అం ఉంటుంది సందేహం లేదు.

తరువాత తిమ్మయ్యగారికి నా ఒక్క తలపాగా మాత్రమే కనిపించింది. నా తెల్లనిదే అయిఉంటే, తన తలమీది నల్లని పాగా అని ఆయన వెంటనే చెప్ప గలిగి ఉండేవారే. కాని, ఆయన చెప్పలే పోయారు అంటే, నాపాగా నల్లనిది అ కదా అర్థం?

ఈ విధంగా నాతలపాగా రంగు నల్ల అని తెలుసుకో గలిగేను. ఇందులో నాగొ ఏమీలేదు. వీరిరువురిలో ఎవరు స్థలంలో కూర్చుని ఉన్నా వారికీ సంగ తప్పకుండా తెలిసి ఉండేది.

"సెభాష్!" అన్న మెచ్చికోలు అను కుండానే రాజా నోట వచ్చేసింది.

"ఇంకొక్క సమస్య మిగిలి ఉంది కళ్ళకు గంతలు కట్టి మిమ్మలను మరొ సారి శ్రమపెట్టబోతున్నందుకు క్షం వ్యులం. — మీకు తెలియకుండా మీ నుదుటిమీద నల్లబొట్టుగాని, తె బొట్టుగాని పెడతాం. ఆ తరువాత మీ కళ్ళకు కట్టిన గంతలు విప్పేస్తా మీలో ప్రతి ఒక్కరికీ మిగిలిన ఇద్ద ముఖాల మీద ఉన్న బొట్లు ఏ రంగు



బాల సాహితి

కొంటున్నాను. ఎవరికి వారికో ఎవరి ముఖం మీదనైనా నల్లబొట్టును చూచిన వ్యక్తి చెయ్యి పైకి ఎత్తాలి. ఇది నియమం. తన ముఖం మీద ఉన్నబొట్టు ఫలానా రంగుది అని ఎవరు ముందుగా చెప్పగలుగుతారో వారు ఈ పరీక్షలో నెగ్గినట్లుగా నిర్ణయిస్తాం"

అని చెప్పి, వారి ముగ్గురి కళ్ళకూ గంతలు కట్టించి, ఆ వారి ముఖాల మీద నల్లని బొట్లే పెట్టించి, కళ్ళగంతలు విప్పించాడు రాజు. ముగ్గురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అందరూ ఒక్కసారే చేతులు పైకి ఎత్తేరు. అందరి కన్న ముందుగా వెంకన్న రాజు వైపు తిరిగి "నా నుదుటి మీది బొట్టు నల్లనిది ప్రభూ!" అన్నాడు.

ఈ విషయం వెంకన్న ఎలా గ్రహించాడు చెప్మా అని అక్కడ చేరినవారంతా ఆశ్చర్యపడ్డారు. రాజు కోరిక మీద వెంకన్న తన తర్కాన్ని ఇలా వివరించాడు.

"కళ్ళకు కట్టిన గంతలు విప్పగానే వీరి ఇద్దరి ముఖాల మీద నల్లని బొట్లు ఉండడం గమనించి నేనూ చెయ్యి పైకి ఎత్తేను. నా ముఖం మీద ఉన్నది తెల్ల బొట్టు అనుకుందాం మాట వరుసకి. అప్పుడు పెద్దయ్యగారికి తన నుదుట నున్నది నల్లని బొట్టు అని వెంటనే తెలిసి పోతుంది. ఎలాగంటే, పెద్దయ్య గారి నుదుటను తెల్లని బొట్టే కనుక ఉంటే తిమ్మయ్యగారు చెయ్యి ఎత్తి ఉండరు. అలాగే తిమ్మయ్య గారికి కూడా ఇదే తర్కాన్ని అనుసరించి తన ముఖం మీది బొట్టు నల్లనిది అని తెలిసిపోయి ఉండును. వారిద్దరూ కూడా తమ ముఖాల మీదిది నల్ల బొట్టు అని చెప్పలేక పోవడం చేత నా ముఖం మీదిది తెల్లని బొట్టు కాదనే కదా అర్థం? కనుక నాది నల్ల బొట్టు అని చెప్పగలిగేను."

వెంకన్న బుద్ధి నైశిత్యానికి రాజు బ్రహ్మానందపడ్డాడు. వెంటనే అతడికి మంత్రి పదవినిచ్చినట్లు ప్రకటించాడు. ●



హనుమాన్ —లక్ష్మగౌడ్

బాటిక్ చిత్ర ప్రదర్శనం

అగస్టు 4 వ తేదీ హైదరాబాద్ రవీంద్ర భారతిలో బాటిక్ చిత్రప్రదర్శన ఒకటి జరిగింది. ఇది రాజధానిలో జరిగిన మొదటి బాటిక్ ప్రదర్శన. కాని, స్థాయి పరిమాణాలు అందరినీ రంజింప చేశాయి.

వస్త్రాలలో చీరలు, బల్లల మీద పరిచే గుడ్డలు, దీపాలకి 'షేడ్'లు దైనిక జీవనానికి ఉపయోగపడే ఇతర వస్తువులు ప్రదర్శించారు.

బాటిక్ చిత్రాలు కూడా చాలా ఆహ్లాదకరంగా, మనస్సుకి హత్తుకుపోయేట్లుగా ఉన్నాయి. ప్రతి చిత్రకారుడూ తనకొక ప్రత్యేకత ఉందని నిరూపించుకున్నాడు. సూర్యప్రకాష్ తన 'ఆబ్‌స్ట్రాక్ట్'లనీ, లక్ష్మగౌడ్ దేవతల బొమ్మలనీ, దేవరాజ్ ప్రకృతి దృశ్యాలనీ, గౌరీశంకర్ రెండు మూడు దినుసుల చిత్రాలనీ చూసి ఆనందించే అవకాశం ప్రేక్షకులకి కలిగించారు. చిత్రకారిణి షమాక్ రిఫాకత్ చేతి వ్రాతలోని అందాలు తెలిపే ప్రదర్శనం చేసింది.

వీరందరూ శ్రీ జగదీష్ మిత్తల్ అధ్వర్యంకింద ప్రదర్శన చేశారు. బాటిక్ పద్ధతులు ఆంధ్రదేశం నుంచి ఇండోనేసియాకి వెళ్ళాయనీ, మళ్ళీ వాటి జన్మస్థానంలో ఈ రకం చిత్రాలకి ప్రచారం జరగటం హర్షణీయమయిన విషయమని అన్నారు.

__బాటిక్:__ ఈ రకం వస్త్రాలు ఈ మధ్య మనదేశంలో బాగా వాడుకలోకి వస్తున్నాయి. జావాలో ఇవి చాలా జనాదరణ కలవి. అసలు 'బాటిక్' అనే మాట జావా భాషలోని 'మ్బాటిక్' (మైనపు చిత్రం) అనే పదంనుంచి వచ్చింది. ఇది భారతదేశంలో, చైనాలో అతి ప్రాచీన కాలం నుంచీ వాడుకలో ఉంది. డచ్ వలసపాలకులు దీనిని ఇండోనేసియా నుంచి యూరప్‌లో ప్రవేశ పెట్టారు. నేడు ఇది హాలండ్, జర్మనీ, అమెరికా, బ్రిటన్‌ల వంటి దేశాలలో మంచి జనాదరణ కలిగి ఉంది.

దక్షిణ భారతదేశం తూర్పు కోస్తా మీద జరిగే 'కలంకారీ' బాటిక్‌కి సన్నిహితమయినదే. బాటిక్ ఈ ప్రాంతాల నుంచే జావాకి వెళ్ళిందని చాలా మంది అభిప్రాయం. జావాలో బాటిక్ చిత్రాలు ఇక్కడి వాటిని కొంతదాకా పోలిఉంటాయి.

అయితే, భారతదేశంలో ఆధునిక బాటిక్ పద్ధతులు పారిస్ నుంచి దిగుమతి అయ్యాయట. 1920 ప్రాంతంలో శ్రీమతి ప్రతిమాటాగూర్ 'మో' అనే ఫ్రెంచి చిత్రకారుడి దగ్గరనుంచి ఈ పద్ధతులని నేర్చుకుని శాంతినికేతన్‌లో దానిని మొదటి ప్రచారంలోకి తీసుకు వచ్చింది. క్రమంగా శ్రీమతి నందాలాల్ బోస్ కుమార్తె శ్రీమతి గౌరీభంజా దీనిని తన విద్యార్థులందరికీ నేర్పటంతో ఇది అఖిల భారత ప్రచారాన్ని సాధించింది.

ఈ బాటిక్ పద్ధతి ఇలా ఉంటుంది: సన్నని (దూదితోగాని పిల్కుతోగాని వేసిన) వస్త్రంమీద తేనెమైనం, పేరాఫిన్ మైనం కలిపిన పూతని ఒక బ్రష్ లేక 'కలం' లేక 'ట్యాంటింగ్' అనే పాత్రతో పూస్తారు. 'కలం' నిజంగానే కలమే. (వెదురుబద్ద చివర ఇనపకొక్కెం ఒకటి తగిలించి ఉంటుంది) ఈ కలాన్ని దక్షిణ భారతదేశం తూర్పు కోస్తా ప్రాంతాలలోనే వాడ్తారు. ట్యాంటింగ్ ఇండోనేసియాలో, 17వ శతాబ్దంలో కనిపెట్టిన పరికరం. చిన్న రాగి పాత్రకి కరిగిన మైనం కారే గొట్టాలు రెండు ఉంటాయి. ఇది కనిపెట్టక మునుపు అక్కడా వెదురు బద్దలు (ఇనుము మొనలు లేనివి) వాడే వారట.

ఆధునిక కాలంలో కుంచెనే ఎక్కువగా వాడుతున్నారు.

మైనం పూసిన తర్వాత వస్త్రాన్ని చల్లని రంగు ద్రావకంలో ముంచుతారు. ఈ రంగు మైనం పూసిన భాగాలకి అంటదు. ఎన్ని రంగులు కావలిస్తే అన్ని రంగులు అన్నిసార్లు ముంచి వెయ్యవచ్చు. మైనం పూత విధానం మార్చి మార్చి ఎటువంటి చిత్రం కావలిస్తే అటువంటి చిత్రం వేసుకోవచ్చు. రంగులు పట్టిన తర్వాత వస్త్రాన్ని ఉడికే నీటిలో ముంచితే మైనం వదిలి పోతుంది.

రంగు పట్టే సమయంలో కొన్ని గీతలు (పగుళ్ళు) వస్త్రం మీద ఏర్పడతాయి. ఇవే బాటిక్‌కి ఒక ప్రత్యేకతని చేకూరుస్తాయి. ఇవి చేతితో చేసిన పనిలోనే అందంగా వస్తాయి. యంత్రాలతో చేసిన వాటిమీద అంత అందంగా కనిపించవు.

ఏప్రిల్ 1966లో శ్రీ జగదీష్ మిత్తల్ ఒక 'బాటిక్ కర్మాగారం' ఏర్పరచారు. యువచిత్రకారులని సేకరించి వారికి మంచి ప్రోత్సాహం ఇచ్చారు. పై ప్రదర్శన ఆయన కృషిఫలితం.

(కు. వి.)

ప్రతిభగల నటి శారద



"శ్రీమతి"లో కాంతారావు, శారద

సినిమా ప్రపంచం చాలా విచిత్రమయి నది. ఎవరు రాణిస్తారో, ఎవరు రాణించరో, ఎవరెంతకాలం ఉంటారో చెప్పలేము. ఊహిం చడం మరింత కష్టం. ప్రతిభ ఉన్నవాళ్లు మరుగున పడిపోవడం, లేనివాళ్లు పైకి రావడం కూడ అప్పుడప్పుడు జరుగవచ్చును. నటనలో అనుభవం ఉండి, ప్రజ్ఞాప్రాభ వాలు కలిగివుండి మళయాళ చిత్రాల్లో ఉత్తమ నటిగా పలుమార్లు ఎన్నికయి ప్రశంసలు అందుకుంటున్న కుమారి శారద తెలుగుచిత్రాల్లో అరుదుగా కనిపించడం ఆలోచించదగిన సంగతి.

తెలుగు నటీనటులు తెలుగు కంపెనీ లకు వెళ్లి నిరాకరింపబడడం, వారిలోని ప్రతిభను గుర్తించి ఏ తమిళ చిత్రనిర్మా తలో అవకాశాలు యివ్వడం అతర్వాత వారికి పేరు ప్రతిష్ఠలు వచ్చాక తెలుగు వారు పిలిచి వేషాలు యివ్వడం సాధారణంగా జరుగుతున్నది. తెలుగు తారలను తెలుగువారు గుర్తించకపోవడం ప్రోత్సహించకపోవడం, దయనీయమయిన స్థితి..ఈనాడు మళ యాళ చిత్రాల్లో కుమారి శారద ధ్రువ తారగా వెలుగొందుతున్నది. ప్రముఖంగా ఆమె పేరు వినిపిస్తున్నది. ఆమె నటించిన మళయాళ చిత్రాలన్నీ విజయవంతం కావ డమే అందుకు కారణం.

హైదరాబాద్‌లో నెలకొల్పబడిన శ్రీసిటి యం పిక్చర్స్ అనే సంస్థవారు, కుమారి శారదలోని టాలెంట్ గుర్తించి తమ "శ్రీమతి" చిత్రంలో ఆమెకు కథానాయిక భూమిక యిచ్చారు. ఆ చిత్రం తాలూకు రషెస్ యిటీవల చూసినపుడు, శారద తనకు వచ్చిన మంచి అవకాశాన్ని చక్కగా విని యోగించుకున్నదని అనిపించింది. ప్రేమిం చిన పడుచుగా, విధి విసిరిన విషవలయంలో చిక్కుకున్న శ్రీమతిగా ఎంతో సమర్థవం తంగా నటించింది యీ చిత్రంలో.

* * *

తెలుగు, తమిళ, మళయాళ భాషా చిత్రా లన్నీ కలిపితే శారద యింతవరకు 30 చిత్రా లలో నటించింది. ఇప్పుడు ప్రదర్శింప బడుతున్న "మనసే మందిరం" చిత్రంలో ఒక చిన్నభూమిక ధరించింది. చిన్నవేష మయినా చక్కగా చేసింది. ప్రస్తుతం శారద నవ్వులు పువ్వులు, రతీ మన్మథ, భువనసుందరి కథ మొదలయిన తెలుగు చిత్రాలలోను, ఆరు మళయాళ చిత్రా ల్లోను నటిస్తున్నది.ఈ ఆరింటిలోను ఒకటి వర్ణచిత్రం.

అందచందాలు, మాట మెప్పుది, సం స్కారం, నటనలో విశేషమయిన అనుభవం గల కుమారి శారదకు మన చిత్రాలలో సరియయిన అవకాశాలు ఎందుకు లభిం చటం లేదు?

ఇటీవల శారదను కలిసినపుడు మాటల మధ్యలో "మీరు వివాహం చేసుకోబోతు న్నట్టు విన్నాను. నిజమేనా?" అని అడిగాను, అందుకామె సమాధానం చెబుతూ,

మోహన్‌కుమార్

"ఈ రూమర్లు నేనూ వింటున్నాను. ఎలా ప్రచారమవుతున్నవో నాకు తెలీదు. ఇప్పట్లో నా పెళ్లి ప్రసక్తి లేనేలేదు. ఏ మూడు, నాలుగేళ్ల తర్వాతనో యీ సమస్య గురించి ఆలోచిస్తాను. అప్పుడే ఏం సాధించానని వివాహం కోసం అంత తొందరపడడానికి!" అన్నది.

ఆమె చెప్పింది నిజమే అనిపించింది. తారగా శారద ఎంతో ముందుకి రావాలి. పేరు



శారద

ప్రతిష్ఠలు వచ్చిన తర్వాత చేసుకుని గృహస్థాశ్రమం స్వీకరిస్తే ఆనందదాయకంగా ఉంటుంది.

నటిగా కుమారి శారదకు చక్కని అవకాశాన్నో వచ్చే సూచనలు కనిపిస్తున్నవి "శ్రీమతి" చిత్రం చూస్తే. ఈ చిత్రం నవంబరు చివరలోగాని, డిసెంబరు మొదటి వారంలోగాని విడుదల అవుతుంది.

ఆంధ్రసచిత్రవారపత్రిక నవలల పోటీ!

మొదటి బహుమతి రు.3,500
రెండవ బహుమతి రు.1,500
మూడవ బహుమతి రు.1,000

ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి మరింత మంచి సీరియల్ నవలలని అందచెయ్యాలనే ఉద్దేశంతో పై పోటీని నిర్వహిస్తున్నాము. రచయిత(త్రు)లందరూ ఎప్పటివలె మాతో సహకరించి పై పోటీ జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

ముగింపు తేదీ: 31-12-1966

నిబంధనలు

1. పోటీకి స్వంతరచనలే పంపాలి. పంపే రచనలు తమ స్వంతమైనవే నని, అనువాదాలుకాని, అనుసరణలుకాని కావని రచయిత(త్రు)లు వ్రాతప్రతితో బాటు హామీ పత్రాలు పంపాలి.

2. రచనలు కాగితానికి ఒకవైపునే, సిరాతో రాసివుండాలి. 100అరఠావు (ఎక్సర్సైజు పుస్తకం పేజీకి రెండురెట్లు) పేజీలు లోపు,300 అరఠావు పేజీలు మించి ఉండరాదు.

3. నవలలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

4. వ్రాతప్రతులు 31—12—1966 లోపల మా కార్యాలయం చేరాలి.

5. వ్రాతప్రతులు, 'సంపాదకుడు ఆంధ్రసచిత్ర వారపత్రిక, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.

6. కవరుమీద వ్రాతప్రతిమీద 'నవలల పోటీ— 1966 అని' స్పష్టంగా రాయాలి.

7. పోటీలో నెగ్గని నవలలు ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉంది.

8. పోటీలో నెగ్గని, ప్రచురణకి స్వీకరింపబడని నవల వ్రాతప్రతులని వీలయినంత త్వరలో, సురక్షితంగా రచయిత(త్రు)లకి తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని ఈ విషయంలో ఎటువంటి బాధ్యతని వహించలేము, హామీ ఇవ్వలేము. వ్రాతప్రతులతోబాటు తగినంత తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్ని జతపరచటం అవసరం.

9. పోటీలో తుదినిర్ణయం సంపాదకునిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరుపబడవు.

10. ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురణ పూర్తి అయిన తర్వాత పుస్తకరూపంలో నవలని వెలువరించగోరేవారు పుస్తకంలో ప్రముఖంగా 'ఆంధ్రసచిత్ర వారపత్రికనుంచి పునర్ముద్రితం' అని పేర్కొనాలి.



'డాక్టర్ ఆనంద్'లో ఎన్.టి. రామారావు, కాంచన

చిత్రసమీక్ష

డాక్టర్ ఆనంద్

ఈ మధ్యన వచ్చే చిత్రాల్లో కథానాయకులందరూ డాక్టర్లే. అడుగుజాడల్లో 'అడుగు' డా. కృష్ణ, మనసే మందిరంలో 'మందిరం' డా. రఘు, ఈ చిత్రంలో డా. ఆనంద్. ఇంకా ఎంతమందో! ఈ డాక్టర్లందరూ ప్రేక్షకుల మీద ప్రయోగాలు చేస్తున్నారు. మన తె(ద)లుగు కెం పరవాలేదు, డాక్టర్లౌచేస్తున్నారు సెంటరలోనే పుంజాకోవచ్చు అనుకున్న వారికి ఈ డాక్టర్ల సంఖ్యని చూస్తే తలనొప్పి పుట్టే మాట వాస్తవం. అయినా ఏడాక్టరు చేస్తూనేవి మంచిదో ఇప్పుడు— అనుభవపూర్వకంగా ప్రజలు చెప్పాలి!


డా. ఆనంద్ రష్యా నుంచి తిరిగి వచ్చి మంచి డాక్టరుగా పేరు పొందాడు. పేరు పొందినట్లు సినిమాలో సన్మానంచేస్తారు. కాని ప్రేక్షకులు అలా అనగలిగినంత భరించినా లేదు. డా. ఆనంద్‌కు ఒక క్యాన్సర్ రోగి అయిన భార్య, ఒక చిన్నమ్మాయి అంతకంటే చిన్నబ్బాయి వున్నారు. చక్కని పిల్లని ఇల్లు. డా. ఆనంద్ డాక్టరుగా వున్న రోజుల్లో అతని హాస్పిటల్లో చాలా మంది రోగులు వున్నా, ఒకేఒక రోగికి ట్రీట్‌మెంట్ ఇస్తాడు. ఆమె కథకు నాయకురాలైన ఒక నర్తకి విజయ. ఆ నర్తకి ఇతన్ని హఠాత్తుగా ప్రేమించేస్తుంది. డాక్టరు కూడా మగవాడే గనక కరిగి పోయాడు. అతని హాస్పిటల్లో పనిచేసే నౌకర్ల దగ్గర్నుంచి డాక్టర్లదాకా అందరూ అతన్ని వేలెత్తి చూపిస్తారు. ఆ వేలును దింపడం కోసం డాక్టరుగారి సలహాపై అదే వూళ్ళో వేరే ఇంట్లో మకాం పెడుతుంది విజయ. అక్కడ కూడా ఆమెను కాకులు పొడుస్తాయి. డాక్టర్ బాధను కోరి ఆమె మద్రాసు వెళ్ళిపోతుంది. డాక్టరుగారు పగటి కలల్లో విహరిస్తారు. ఆ పగటి కలల్ని నిజం చేయడానికి వెంటనే కారేసుకుని మద్రాసు వెళ్ళబోతాడు. దార్లో మరో యన్.టి. రామారావు అతని సాయం కోరతాడు. ఆనంద్ సాయం చేసేంత లోపులోనే అతను కళ్ళు మూసేస్తాడు. ఇద్దరూ ఒకే పోలిక గనక తన, వృత్తి, ధర్మానికి కీడురాకుండా ఆ ముసుగు అతనికి కప్పి, తాను వట్టి ఆనంద్‌గా విజయ దగ్గరికి వస్తాడు. డాక్టర్ ఆనంద్ చచ్చిపోయాడంటారందరూ. ఆనంద్‌కు పెళ్ళి అయిందనిగాని, అతని వివరాలు గాని తెలియని విజయ అతనితో ఆడుతుంది, పాడుతుంది. ఆనంద్ భార్య కేన్సర్ ట్రీట్‌మెంట్ కోసం మద్రాసు వస్తుంది. బీచ్‌లో విహారిస్తూ సీటితో మునిగిపోతున్న కొడుకును రక్షించి మళ్ళీ ముసుగులో దూరిపోతాడు ఆనంద్. విజయ నిజం తెలుసుకుంటుంది. ఆ నిజం విజయ నుండి అతన్ని దూరం చేస్తుంది. భగ్న హృదయంతో ఇంటికి రాబోతుంటే అతనికారు ప్రమాదానికి గురి అవుతుంది. ఆ తర్వాత విజయ ఉపచర్యలతో మళ్ళీ మనిషవుతాడు. తన ఇంట్లో దొరబడినా అతన్నెవరూ గుర్తించరు. ఈ లోపులో ఆనంద్‌ను హత్య చేశాడని ఒకరిమీద హత్యానేరం మోపబడుతుంది. విచారణలో ఆనంద్‌ను హత్య చేసింది తానని బొంకి వురి శిక్ష వేయించుకుంటాడు ఆనంద్. కథ క్లైమాక్సులో విజయ రంగం మీద ప్రవేశించి ఆనంద్‌ను నిర్దోషిగాచేసి డాక్టర్ ఆనంద్‌గా నిరూపిస్తుంది. తను వంటరిగా మిగిలిపోతుంది.

"ఆనం'' ఒప్పుకోని సైకాలజీని అర్థం రంగా చేసుకున్న సంఘటనలు— ఒకటీ, విజయ డాక్టరానంద్‌ల ప్రేమాయణం. రెండవది, నిర్బంధంలో వుండి కూడా తన భార్యకు పెద్ద కేన్సర్ ఆపరేషన్ చేసి బతికించడం లాంటివి కొంచెం ఎబ్బెట్టుగా వున్నాయి. అవి కథకు ఆయువుపట్టులు గనక వేరే గత్యంతరం లేదు! మొత్తం మీద 'బాగు' అనిపించేట్టు తన పాత్ర నిర్వహించారు దర్శకుడు వి. మధుసూదనరావు. పటుత్వం లేని కథను పట్టుగా నడిపించిన సామర్థ్యం చాలా చక్కనిది.

డాక్టర్ ఆనంద్‌గా యన్.టి. రామారావు నిండైన నటన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. అతని భార్యగా అంజలీదేవి చాలా రోజుల తర్వాత తళుక్కుమంది. కాంచన ప్రశంసనీయంగా నటించి, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంది. పద్మనాభం రమాప్రభల జోడు బాగుంది. హాస్యంలో కొత్తదనం వుంది. రమణారెడ్డి, సి.హెచ్. కృష్ణమూర్తి, రాజ్‌బాబు, చదలవాడ, బేబీపద్మిని, రత్నశ్రీ చిత్రానికి ఆకర్షణ కూర్చి పెట్టారు.

మహాదేవన్ సంగీత రచన ఆద్యంతాలూ మనోహరంగా వుంది. పాటలు, నేపథ్య సంభాషణలు— ఆకర్షించిన ప్రేక్షకులకి ఆనందాన్ని పంచి పెడతాయి. సి. నాగేశ్వరరావు ఛాయాగ్రహణం బాగుంది. ఇన్ని రంగుల్లో, కథ పేలవత్వం మరుగున పడిపోయింది. విజయవంతంకాగల ఈచిత్రం రవీంద్ర ఆర్ట్స్ ప్రొడక్షన్స్ వారిది. నిర్మాత డి. వెంకటరెడ్డి. డిస్ట్రిబ్యూటర్స్ రాయల్ ఫిల్మ్స్.

—సీతారాజు


రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్
డాక్టర్ ఆనంద్
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి. మధుసూదనరావు :: నిర్మాత: డి. వి. రెడ్డి
కథ ఆత్రేయ, వి. మధుసూదనరావు :: మాటలు ఆత్రేయ :: సంగీతం కె. వి. మహదేవన్ :: కెమేరా సి. నాగేశ్వరరావు :: కళ కృష్ణారావు

చిత్రలహరి

ఇద్దరు మొనగాళ్లు

"టర్న్ కృష్ణా!" అరిచారు విఠలాచార్య. అంతా ఆతుకేసి చూశారు. ఎలుగుబంటితో ముందుకి వెళ్తున్న కృష్ణ (గూఢచారి 116) వెనక్కి తిరిగాడు. ఎలుగుబంటి ఆగ్రహంతో మీదకు దుముకబోయింది. రాజభటులు హడలిపోయి కెవ్వుమని కేక పెట్టారు. వారి భయాందోళన చూసి కృష్ణ విరగబడి నవ్వాడు. 'కట్' అన్నారు డైరెక్టరు విఠలాచార్య. ఇది మధు పిక్చర్స్ వారు నిర్మిస్తున్న సాహసోపేత జానపద చిత్రం "ఇద్దరు మొనగాళ్లు"కు చెందిన దృశ్యం. అవాళ చిత్రీకరించిన సన్నివేశాలలో రమణారెడ్డి, రావికొండలరావు కూడ పాల్గొన్నారు. త్వరితగతిన యీ చిత్రం వాహినిలో నిర్మించబడుతున్నది. ఈ చిత్రంలోగల ఏడు పాటలూ చిత్రీకరణ జరిపారు. కాంతారావు, కృష్ణకుమారి, సంధ్యారాణి, సుకన్య, పుష్పకుమారి, యస్.వి. రామదాసు, వెల్లూరి కాంతారావు, సారధి కూడా తారాగణంలో ఉన్నారు. నిర్మాత: పి. మల్లికార్జునరావు. నవంబరుకు పూర్తి అవుతుంది.

ఔట్ డోర్ లో "అవేకళ్లు"

మైసూరు, బెంగుళూరు పరిసర ప్రాంతాలలో "అవేకళ్లు" వర్ణ చిత్రానికి రెండు పాటలు చిత్రీకరించేందుకు ఏ.వి.యం. వారి యూనిట్— ఈ నెల 2 వ తేదీన బయలు దేరి వెళ్లారు. "ఎంతటి అందం విరిసే ప్రాయంలో, ఏవో కలలు కలిసే కన్నులలో" గీతాన్ని బృందావన్ గార్డెన్స్‌లో కృష్ణ, కాంచన, పద్మనాభం, గీతాంజలి, తదితరులపై చిత్రీకరించారు. రెండవది: నాయికా నాయకుల (కాంచన, కృష్ణ) యుగళగీతం. "ముద్దులొలుకు చిన్నది, మురిపించు చున్నది— తలపులేవో కనులలోటి, తెలుపగోరు చున్నది" అనేది. బెంగుళూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించి, ఈ యూనిట్ 12 న మద్రాసుకు తిరిగి వచ్చారు. నవరసభరితంగా రూపొందించబడుతున్న యీ చిత్రానికి దర్శకుడు ఏ.సి. త్రిలోకచందర్. కెమెరా: మారుతీరావు. ఈ రెండు గీతాలు రాసినది దాశరథి. పాడినది సుశీల, ఘంటసాల.

* * *

ఈ యూనిట్ మైసూరు వెళ్లిన తర్వాత మద్రాసులో వర్షాలు పడినవి. కృష్ణను వాహినిలో కలుసుకున్నపుడు "మైసూరులో వర్షాలు లేవా?" అని అడిగాను. "లేకేం, అయిదు రోజులు ఒకే వర్షం! గంట వర్షం, గంట ఎండ. షాట్స్ ఎండవచ్చినప్పుడల్లా తీస్తూండేవారు. ట్విస్ట్ కదూ, కాళ్లు జారేవి..." వాన వెలిసిన తర్వాత పూల మీద, ఆకుల మీద నీటి బిందువులు ఎండకు మెరుస్తూ ఎంత అందంగా ఉండేవనుకున్నారు!" అన్నాడు కృష్ణ అప్పటి అనుభూతుల్ని నెమరు వేసుకుంటూ.

* * *




కొత్త టి. టి. ఎల్. వి.

గూఢచారి 116 విజయాన్ని పురస్కరించుకొని, ఆ చిత్రాన్ని హిందీలో పునర్నిర్మించాలని సంకల్పించుకున్నారు నిర్మాతలు. ఈ విషయమై శ్రీ డూండీ యిటీవల బొంబాయి వెళ్లివచ్చారు. "తారలను ఎన్నిక చేశారా?" అని అడిగాను. అందుకు ఆయన సమాధానంగా "లేదు. పెద్ద తారలకోసం వెళ్తే యిప్పట్లో కాల్‌షీట్లు దొరికేట్టు లేవు. ఇది మూడు, నాలుగు మాసాల కాలంలో పూర్తి చెయ్యాలనుకుంటున్నాము." అన్నారు. "తెలుగు చిత్రం కూడ ప్రారంభిస్తారా?" "అవును. అది కూడ త్వరలోనే ఆరంభిస్తాం. చక్కని కుటుంబగాథా చిత్రాన్నొకదాన్ని నిర్మించాలనుకుంటున్నాము" అన్నారు నవ్వుతూ శ్రీ డూండీ.

* * *

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు యీ నెల 8 వ మద్రాసు వచ్చారు. గృహలక్ష్మి, వసంతసేన చిత్రాలలో పని చేసి 14 న హైదరాబాద్ వెళ్లారు. 12 నుంచి 22 వరకూ పద్మశ్రీ వారి షూటింగ్‌లో పాల్గొని 23 న తిరిగి మద్రాసు వస్తారు. 30 వరకూ భరణీ, విక్రమ్ వారి సహాటం షూటింగుల్లో పాల్గొంటారు.



"మన సంసారం"లో సావిత్రి, నాగేశ్వరరావు.



"శ్రీమతి"లో గీతాంజలి

కంచుకోట

మాధవీదేవి మందిరం ఎంతో శోభాయమానంగా ఉన్నది. సర్వాలంకార భూషితయైన మాధవి అందచందాలకు ముగ్ధురాలయి —ఆమె పుట్టిన రోజు తనది గానే భావించి "ఈ పుట్టిన రోజు, నీ నోములు పండిన రోజు—దివిలో భువిలో కని విని ఎరుగని అందాలన్నీ చిందే రోజు" అంటూ పాడుతూ, తన సఖులతో ఆడు తున్నది జయంతి. మొదట్లోనూ, మధ్య మధ్య లోనూ వచ్చే యీ పల్లవిని గత నెల మూడవ వారంలో — కళాదర్శకుడు యస్. కృష్ణారావు అపూర్వంగా రూపొందించిన మాధవీదేవి మందిరంలో చిత్రీకరించారు. వలభై మంది వాయిద్య గోష్ఠితో, ఇరవై మంది బృందంతో పి. సుశీల పాడిన యీ పాట చిత్రంలో ఆరు నిమిషాలపాటు ఉంటుంది. తన చెలికత్తెకు ఎక్కడలేని అందాలు కూడ పెట్టాలని జయంతి — నక్షత్ర మండలానికి, మానస సరోవరానికి, హిమాలయ శిఖరాలకు వెళ్ళి వచ్చే దృశ్యాలను — చిత్రీకరించేందుకు యీ నెల లోనే ఏర్పాట్లు చేశారు విశ్వశాంతి పిక్చర్స్‌వారు. భారీ మొత్తాన నిర్మించబడుతున్న "కంచుకోట" చిత్రంలోని యీ నృత్యంలో మొత్తం 30 మంది నాట్యగత్తెలు పాల్గొంటారు. సావిత్రి మాధవీదేవిగా నటిస్తున్నది. జయంతి పాత్రధారిణి కుమారి దేవిక. యన్. టి. రామారావు, కాంతారావు, ధూళిపాళ, ప్రభాకరరెడ్డి, రాజనాల, సత్యనారాయణ, పద్మనాభం, వాణిశ్రీ, టి.జి. కమలాదేవి, శాంతకుమారి మున్నగు వారు ముఖ్య భూమికలు పోషిస్తున్నారు. దర్శకుడు: సి. యస్. రావు, నిర్మాత: యు. విశ్వేశ్వర రావు బి. యస్. సి., కెమెరా: జి. కె. రాము.

ఉమ్మడి కుటుంబం

ఇంటి యజమానురాలు (హేమలత) జబ్బుతో మంచాన పడి వున్నది. మూడవ కోడలు (సావిత్రి) వదనంలో దిగులు తొంగి చూస్తున్నది. ఆందోళన పడు తున్నది మనసు. కళ్లలో నీళ్లు ఉబుకు తున్నవి. "అత్తయ్యా, అత్తయ్యా!" అంటూ అత్తగార్ని తట్టి పిలుస్తున్నది. డాక్టరు పశుపతి అవతలి వాటాలోంచి యీ కేక విని మెల్లగా యివతలికి వచ్చాడు. అతని చేతిలో రెండు పది రూపాయల నోట్లు ఉన్నవి. "డాక్టరుగారూ, మా అత్తయ్యను చూడండి!" అన్నది మూడో కోడలు ఆందోళనా పూరిత స్వరంతో. డాక్టరు పశుపతి (అల్లు రామలింగయ్య) ముసి ముసిగా నవ్వుకుని— ఆ నవ్వును బయటికి కనపడనీయకుండా, అతి వినీతుడుగా "అలాగే తల్లీ!" అంటూ మునసలావిడ మంచం దగ్గరికి నడిచాడు. ఇది రామకృష్ణ యన్.ఏ.టి. వారు నిర్మిస్తున్న "ఉమ్మడి కుటుంబం" చిత్రానికి చెందిన దృశ్యం. ఈ నెల 11 న వాహినీ లోని 'ఏ' ఫ్లోర్‌లో చిత్రీకరించారు. దర్శకుడు: యోగానంద్.

ఆస్తిపరులు

జగపతి పిక్చర్స్‌వారి "ఆస్తిపరులు" చిత్ర నిర్మాణం పూర్తి అయింది. రీరికార్డింగ్ జరుగు తున్నది. నాగేశ్వరరావు, జయలలిత, జగ్గయ్య, రేలంగి, గిరిజ, జి. వరలక్ష్మి, గుమ్మడి, సూర్యకాంతం ముఖ్య భూమికలు పోషించారు. నవంబరు 11 న విడుదల చేయాలను కుంటున్నట్లు నిర్మాత శ్రీ వి.బి.రాజేంద్రప్రసాద్ చెప్పారు. సంగీతం కె. వి. మహదేవన్, దర్శకుడు: వి. మధుసూదనరావు.

భూలోకంలో యమలోకం

కళావతి మారు వేషంలో వచ్చింది. దిక్కులు చకాస్తున్నది. కోలాహలం ఆమెను చూశాడు. అతను యువరాజు రాజవాహనుని చెలికాడు. "ఏయ్, ఎవరు నువ్వు? ఏం కావాలి?" అన్నాడు దబాయిస్తూ. "ఏం లేదు, యిక్కడ విజయపురి యువరాజులు ఉన్నారట!" అన్నది కళావతి. "...అటుకే అటు ఏమిటి ఉన్నారు. ఉంటే?" "వాళ్ళ



"నవ్వులు—పువ్వులు"లో రమణ సుధాకర్ల, జగ్గయ్య, అల్లు, పద్మినీకి

చిత్రలహరి

దర్శనం చేసుకోవాలి!" "దర్శనానికి వట్టి చేతులతో వచ్చావా? ఇంతా పూజారికి దక్షిణ తెచ్చావా?.... వయసులో ఉన్న పడుచు పిల్లవి. ఈ రాత్రప్పుడు ఒంటరిగా వచ్చి దర్శనమటు, దర్శనం! పో, పో! మా యువరాజా ఆడపిల్లలతో మాట్లాడరు." అన్నాడు గసురుతూ. ఆమె ఏదో చెప్పబోయింది. కోలాహలం ఆమెను వెళ్ళమని ఒకటే గొడవ చేస్తున్నాడు. రాజవాహనుడికి ఆ కేకలు విని యివతలికి వస్తూ "కోలాహలం, ఏమిటి?" అడిగాడు. ఇటు తిరిగాడు. రాకుమార్తె కళావతిని గుర్తించి నిర్ఘాంత పోయాడు. ఆమె ముందుకు వస్తూ "నేను రాకుమారి కళావతి చెలికత్తెనండీ!" అన్నది. "చెలికత్తెవా? చూడడానికి చురకత్తిలా ఉన్నావు. వచ్చిన పని అయిందిగా, యిక వెళ్ళు మరి!" అన్నాడు కోలాహలం. రాజవాహనుడికి అతడి ధోరణి నచ్చలేదు. "కోలాహలం, నీ పని నువ్వు చూసుకో!" "అదే మిత్రమా! నిన్ను కనిపెట్టుకొని ఉండడం మించి నా కింకోపని ఏముంది? ఒక్క అంగుళం యిక్కణ్ణుంచి కదలను!" అన్నాడు. "కోలాహలం!" రాజవాహనుడు బిగ్గరగా అరిచాడు. అతని చూపుల్లోని తీక్షణతకు భయపడి మెల్లగా జారుకున్నాడు కోలాహలం. ఉత్సుకతను రేకెత్తించే యీ సన్నివేశం— గౌరీ ప్రొడక్షన్స్ వారి "భలే లోకంలో యమలోకం" చిత్రంలోనిది. కళావతిగా రాజశ్రీ, రాజవాహనుడిగా కాంతారావు, కోలాహలంగా రాజబాబు యిందులో పాల్గొన్నారు. రత్న (ప్రసన్న లక్ష్మి) వాణిశ్రీ, పుష్పవల్లి, రాజనాల, ప్రభాకర రెడ్డి, సత్యనారాయణ తారాగణంలో మిగిలిన ముఖ్యులు. రచన: జి. కృష్ణమూర్తి బి.ఏ., సంగీతం: కోదండపాణి, దర్శకుడు: జి. విశ్వనాథం. ఈ చిత్రం ఆంధ్రలో పూర్ణా పిక్చర్స్ ద్వారా నవంబరు 4 న విడుదల కాగలదని తెలుస్తున్నది.

శ్రీ కాంత్ ప్రొడక్షన్స్

"సీతా!" అన్నాడు భక్తుడు. ఆమె కళ్ళల్లోకి ఆశగా చూస్తూ. ఆయన వయసు అరవైకి పైన ఉంది. వయసులో ఉన్న సీతను చూసి దుర్బుద్ధి పుట్టింది. గది పరిశుభ్రం చేసేందుకు వచ్చిన సీతతో సరాగాలు ప్రారంభించాడు. "ఏం, ఎందుకండీ" అడిగిందామె. "నీ దగ్గర అందమే కాదు, తెలివి కూడా ఉంది. కాని పాపం, డబ్బులేదు... కావలసింది. నువ్వు నన్ను ఏది అడిగినా కాదనను!" అన్నాడు. "అంటే?" ప్రశ్నించింది అర్థంకాక. "చీరో చిలకో, నగో నట్రో, డబ్బో గిబ్బో —ఏది కావాలన్నా..." అతడి మాటను మధ్యలోనే తుంచి "నాకంత ఆశలేదులెండి!" అన్నది. "నన్ను అపార్థం చేసుకోవద్దు, సీతా!" అన్నాడు శివనామాలు. రుద్రాక్షమాలతో వున్న ఆ కుటిల భక్తుని అంతర్యం చూసి సీత అసహ్యించుకున్నది. ఇంతలో "ఏమండోయ్!" అంటూ తలుపు తోసుకుని అతడి అర్థాంగి లోపలికి వచ్చింది. ఆమెరాకనెరిగి గతుక్కుమని, ఏం ఎరగనట్లు "సాంబసదాశివ...శివ" అంటున్నాడు. "భక్తులు మాట్లాడుతూ, మాట్లాడుతూ మైకంలో పడ్తున్నారే!" అన్నదా యిల్లాలు భర్త నాటకం కనిపెట్టి ముందుకి వస్తూ. అతను కంగారుపడి "అబ్బే, అదేంకాదు. ఏం సీతా ఇంకా పెళ్ళి ఎందుకు చేసుకోలేదూ అన్నాను." అన్నాడు. "ఆ అవసరం మీకు ఏమిటి అని నోరు ముయ్యమంది కదూ?" అన్నదామె మండి పడుతూ. "హర హర శంభో" అంటూ ఆయన మెల్లగా బయటికి తప్పుకున్నాడు. "సిరి" తమిళ చిత్రం ఆధారంగా నిర్మించబడుతున్న శ్రీకాంత్ ప్రొడక్షన్స్ వారి చిత్రంలోనిదీ సన్నివేశం. సీత కుమారి దేవిక, భక్తుడు కోటేశ్వరరావు, యిల్లాలు హేమావతి. రేలంగి, శోభన్‌బాబు, కాంతారావు, చలం, సూర్యకాంతం, అల్లు రామలింగయ్య, రాజ్‌బాబు, ఎ.యల్. నారాయణ, రమణారెడ్డి, విజయనిర్మల తారాగణంలో యితర ముఖ్యులు. సంభాషణలు: పినిశెట్టి, సంగీతం: టి. వి. రాజు, దర్శకుడు: బి. ఏ. సుబ్బారావు. సగానికిపైగా యీ చిత్రం తయారయింది.

—మోహన్‌కుమార్

పుస్తకాలు

అక్షరాల గవాక్షాలు:

అక్షరాల గవాక్షాలు: కవితా సంపుటి: కవి: డా. సి. నారాయణరెడ్డి. ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు. పుటలు: 152. సాదా ప్రతి వెల రు 2. పైలు ప్రతి వెల రు 3.

ఉత్తమ కవిత్వం యొక్క ముఖ్య లక్షణం హృదయ సంబంధి అయివుండడం. అనంత సృష్టిని అన్ని రీతుల్లోనూ అవలోకించి, తాను గ్రహించిన అంతరార్థాన్ని, త్రికాల బాధ్యంగా, సహృదయ హృదయ రంజకంగా చెప్ప గలిగిన వాడే ఉత్తమ కవి. అభినవాంధ్ర సాహిత్య లోకంలో ఒక అంతస్తు గడించిన కొన్న ప్రతిభాశాలి శ్రీ నారాయణరెడ్డి. 'ఆంధ్ర మహాకవి'గా ప్రచురణ కర్తలాయన్ను పరిచయం చేశారు. షేక్స్‌పియర్, గెటే, వ్యాస వాల్మీకాదులను మహాకవులుగా పేర్కొంటూ నారాయణరెడ్డి గారి వంటి కవులను ఉత్తమ కవులుగా సంభావించడంలోని ఔచితి స్ఫురించదు.

కవితా రంగంలో క్రొత్త రీతుల, మార్పు, క్రొత్త పోకడలు పోయిన సమీక్షలలో విద్వాంస్యంగా నారాయణరెడ్డిగారు వైశిష్ట్యం కలవారు. విశిష్టమైన సంస్కారబలంతో, ప్రతిభకు తమకు గల కౌండిణ్య జోడుచేసి అర్థవంతమైన పద్ధతిలో అక్షర సేవ చేస్తున్నవారు. ఆ కవి హృదయ స్పందనాన్ని, అక్షర గవాక్షాలగుండా, కవితా భావాలకి వాహకంగా చెప్పి, "అక్షరాల గవాక్షాలు" తిలకించిన పాఠకుడు. ఇది అకాడమీ అవార్డు నందుకొన్న కవితా సంపుటి మాత్రమే. కాని, నారాయణరెడ్డిగారి సాహిత్య సృష్టికి తలమానికం మాత్రం కాదు. ఇందులో 'మానవ గీతం'తో ప్రారంభమైన కవితాగానం 'అక్షరాల గవాక్షాలు'తో "మగం వచ్చిన పూల జీవులకు నమస్కార భిక్ష" పెట్టడంతో అంతమవుతుంది. చమత్కారాన్ని ఒక విశేషంగా భావించినా, అలంకారికులు దాన్ని ఉత్తమ లక్షణం క్రింద గౌరవించలేదు. చక్కిలిగింతలు పెట్టడానికి తప్ప ఇవ్వరు తుడవడానికి కదా సాధనం కావలదా!

నారాయణరెడ్డిగారి కవితకు శబ్ద మాధుర్యమూ, శ్రవణ సుభగమూ ముఖ్య లక్షణాలు. కారణాలేమైనా ఈ కవితా సంపుటిలో ఆ రెండు లక్షణాలూ అంత ఘనంగా కనబడటం లేదు. ఒకే రకమైన పదన్యాసం వాడబడిన కారణం చేత, గేయానికీ గేయానికీ మధ్య గల సంబంధం తెగిపోయినట్లు భ్రాంతిని కల్పిస్తున్నది. పైగ కొన్ని కొన్ని ప్రయోగములు కూడా అంత సమంజసంగా కనబడడం లేదు.

'మానవ గీతం'లో "బాజావట్టి పోయా కాలుబలు అలలో నాగి పోగనే" అన్నట్టున్న సాగిపోవడానికీ, బూతా పెట్టడానికీ కల సంబంధాన్ని గమనించవలసి వస్తుంది. పైగా 'సాగిపుండడం' పదము యొక్క విశ్వసనీయతకి చిహ్నం. అదే గేయంలో "చేయి చేయి కలిపిన వికసించుమన వెచ్చని స్నేహము" అన్న చోట 'వెచ్చని స్నేహము' అన్న ప్రయోగం "Warm friendship" అన్న ఇంగ్లీషు ప్రయోగానికి అనువాదం క్రింద కనిపిస్తున్నది. ఆంగ్లంలోని Warmth భావనకు 'వెచ్చదనం' — అంటే తప్ప 'వెచ్చని' అని తీసుకుంటే అనువాదం కుదురుతుంది తప్ప భావార్థం కుంటుపడుతుంది. అట్లాగే "అణువులు పగిలించువాడు మానవుడా కాడు" అనడంలో కూడా రెడ్డిగారు కొంచెం తొందరపాటు చూపారు. అణువిచ్ఛిత్తితో దానవత్వం లేదు, ఆ విచ్ఛిత్తి ద్వారా వినాశనానికి యత్నించడంలో దానవత్వం వున్నది. "పగిలించువాడు" అనడంలో వారు భావించినది ఇదే అంటే, ఆ భావన సరిగా ప్రకటింప బడలేదు అని చెప్ప వలసి వస్తుంది.

ఈ సంపుటిలోని కొన్ని ఖండికలలో కొందరు భారతీయ రచయితల భావాలు, క్రొత్త రూపం ధరించి బయట పడుతున్నాయి.

ఉదాహరణకు: "పాడూ వేదూ" అన్న గేయంలో సరోజినీదేవి భావాలూ, "సాట్నాడే స్మృతులు" మొదటి నాలుగు పాదాల్లోనూ హరీంద్రనాథ చట్టోపాధ్యాయ భావనా సరళి కొట్టవచ్చినట్లు కనబడుతున్నాయి. శ్రీమతి సరోజినీ దేవి, ఒకానొక ఖండికలో "భగవంతుడా! నన్ను సుఖాన్ని కాదు, దుఃఖాన్ని కూడా అనుభవించనీ" అంటుంది. అట్లాగే "కన్నీరా? పన్నీరా?" అన్న ఆలోచన అలము కొంటుంది నారాయణరెడ్డిగారి మనస్సులో. అట్లాగే హరీన్ చట్టో వ్రాసిన "The Shepherd" అన్న ఖండికలో "My soul is a shepherd Leading the sheep of hours. Silverly across wide silences Strewn with singing flowers He is driving his lonely Old grey-silver sheep Towards the solitary fold of inward — shining sleep" అని వ్రాస్తే శ్రీ రెడ్డిగారు "నా స్మృతులు నాల్కల్ని తోడుక్కొని, నడిరేయి ఏమిటో నమగుతున్నాయి, గతమనే మువలి గోవును కట్టేసి, నిర్దయగా అమృతాల్ని పిదుకుతున్నాయి" అంటారు. వ్యాఖ్య అనవసరం.

ఈ కవితా సంపుటిలోని గేయములలోని, పద్యములలోని, మరొక లక్షణం నాటకీయత. ఒకానొక వేదాంత రహస్యమును, జగద్రహస్య సిద్ధాంతాన్ని, తెలిసీ తెలియనట్లు చెప్పడం. ఒక 'మెరుపు తొరసాని ముంగురు లెట్లో దువ్వి' తను యింటి లోపల ప్రతిష్ఠించు కుంటారు కవిగారు. 'ఏదో నాదపరిమళమ్ము' ఆయన 'మనస్సులోలోపలి పందనమున' కాల్మొక్కుతుంది. ఆ మనస్సు లోనే 'శిలల రసీభవించే' ఆ మనస్సే వేదనా నమ్మిళితమై, ఆశా సంగీతాన్ని పాడు కొంటుంది. కన్నీటి తెరల్లో కలగుండు పడుతుంది. జావలేక బ్రతుకుతున్న జీవితాల్లో అంద మేది? అర్థమేది? అని ఆక్రోశిస్తుంది. విశ్వకవికీ, కందుకూరికీ, గురజాడకూ, కవిరేకి, వేమనకూ, గిడుగు రామమూర్తికీ, అంజలి ఘటిస్తుంది వైనాన్ని కొందరిస్తు పరువతుంది. ఇట్లా దేశీయ విదేశీయ సంఘటనల్నీ తనను కలత పెట్టినప్పుడెల్లా, సమర్థత కలవాడు కనుక, సాహిత్య దృష్టికి గొప్పదనం కల్పించే విధంగా

నారాయణరెడ్డిగారు కవిత చెప్పి అప్పుడే పించు

పుస్తకాలు

కున్నీ, అకాడమీ అవార్డును పొంద గలిగారు. కవిగా ఎన్ని మజిలీలు తను దాటి వచ్చింది, ఇంకా ఎన్ని మజిలీలు తను వేయవలసింది తెలుసుకోడానికి నారాయణరెడ్డిగారికీ కవితా సంకలన మొక మంచి సాక్ష్యం. కవిగా ఆయనపై తమకు గల అభిప్రాయాలను మరింతగా పెంచుకొనడానికి ఆంధ్రపాఠకులకిదొక సదవకాశం. —శ్రీరామచంద్రమూర్తి ●

రాగములో రంగులు:

రచన : ఇల్లిందల సరస్వతీదేవి. ప్రచురణ : యం. శేషాచలం అండ్ కంపెనీ. మద్రాసు. పేజీలు: 176. వెల: సాధా ప్రతిరూ. 3. మేలు ప్రతి రు. 4.

అట్టమీద "రాగములో రంగులు" అనీ, లోపలి పేజీలలో "రాగంలో రంగులు" అనీ, వ్యవహృతమైన ఈ పుస్తకం, నాటికా సంకలనం. అవి దృశ్య నాటికలుకావు. శ్రవ్య నాటికలు. ఆకాశవాణివారు ప్రసారంచేసే రూపకాలవర్గంలోనివి. ముఖ్యంగా స్త్రీల కార్యక్రమంలో ప్రసారం చేయబడినటువంటివి. కేవలం స్త్రీలకోసం, స్త్రీల చేత వ్రాయబడిన నాటికలనుగూర్చి సాహిత్యదృష్ట్యా పరిశీలించడం అనవసరమైనప్పటికీ, శేషాచలం కంపెనీవారు తమ ఇతర ప్రచురణములలో దేనినీ ముద్రించనంతటి సుందరంగా దీన్ని ముద్రించి ఇది ఒక అద్భుత సాహిత్యసృష్టి అని భ్రమ కల్పించిన కారణంచేతా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల మంత్రివర్యులు డా. శ్రీ యం. ఆర్. అప్పారావుగారు దీనికి తొలిపలుకు వ్రాసి "ఇవి శ్రవ్య నాటికలుగా రచింపబడినప్పటికీ, ప్రదర్శనయోగ్యంగా కూడా ఉండడం ముదావహం" అన్న కితాబు ఇచ్చినందునా, దీనినిగూర్చి కొంతగా వ్రాయకతప్పడంలేదు. ఈ సంపుటిలో పన్నెండు 'నాటిక' లున్నాయి. "పచ్చిమ కాయలు" మొదటి నాటిక. స్త్రీలలో అసూయ, తాటాకు మంటలా ఎంత చప్పున రగుల్కొనేదో ఇందులో చిత్రింపబడింది. కాని ఆ నాటికలోని పాత్రలైన మీనాక్షి, కమల, సులోచన, తారాబాయిలలోగల విభిన్నవ్యక్తిత్వలక్షణ ప్రదర్శనమాత్రం జరుగలేదు. పైగా పాత్రల మధ్య 'సంఘర్షణ' లేకపోయిన కారణంచేత "సంభాషణల రూపకం" క్రింద తేలిపోయింది. ఇదే విషయాన్ని ఒక నాటికగాకాక, గల్పికగా రచించి వుట్లయితే మరింత రక్తికట్టేది! "మగ మహారాజు" రెండవ నాటిక. కేవలం మగవాళ్లను తిట్టడానికీ, ఆడవాళ్లను, మగవాళ్లు హింసపెట్టి బాధిస్తున్నారన్న తమ నమ్మకాన్ని స్పష్టం చేయడానికీ వ్రాసినట్లుందేతప్ప, ఒక కళాఖండం క్రింద మలచాలన్న ప్రయత్నం అందులో కన్పించలేదు. "కనిపించిన ఆడదానితో లేచిపోయే మగవాణ్ణి" చిత్రించడం కొందరు రచయిత్రులకు హాబీకావడం, సమకాలీన తెలుగు సాహితికి పట్టిన దురదృష్టం. "కాంతమ్మగారి పేరంటం"లో ఒక క్రొత్తదనాన్ని ప్రవేశపెట్టడానికి రచయిత్రి యత్నించారు. మునిమాణిక్యంగారి కాంతం, చింతావారి వటిరావు, చలంగారి పద్మావతి, నండూరివారి యెంకి, భారతంలోని సత్యభామ ఇందులో పాత్రలు. భావముంచిదే. కాని కథలో ఆ పాత్రల్ని ఇముడ్చడం కుదిరింది కాదు. పేరంటం విషయంతో పలుగురి లొక్కచోటికు చేరడంతప్ప, మరో విశేషంలేదు. సమకాలీన తెలుగు కవులను, వారి రచనలనూ తీసుకుని శ్రీ తెన్నేటి సూరి 'భారతి'లో "సాహిత్య సమవాకారం" అంటూ నో నాటిక వ్రాశారు కొన్నేళ్లక్రితం. పద్మావతీదేవిగారు, ఆ నాటికను చదివి దాన్ని అనుసరించివున్నా, మరికొంత ప్రయోజనం లభించివుండేది. "ఆవేదన" పిల్లను అత్తవారింటికి పంపేటపుడు తలిదండ్రులుపడే క్షోభను చిత్రించే నాటిక. "విమర్శకుడు" కుకవివిమర్శకులమీద విమర్శ. ఉన్నవాటిలో "యశోధర", "రెండవ ఆట" గ్రుడ్డిలో మెల్లగా ఉన్నాయి. కానీ, అవి కూడా శిల్ప దృష్ట్యాకాని, శైలిరీత్యాకాని పరిపూర్ణాలు కావు. "రాగంలో రంగులు" సారథి విచిత్ర మనస్తత్వాన్ని చూపించేయత్నం. "కొత్త కోడలు" కూడా ఒక రకంగా ప్రచార సాహిత్యంలోకే వస్తుంది. కొత్త కోడళ్ళను అత్తలు ఎలా సమయాతనలు పెట్టారనీ, ఆ కోడళ్ళకు తమ భర్తల చల్లటి పలకరింపులువల్లనే స్వాస్థ్యం చేకూరగలవనీ రచయిత్రి నిశ్చితాభిప్రాయమైనట్లు పాఠకుడికి అనిపిస్తుంది. "రెండవ ఆట" నాటికలో మాత్రమే కొంత కథవుంది. కపి నాటిక పేరుకూ, లోపలి విషయానికీ అంతగా సంబంధంలేదు. భార్యనూ, బిడ్డనూ కాదని గోపాలరావు అనే నో ప్రబుద్ధుడు చంద్రరేఖతో సరసాలాడి చివరకు ఆమె మరణించగా, కట్టుకున్నవారివంచన్న కన్న బిడ్డడి వాత్సల్యంతో పునీతుడు కావడం కథ వస్తువు. కథ ఇక్ష్వాకుల నాటిదైనా సంభాషణలు నాటికను రక్తి కట్టించాయి. "ఆడపిల్ల" కేవలం ఆడపిల్లలనే పరుసగా కంటున్నందుకు కొంత తన భర్త, అత్తగారు చేతుల్లో ఎట్లా చిన్నబుచ్చబడిందీ కరుణాత్మకంగా చిత్రిస్తుంది. "స్వాతంత్ర్యవీరుడు" ఒక పత్రికా సంపాదకుడు తను నమ్మిన సిద్ధాంతాల కోసం ఆత్మ బలిదానం చేయుడం ఇతివృత్తంగా గల నాటిక. అక్కడక్కడ చదివినప్పటికీ, ఆ సంపాదకుణ్ణి హత్య చేసేటంత బలంత్తరమైన కారణం అతని ప్రత్యర్థులకు ఏమి వున్నదో తెలియ టంలేదు. "హితచింతకుడు" పరభాగ్యోపజీవులైన అవధాన్లుగారి పాత్ర చిత్రం అని చెప్పవచ్చును. ఈ నాటికలన్నింటిలోనూ రచయిత్రి స్త్రీ జనపక్షపాతి అని ఆమె స్పష్టంగా తెలియజేసుకుంటూరు. పురుషుల అహంకృతినీ, స్త్రీ తన దౌర్భాగ్యాన్ని మాత్రమే ఎత్తి చూపటానికయితే నాటికలే వ్రాయనక్కరలేదు. వ్యాసాలు, గల్పికలు వ్రాసుకున్నా రచయిత్రి పని సార్థకం అయివుండును. "నాటకాంతంహి సాహిత్యమ్" అన్న సంగతిని దృష్టిలో వుంచుకుని, సాహిత్యమంటే కొంచెంగానైనా అర్థం చేసుకొని, ఈనాటి రచయిత్రులు కృషి సాగిస్తే, ఇంతకన్నా మంచి సాహిత్యం ఉత్పత్తి అవుతుంది. "డ్రాయింగ్‌రూం సంఘటన"లనూ, 'కిచెన్‌రూమ్ స్టోరీస్'ను మాత్రమే సాహిత్య వస్తువులుగా తీసుకోక విశాల దృక్పథంతో జగత్తును వీక్షిస్తే, సరస్వతీదేవిగారు, తమకుగల చమత్కార సంభాషణా చాతురితో, సులభశైలితో, పరిణతానుభవంతో, ఇంతకన్నా మంచి రచనలుచేయు గలరు. దృశ్య నాటికలు కానీ నాటికి ఆ గౌరవాన్ని కట్టబెట్టడంలో మంత్రివర్యులు తమ ఉదారతను చాటుకున్నారు తప్ప, సాహిత్యజ్ఞానాన్ని ప్రదర్శించలేదు. —శ్రీరామచంద్రమూర్తి. ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

